# స్వధర్మ యోగం

## అనువైన వృత్తిలో ఎనలేని ఆనందం!



డా. సి.వి.రావు

# Vivekananda Hospital

**25** Years of Commitment

*A Hospital with Human Touch*

## 100 Bedded Multi Speciality Hospital

## Our Services

- General Medicine / Diabetology
- General Surgery (Laparoscopy)
- Obstetrics & Gynaecology (Laparoscopy &Hysteroscopy)
- Paediatrics & Neonatology (Level 2 care)
- Orthopaedics & Trauma Care (Arthroscopy)
- Oncology (Medical & Surgical)
- Gastroenterology (Medical & Surgical)
- ENT (Nasal Endoscopy & Video Laryngoscopy also available)
- Diabetic Foot & Wound Care
- Bariatrics / Obesity Surgery
- Neurology & Neuro Surgery
- Dermatology
- Plastic & Cosmetic Surgery
- Cardiology (Consultation, Echo)
- Pulmonology
- Urology
- Nephrology
- Radiology - (Digital X-ray, Ultrasound Colour Doppler)
- ICU / Critical Care Medicine
- Psychiatry - Psychology
- Physiotherapy
- Wellness (Nutrition & Yoga)
- Geriatrics
- Dental
- 24 Hours Lab Facility
- 24 Hours Pharmacy
- Ambulance Facility



## Vivekananda Hospital

6-3-871/A, Greenlands Road,
Besides CM Camp Office, Begumpet,
Hyderabad 500 016, Telangana, India.
Tel +9140 4383 9999 M +91 7377 222 777

/ItsVivekanandaHospital

/vivekanandahospital

vivekanandahospital.in

**Non Covid Hospital**

# స్వధర్మయోగం

## అనువైన వృత్తిలో ఎనలేని ఆనందం!


**రచన**

**'స్వధర్మయోగి' డా. సి. వి. రావు**



**కపిల మహర్షి రిసెర్చ్ ఫర్ రిసోర్సెస్**

**హైదరాబాద్**

**SWADHARMA YOGAM**

**ANUVAINA VRUTTILO YENALENI AANANDAM !**

*by* ***Dr. C.V.Rao***

*First Edition :* March, 2021

© Kapila Maharshi Research for Resources (KMRR)

Printed at : Rainbow Print Pack, Hyderabad
Editing : Sri M.B.S. Prasad
Cartoonist : Sri B. Bhanu Prakash
Layout : Sri T. Naveen
Cover Design: Sri P. Ravikishore

**K**apila **M**aharshi **R**esearch for **R**esources
404, Sridurga Enclave,
Jayaprakash Nagar, Yellareddyguda,
Hyderabad - 500 073, TS
Phone : 040-23747607, 9849977607
email : feedback@kapilayoga.org

*For Copies :*
**Navodaya Book House**
Opp: Aryasamaj Mandir
Kachiguda, Hyderabad.
Contact No: 040-24652387, 9000413413
www.telugubooks.in

Price : Rs.150/-

# అంకితం

నాకు తెలిసిన యోగవిద్యకు

బహుళ ప్రాచుర్యం కల్పించిన

**కీ.శే. వల్లూరుపల్లి నాగేశ్వరరావు గారికి....**

# విషయ సూచిక


1. నేను ఏ వృత్తిలో రాణిస్తాను? .................................... 19
2. కొందరే ఎందుకు రాణిస్తున్నారు? .................................... 21
3. ఏది పాషన్? ఏది స్వధర్మం ? .................................... 23
4. తరచి చూసుకోండి .................................... 25
5. స్వధర్మం తెలుసుకున్నాక ఏమి చేయాలి? .................................... 27
6. చేస్తున్న వృత్తిలో కొనసాగుతూనే, .................................... 29
7. 'అరకొర పనిమంతులు' అంటే ఎవరు ? .................................... 32
8. నైపుణ్య శిక్షణ, రిఫ్రెషింగ్ కోర్సులు ఎంత అవసరం? .................................... 34
9. పనిలో విసుగు, పరధ్యానం ఎందుకొస్తాయి? .................................... 37
10. పనిలో కొత్త ఒరవడి తేవాలంటే .................................... 42
11. నేటి పనిమంతుడే- రేపటి శ్రీమంతుడు .................................... 44
12. కష్టమర్ల సంతృప్తికి గీటురాయి ఏది? .................................... 48
13. స్వధర్మ మార్గంలో చేయవలసిన పనులు .................................... 51
14. సొంత వృత్తి లేదా వ్యాపారాన్ని ఎలా మొదలెట్టాలి ? .................................... 55
15. వ్యాపారంలో భాగస్వామిని ఎలా ఎంచుకోవాలి ? .................................... 61
16. మీ బిజినెస్‌లో సరైన మానవ వనరుల ఎంపిక ఎలా? .................................... 63
17. బిజినెస్‌లో లేదా వృత్తిలో పోటీని ఎదుర్కోవటం ఎలా? .................................... 66
18. వృత్తిపరంగా ఎదురయ్యే సంక్షోభాలను ఎలా అధిగమించాలి ?..... 69
19. చేసే ఉద్యోగంలోనే స్వధర్మాన్ని ఆస్వాదించడం ఎలా? .................................... 71
20. రోజూ పోరాటం చేస్తూ గెలవాలా? .................................... 76
21. మనసుకు సెల్ఫీ .................................... 78
22. చింత తగ్గించుకునే ప్రక్రియ .................................... 81
23. గ్యారంటీ వుందా? .................................... 83
24. మంచి చెయ్యి – మనశ్శాంతి నీ వెంటే వస్తుంది..! .................................... 85
25. మనశ్శాంతికి ముఖ్యంగా కావలసినది – భద్రతాభావం .................................... 88

# KMRR ఇతర ప్రచురణలు












# ఎందుకీ పుస్తకం?



ఎవరూ పుస్తకాలు చదవని ఈరోజుల్లో మరో పుస్తకమా? అనుకోకండి. ఇది మనందరం ఎదుర్కుంటున్న ఒక సమస్య మూలకారణాలను అన్వేషించే ప్రయత్నం. నేటి సమాజంలో ఎటుచూసినా మనకు కనబడుతున్నదేమిటి? అశాంతి, అసంతృప్తి, మానసికమైన క్రుంగుబాటు, తద్వారా అనారోగ్యం.

తన సామర్థ్యానికి, పనికి తగిన గుర్తింపు, ఆదాయం రావటం లేదని ఉద్యోగుల బాధ. వారి పనిలో నైపుణ్యం లేదని, చిత్తశుద్ధి కొరవడిందని, మనసు పెట్టి పని చేయటం లేదని వారికి ఉద్యోగం, లేదా పని యిచ్చినవారి, లేదా వినియోగదారుడి ఫిర్యాదు. ఒక ఉద్యోగి వినియోగదారుడిగా, లేక సేవలందుకునే వాడిగా మారినప్పుడు మరొక ఉద్యోగిపై యిలాంటి అభిప్రాయాలే కలిగి వుంటున్నాడు.

ఎవరికి వారు వారి కోణంలో నుంచే చూడడంతో యీ సమస్య వస్తోంది. మనిషి ఎంతసేపూ తన వ్యక్తిగత సుఖశాంతుల గురించే తపన పడుతున్నాడంటే తనలో గూడుకట్టుకున్న “నేను - నా యిబ్బంది” అనే సంకుచిత భావనయే దానికి మూలకారణం. కానీ, వాస్తవదృష్టితో ఆలోచిస్తే మనలో ఏ ఒక్కరం కూడా ఈ సమాజంలో ఇతరుల సహకారం, సామరస్యంతో పని లేకుండా మనంతట మనంగా అభివృద్ధి కాలేదు, కాబోము కూడా!

శతాబ్దాల సంస్కృతి ద్వారా కొన్ని వేల నీతిబోధక గ్రంథాలు మనకు జ్ఞానసంపదగా సంక్రమించాయి. మహనీయుల సందేశాలు, గురువుల ప్రవచనాలు దశాబ్దాల తరబడి వింటూ వస్తున్నాము. మనశ్శాంతిని ఎలా పొందాలో ఎవరికి తోచిన పద్ధతులలో వారు చెప్పుకొస్తున్నారు. కానీ ప్రజల్లో మార్పు వస్తోందా? లేదనే చెప్పాలి. భగవద్గీతను అందరం గౌరవిస్తాం కానీ దానిలో కర్మాచరణ గురించి చెప్పినది మర్చిపోతాం, గుర్తున్నా ఆచరణలో పెట్టం.

అన్నిటికీ మూలమైన పనిని (కర్మను) ఒక ధర్మంగా భావించి, గౌరవించి, నిపుణతతో దానిని నిర్వర్తించినపుడే వ్యక్తి రాణిస్తాడు. ప్రతి వ్యక్తి యిలాంటి ధోరణి అలవర్చుకున్నపుడు వారి సమిష్టి శ్రమశక్తి సమాజాన్ని సుసంపన్నం గావించి, దాన్ని మెరుగ్గా తీర్చిదిద్దుతుంది. ఇది జరగాలంటే ముందుగా ఆ వ్యక్తి తను ఏ పనికి తగినవాడో, ఏ రంగంలో తను రాణిస్తాడో, తన స్వధర్మమేదో తెలుసుకోగలగాలి. అప్పుడే అతని పనితీరు మెరుగుపడుతుంది. తగినంత గుర్తింపు, ఆదాయం ఒనగూడి అతని అసంతృప్తి, అశాంతి దూరమవుతాయి.

2020 సం.లో ప్రపంచ పౌరులందరూ లాక్‌డౌన్ పేర యిళ్లల్లో బందీలయినపుడు, సేవలందక ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది కదా! ప్రజలంతా నిరాశలో కూరుకుపోయారు కదా! 3 నెలల్లోనే ప్రపంచం 3 దశాబ్దాలు వెనక్కి వెళ్లిపోయినట్లయిందిగా! దీనిని బట్టి అర్థమయ్యేదేమిటంటే – మనుషుల మనుగడ, ఆరోగ్యం, ఆనందం, అభివృద్ధి సమస్తానికి వృత్తిపనివారు అందించే సేవలు, సరుకులే ప్రధానమని, పుట్టెడు డబ్బున్నా, పట్టెడు అన్నం కోసం మొహం వాచాలనీ!

కనుక మనందరికీ ఒకరి సేవలు మరొకరికి కావాలి. అది కూడా నాణ్యమైన సేవలు కావాలి. ఇది సాధ్యపడాలంటే సమాజంలోని ప్రతి వ్యక్తి తను చేసే పనిని ప్రేమించి, విలువిచ్చి, ఎంచుకున్న వృత్తి పట్ల క్రమశిక్షణ, అంకితభావం చూపాలి. నాణ్యత లోపిస్తే ఎల్లెడలా నిరాశానిస్పృహలే. అద్భుత ఫలితాలు రావాలంటే వ్యక్తి తన గురించి తను సంపూర్ణంగా తెలుసుకోవాలి, ఆత్మవిశ్లేషణ చేసుకుని బలాబలాలు, యిష్టాయిష్టాలు అవగాహన చేసుకోవాలి. తన మనసు ఎటుందో, **స్వ–ధర్మమేదో** గుర్తించాలి. ఆ దిశగా అతనికి దోహదపడడానికి యీ పుస్తకం!

స్వధర్మయుతమైన మార్గంలో జీవనాదాయంతో పాటు అమితమైన ఆత్మసంతృప్తిని కూడా ఎలా పొందవచ్చునో ('జాబు శాటిస్ఫాక్షన్, జేబు శాటిస్ఫాక్షన్.. రెండూ' అని చమత్కరిస్తారు కొందరు) ఈ చిన్న పుస్తకంలో (ఆడియో బుక్‌గా కూడా వెలువడుతోంది) సంక్షిప్తంగా వివరించే ప్రయత్నం చేశాను. నా స్వధర్మావలంబనతో సాధించిన ఆత్మవిశ్వాసంతోనే ఈ చిరు సాహసం చేయగలిగానని మనవి.

ఈ మార్గంలో మన వృత్తిలో, మన రంగంలో మనకు మనమే సాటిగా, పోటీగా నిరంతర కృషితో కొత్త ప్రమాణాలు సృష్టించవచ్చును. మన పనిని నిబద్ధతతో చేస్తూ మన సేవలందేవారే కాక, యితర వృత్తులు, రంగాలలోని వారు సైతం గౌరవించే

స్థాయికి చేరవచ్చు. అందరిలో యీ అవగాహన కలిగి, ఆచరణలో పెట్టినపుడు ఉపాధి అవకాశాలకై వేరెవరివైపూ చూడవలసిన అవసరం పడదు. నిరుద్యోగి చిరునామాకై వెతకాల్సి రావచ్చు.

స్వధర్మం అంటే ఏమిటి? దానిని ఎలా గుర్తించాలి? ఎలా అమలు చేయాలి? అనే విషయాలను చర్చించిన యీ పుస్తకం నిరుద్యోగులకు, చిరుద్యోగులకే కాదు, తన రంగంలో పైమెట్టుకు చేరాలనుకునే ప్రతి వ్యక్తికి ఉపయోగపడుతుందని నా ప్రగాఢ విశ్వాసం. అందువలన యీ సందేశాన్ని సాధ్యమైనంత ఎక్కువ మందికి అందించమని మిమ్మల్ని సవినయంగా ప్రార్థిస్తున్నాను.

ఎందుకంటే తన వృత్తికుశలతపై, నైపుణ్యంపై ఆత్మస్థయిర్యం పెంపొందిననాడు బ్రతుకంటే, భవిష్యత్తంటే భయం విడిచిపోతుంది. ఆత్మహత్యలు తగ్గిపోతాయి. దానితో బాటు ఇతరుల కౌశలాన్ని, వృత్తిగౌరవాన్ని (డిగ్నిటీ ఆఫ్ లేబర్) గుర్తించి తగురీతిన సంభావించడం జరుగుతుంది. 'సత్యమేవ జయతే' నినాదంతో బాటు 'శ్రమయేవ జయతే' నినాదం కూడా మన జాతీయవిధానంగా మారుతుంది.

ఈ స్వధర్మయోగ మార్గం విజయ సోపానాలకు, తాత్కాలికమైన గెలుపులకు అతీతమైనది. జయాపజయాలు చుట్టూ వున్న ప్రపంచానికి సంబంధించినవి. ఇది ఆత్మవికాసానికి, సామాజిక పురోగతికి సంబంధించినది. శ్రమలోనే ఆనందాన్ని, జీవన సౌందర్యాన్ని చవి చూడవచ్చునని స్వానుభవం నుండి నేర్చుకున్న సత్యాన్ని మీతో యీ పుస్తకం ద్వారా పంచుకుంటున్నాను. ఈ ప్రయత్నాన్ని మీరు హర్షిస్తారని, ఆదరిస్తారని నా ఆకాంక్ష. ఈ పుస్తకరచనలో సహకరించిన మిత్రులు, మా సంస్థకు ఆత్మీయులు, రచయిత, సంపాదకులు శ్రీ ఎమ్బీయస్ ప్రసాద్ గారికి కృతజ్ఞతలు. సోదాహరణాల సహకారం అందించిన కె.లక్ష్మీగంగావతి, అక్షర సవరణలు చేసిన ఎం.పల్లవిలకు అభినందనలు. ఈ పుస్తక విషయ, సమీక్ష, సవరణలకు తోడ్పడిన శ్రీ వై.చంద్రమౌళి, తదితర మిత్రులందరికీ అభివందనం. పుస్తక ప్రచురణకు సహకరించిన దాతలకు కృతజ్ఞతాభివందనం!

**– 'స్వధర్మయోగి' డా. సి.వి. రావు**

**సంస్థాపక సంచాలకులు**

**కపిల మహర్షి రీసెర్చ్ ఫర్ రిసోర్సెస్**

# శ్రీ వల్లూరుపల్లి నాగేశ్వరరావు గారు



భారతదేశ ఇంజినీరింగ్ నిర్మాణాల రంగంలో ఓ స్ఫూర్తిదాయకమైన ధృవతార శ్రీ వల్లూరుపల్లి నాగేశ్వరరావు. డ్యామ్‌లు, బ్యారేజీలు, హైవేలు వంటి అత్యంత భారీ నిర్మాణాలు జాతి పురోగతికి చిహ్నాలు. అటువంటి నాణ్యమైన కట్టడాలను జాతికి అందించి జాతి నిర్మాణానికి దోహదపడిన మన తెలుగు వ్యక్తి శ్రీ వల్లూరుపల్లి నాగేశ్వరరావు. విద్యావేత్తగా దేశంలోనే పేరెన్నిక గన్న విద్యాసంస్థలను నెలకొల్పి, దాతగా ఎన్నో వైద్య, విద్య, సేవా సంస్థలకు వెన్నెముకగా నిలిచి సమాజ శ్రేయస్సుకై నిరంతరం పాటుబడ్డ మానవతామూర్తి శ్రీ వల్లూరుపల్లి నాగేశ్వరరావు (వి.ఎన్.ఆర్.)

కృషి, పట్టుదల, శ్రమ, ఆత్మవిశ్వాసం, దూరదృష్టి, విలువలు, క్రమశిక్షణ–వీటన్నింటి మానవరూపమే శ్రీ వి.ఎన్.ఆర్. సామాన్యుడిగా మొదలుపెట్టి మాన్యుడుగా ఎదిగి "జీవితం అంటే జీవించడం కాదు, అర్థవంతంగా జీవితాన్ని గడపడం" అని నిరూపించి చూపిన మార్గదర్శి వారు.

తరతరాల వారికి స్ఫూర్తిగా నిలిచే జీవితాన్ని గడిపిన శ్రీ వల్లూరుపల్లి నాగేశ్వరరావు కృష్ణాజిల్లా లోని గండిగుంట అనే కుగ్రామంలో శ్రీ రత్తయ్య, శ్రీమతి సీతమ్మ దంపతులకు 1921 నవంబర్ 15న జన్మించారు. వీరిది రైతుకుటుంబం. ఈ దంపతులకు మొత్తం ఐదుగురు సంతానం– నలుగురు ఆడపిల్లలు, ఒక మగ పిల్లవాడు. ఒక్కడే మొగ పిల్లవాడు కావటంతో నాగేశ్వరరావు అంటే అందరికీ ప్రత్యేక అభిమానం ఉండేది. అయితే నాగేశ్వరరావుకు నాలుగు సంవత్సరాల వయసున్నప్పుడే తండ్రి అనారోగ్యంతో పరమపదించడం జరిగింది.

చిన్న వయసులో భర్తని కోల్పోయిన శ్రీమతి సీతమ్మ పిల్లలని అన్నీ తానై పెంచింది.

అటు వ్యవసాయ పనులు, ఇటు ఇంటిపనులు, పిల్లల పనులనూ చేస్తూ ఎంతో కష్టపడుతున్న అమ్మకు చేదోడు వాదోడుగా ఉండేవాడు చిన్నారి వి.ఎన్.ఆర్. అమ్మతో బాటే కోడి కూయక ముందే లేవడం, గొడ్లచావిడికి వెళ్లి శుభ్రపరచడం, పాలు పితకడం, చెరువు కెళ్లి నీళ్లు తీసుకురావడం, పొలంకెళ్లి పనులు చేయడం వంటివి చేస్తూ అమ్మకు సహాయకారిగా ఉండేవాడు. చిన్నారి వి.ఎన్.ఆర్‌కు తల్లే తొలి గురువు. కష్టపడే తత్త్వం, క్రమశిక్షణ, నలుగురినీ ఆదరించే స్వభావం లాంటి ఎన్నో గుణాలను అమ్మ నుంచే నేర్చుకున్నాడు.

స్వాతంత్ర్యానికి పూర్వం పల్లెటూళ్లలో చదువులు అంతంత మాత్రంగానే ఉండేవి. అందుకే చిన్నారి వి.ఎన్.ఆర్ చదువు ఐదవ తరగతికి మించలేదు. అయితే జీవితంలో ఎదగటానికి భాషలు ఎంతో ముఖ్యమని తరువాతి కాలంలో తెలుసుకున్నాడు. అందుకే దగ్గర్లోని మచిలీపట్నం వెళ్లి ఇంగ్లీష్ ట్యూషన్లకి హాజరయి ఆంగ్ల పరిజ్ఞానాన్ని పెంపొందించుకున్నాడు. చిన్న వయసులో తండ్రి అనారోగ్యంతో మరణించడాన్ని చూసిన వి.ఎన్.ఆర్, ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెట్టే వాడు. ఈడ్పుగల్లులోని వ్యాయామశాలకి వెళ్లి క్రమం తప్పకుండా వ్యాయామం చేసేవాడు. వ్యవసాయ పనులు లేనప్పుడు ఊరిలోని యువతనందరినీ చేరదీసి వ్యాయామాలు, బరువులెత్తించడం వంటి సాధన చేయించేవాడు. గండిగుంట మరియు చుట్టుపక్కల గ్రామాల్లో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు జరిగినా వాటిలో మిత్రులతో కలిసి ఉత్సాహంగా పాల్గొనేవాడు.

తన ఆలోచనలకి దగ్గరగా వున్న కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితుడై, ఆ పార్టీ కార్యకలాపాలలో విరివిగా పాల్గొనేవాడు. రంగు, రూపు, కులం, మతం, ధనిక, పేద గురించి ఏనాడూ పట్టించునేవాడు కాదు. అన్ని సామాజిక వర్గాలతో కలిసి సహపంక్తి భోజనాలు చేసేవాడు. మనుషులందరూ ఒక్కటేనన్న భావనను అణువణువునా నింపుకున్నాడు.

నిరంతరం చైతన్యవంతంగా ఉండే శ్రీ వల్లూరుపల్లి నాగేశ్వరరావును రైతులందరూ కలిసి ఊరిలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘానికి అధ్యక్షులుగా ఎన్నుకోవడం జరిగింది. రెండేళ్లపాటు ఉండే ఆ పదవిలో ఎందరో రైతులకి పంట ఋణాలు, ఎడ్లబండ్లు వంటివి కొనుక్కునేందుకు ఆ సంస్థ ద్వారా ఋణసదుపాయం కల్పించి, వారి ఉన్నతికి కృషి చేశారు.

శ్రీ వి.ఎన్.ఆర్ కు తన 18వ యేట  అనగా 1939లో పొరుగు గ్రామమైన కనుమూరుకు చెందిన యలమంచిలి వారి ఆడబడుచు వజ్రమ్మతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం.

కమ్యూనిస్టు పార్టీ కార్యకలాపాల వల్ల జైలు కెళ్లవలసి రావడం, పార్టీలో, ఊరిలో కుటిల రాజకీయాలు పెరిగిపోవడం, పిల్లలతో పాటు ఆర్థిక అవసరాలు పెరగడం, పిల్లల చదువులు, కుటుంబ భవిష్యత్తు నిమిత్తం తమ గ్రామానికి 25 కిలోమీటర్ల దూరంలోని విజయవాడ పట్టణానికి 1950లో షిఫ్ట్ అయ్యారు శ్రీ వి.ఎన్.ఆర్.

విజయవాడకు మకాం మార్చే సమయానికి వి.ఎన్.ఆర్ గారి వయస్సు దాదాపు ముప్పయి సంవత్సరాలు. కష్టించి పనిచేయడం, భాషలు నేర్చుకోవడం, ఆరోగ్యంపై శ్రద్ధ వహించడం, తరతమభేదాలు లేకుండా అందరితో కలిసిపోవడం, ఎటువంటి దురలవాట్లు చేసుకోకపోవడం, నలుగురికీ ఉపయోగపడటం వంటి మంచి లక్షణాలను ఆ వయసుకల్లా తనలో నింపుకుని ఒక వ్యక్తిగా తనను తాను చెక్కుకున్న శ్రీ వి.ఎన్.ఆర్ జీవితం, విజయవాడ కొచ్చిన తర్వాత కొత్తపుంతలు తొక్కింది. అక్కడ వ్యాపార రంగంలోకి అడుగిడి సరికొత్త విజయాలను నమోదు చేసుకున్నారు.

ఎలక్ట్రికల్ పనులపై తనకున్న అవగాహన, అభిరుచి వల్ల విజయవాడ గవర్నరుపేటలో “మాచికండ్ ఎలక్ట్రికల్ స్టోర్స్” పేరుతో ఎలక్ట్రికల్ దుకాణాన్ని ప్రారంభించారు. అనతికాలంలోనే పట్టణంలో పేరుమోసిన రెండు ఎలక్ట్రికల్ దుకాణాలలో ఒకటిగా నిలచింది. శ్రీ వి.ఎన్.ఆర్ కష్టించే తత్వమే ఆయనను వ్యాపార రంగంలోకూడా నిలద్రొక్కుకునేలా చేసింది. ఆ సమయంలో ప్రపంచములోనే అతి పెద్ద డ్యామ్‌గా పేరుగాంచిన నాగార్జున సాగర్ డ్యామ్ నిర్మాణం జరుగుతోంది. ఆ ప్రాజెక్టుకు చెందిన స్టాఫ్ క్వార్టర్స్ భవనాలకు ఎలక్ట్రిక్ వైరింగ్ చేసే కాంట్రాక్ట్ శ్రీ వి.ఎన్.ఆర్ కు వచ్చింది. ఆ పనిని సకాలంలో పూర్తిచేసి ప్రాజెక్ట్ అధికారుల మన్ననలను పొందారు. వి.ఎన్.ఆర్ గారి పనితనం, పనిని  పర్యవేక్షించే విధానం, నిర్దిష్ట సమయానికి పూర్తి చేసే నిబద్ధత – ఇవన్నీ నచ్చిన ప్రాజెక్ట్ అధికారులు వారిని డ్యామ్ సివిల్ కాంట్రాక్టును కూడా చేయమని ప్రోత్సహించారు. నాగార్జున సాగర్ వంటి చారిత్రాత్మక డ్యామ్ నిర్మాణంలో సివిల్ కాంట్రాక్టులను పొందడం వి.ఎన్.ఆర్ గారి అంకిత భావం, వృత్తి కౌశలానికి లభించిన గౌరవంగా చెప్పవచ్చు. అంతేగాక వి.ఎన్.ఆర్

కెరీర్ నిర్మాణరంగం వైపు మళ్లడానికి దోహదపడింది. ఒకే రోజులో 603 క్యూబిక్ మీటర్ల మేసనరీ పనిని చేయించి వి.ఎన్.ఆర్ రికార్డు సృష్టించారు. డ్యామ్ నిర్మాణరంగంలోనే అరుదైన ఈ రికార్డును సాధించినందుకు శ్రీ వల్లూరుపల్లి నాగేశ్వరరావు SEW సంస్థ **1967లో నాటి ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ చేతుల మీదుగా బంగారు పతకాన్ని అందుకోవటం జరిగింది.** ఇంజినీరింగ్ నిర్మాణాల రంగంలో వి.ఎన్.ఆర్ స్థిరపడటానికి నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణం గట్టి పునాది వేసిందని చెప్పాలి.

1957 ప్రారంభం నుండి సివిల్ కాంట్రాక్టులను తమ పూర్తి స్థాయి వృత్తిగా మలుచుకున్న శ్రీ వి.ఎన్.ఆర్ 1958లో **"సదరన్ ఇంజినీరింగ్ వర్క్స్(SEW)"**ను స్థాపించారు. 1970 వరకు సాగిన నాగార్జున సాగర్ డ్యామ్ నిర్మాణంలో పలు సివిల్ కాంట్రాక్టులను పొంది అనుకున్న సమయాని కన్న ముందే పూర్తిచేసి అందరి మెప్పును పొందారు.

నాగార్జునసాగర్ తర్వాత మధ్యప్రదేశ్‌లో తవా ప్రాజెక్టు నిర్మాణ కాంట్రాక్టు పొందారు. ఆ సమయంలో పాకిస్తాన్‌తో యుద్ధం రావడంతో అన్ని ధరలూ ఆకాశాన్నంటాయి. ప్రాజెక్టు నిర్మాణం నష్టాల్లోకి వెళుతుందని తెలిసినా మొదటి ఒప్పందం మేరకు, పనులను ఆపకుండా సకాలంలో పూర్తిచేసి అందరి ఆశ్చర్యానికి, అభిమానానికి పాత్రుడయ్యారు వి.ఎన్.ఆర్. ఆ నష్టాల సంక్షోభంతో స్వగ్రామానికి తిరిగొచ్చేశారు. భవిష్యత్తు ఏమిటన్న సంశయంలో ఉన్న సమయంలో, వచ్చిన నష్టాల్ని ప్రభుత్వం భర్తీ చేయడం, కొత్తగా శ్రీశైలం ప్రాజెక్టు పనులు కూడా రావడంతో వి.ఎన్.ఆర్ ఇక వెనుకకి చూడవలసిన అవసరం రాలేదు. వారి SEW సంస్థ ఆ తరువాత వరుసగా ఎన్నో భారీ నిర్మాణాలను దేశవ్యాప్తంగా నిర్మించి ఇంజినీరింగ్ నిర్మాణాల రంగంలో ఓ ప్రత్యేక స్థానాన్నీ, గుర్తింపునూ, గౌరవాన్నీ తెచ్చుకుంది. **మధ్యప్రదేశ్‌లో గంభీర్ డ్యామ్ నిర్మాణాన్ని కేవలం ఏడు నెలల స్వల్ప వ్యవధిలో నిర్మించి నాటి ప్రధాని శ్రీ పి. వి. నరసింహారావు చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని పొందడం SEW సంస్థ కీర్తికిరీటంలో ఓ కలికితురాయిగా చెప్పవచ్చు.**

శ్రీ వి.ఎన్.ఆర్ గారి SEW సంస్థ తక్కువ సమయంలోనే భారతదేశంలోని పదహారు రాష్ట్రాలలో తమ నిర్మాణ కార్యకలాపాలను విస్తరించే స్థాయి కెదిగింది.

డ్యాములు, బ్యారేజీలు, కెనాల్స్, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు, టన్నెల్స్ నిర్మాణంలో SEW ఓ బ్రాండ్ ఇమేజ్‌ను సంపాదించుకుంది. సంస్థ వ్యవస్థాపకులుగా, చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్‌గా శ్రీ వల్లూరుపల్లి నాగేశ్వరరావు కృషి మాటల్లో చెప్పలేనిది. సైట్‌లో ఉన్నప్పుడు అవసరమైనప్పుడు ఎటువంటి భేషజానికి పోకుండా పంచె పైకి కట్టి, పలుగు, పార చేతబట్టి తాను పని చేసి, పనివాళ్లను ఉత్సాహపరచడం, దగ్గర్నుండి నిర్మాణాల డిజైన్స్, లే అవుట్స్ రూపకల్పనలో ఇంజనీర్లకు సలహాలిచ్చే స్థాయిని అందుకోవడం వారి పరిశీలనా దృష్టి, మేధస్సు, దూరదృష్టి, శ్రమ, నిబద్ధతలకు నిదర్శనంగా చెప్పవచ్చు. వి.ఎన్.ఆర్ గారి సారథ్యంలో వేలమంది నిష్ణాతులైన సిబ్బంది కలిగిన వ్యాపార కుటుంబంగా ఎదిగిన SEW సంస్థ 1983లో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగానూ, 1988లో డీమ్డ్ పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగానూ, తిరిగి 2001లో పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగాను అంచెలంచెలుగా పురోగమించింది. 2007-08 నాటికీ 1200 కోట్ల టర్నోవర్‌ను సాధించడం ఆ సంస్థ అపూర్వ విజయంగా చెప్పవచ్చు.

వెలిగే దీపమే ఇతర దీపాలను వెలిగించగలదు. అలా శ్రీ వల్లూరుపల్లి నాగేశ్వరరావు ఎందరి జీవితాల్లోనో వెలుగులు నింపారు. పొందింది ఎప్పుడూ పంచాలనుకునేవారు. స్వగ్రామంలో ఉండే రోజుల్నుంచే నలుగురికి ఉపయోగపడే పనులు చేసేవారు. వరి బస్తాలు ఇంటికి చేరిన తర్వాత ఆ ఊర్లో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారి నందరినీ పిలిచి ధాన్యాన్ని కొలిచి ఉచితంగా ఇచ్చేవారు. విద్య, వైద్యం- వీటికి అత్యంత ప్రాధాన్యమిచ్చేవారు. మిత్రులతో కలిసి **"విజ్ఞాన జ్యోతి ఎడ్యుకేషన్ సొసైటీ"**ని నెలకొల్పి రంగారెడ్డి జిల్లా బాచుపల్లిలో ఇంజినీరింగ్ కళాశాలను స్థాపించడంలో ముఖ్యపాత్ర పోషించారు. వారు చేసిన కృషికి, దాతృత్వానికి ఆ విద్యాసంస్థకు శ్రీ వి.ఎన్.ఆర్ గారి పేరు పెట్టడం జరిగింది. **శ్రీ వల్లూరుపల్లి నాగేశ్వరరావు విజ్ఞానజ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీగా** పిలువబడే ఆ విద్యా సంస్థ ఈ రోజు భారతదేశంలోని పది ఉత్తమ ఇంజినీరింగ్ కాలేజీలలో ఒకటిగా భాసిల్లుతున్నది. అలాగే తన తల్లిదండ్రులైన శ్రీ వల్లూరుపల్లి రత్తయ్య, సీతమ్మ గార్ల పేరుమీద ఒక ట్రస్టు ఏర్పాటు చేసి ఒక రెసిడెన్షియల్ స్కూల్‌ను 1995 లో బాచుపల్లిలో నెలకొల్పారు. ఈ

స్కూలు విద్యార్థులను ఆదర్శవంతమైన పౌరులుగా తీర్చిదిద్దే సదాశయంతో దిగ్విజయంగా నడుస్తున్నది. అలాగే విజయవాడలోని సిద్ధార్థ అకాడమీ, గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ అండ్ పాలిటెక్నిక్ కాలేజీ మరియు స్కూల్‌కి, గండిగుంటలో ప్రాథమికోన్నత పాఠశాల పునర్నిర్మాణానికి తన వంతు సహాయసహకారాలు అందించారు.

ఇక వైద్యరంగంలో కూడా విశేషమైన సేవను చేసారు వి.ఎన్.ఆర్. డాక్టర్ అయిన తన పెద్ద కుమారుడు డా. వెంకటరత్నంతో హైదరాబాద్ బేగంపేటలో 1995లో **"వివేకానంద ఆసుపత్రిని"** నెలకొల్పి అందుబాటు ఫీజులతో వైద్యాన్ని అందించేలా చూసారు. అలాగే నాగార్జునసాగర్ డ్యామ్ నిర్మాణ సమయంలో పనిచేస్తున్న ఉద్యోగులు, పనివారి కోసం నిర్మింపబడ్డ కమలా నెహ్రూ హాస్పిటల్‌లో పిల్లల వార్డును తన డబ్బులతో కట్టించి సహృదయతను చాటుకున్నారు శ్రీ వి.ఎన్.ఆర్. ఉయ్యూరు-కాటూరు రోడ్డులో కంటి ఆసుపత్రికి మరియు ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి నాలుగెకరాల భూమిని విరాళంగా ఇచ్చారు. బాచుపల్లి చుట్టుపక్కల ఏడు గ్రామాలను దత్తత తీసుకొని డాక్టర్, నర్సులతో కూడిన ఒక సంచార వైద్యశాలను నడిపి పేదలకు ఉచిత వైద్యాన్ని అందించేలా చూసారు.

విద్య, వైద్య రంగాలతో పాటు ఇంకా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలకి సహాయ సహకారాలు అందించారు. హైదరాబాద్ కొండాపూర్ లో వయోవృద్ధులకు చక్కని వసతులతో కూడిన **సి.ఆర్. ఫౌండేషన్ ట్రస్ట్** వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించారు. జాతీయ జెండా రూపశిల్పి శ్రీ పింగళి వెంకయ్య గారి స్మారక భవన నిర్మాణానికి, అమీర్‌పేటలో 'కమ్మ సంఘం" సంస్థకీ భూరి విరాళాలు అందజేశారు. అలాగే స్వగ్రామం గండిగుంటలో మంచినీటికోసం బోర్లు వేయించడమే గాక ఓవర్‌హెడ్ వాటర్‌ట్యాంకును నిర్మించారు. ఊర్లోని హరిజనవాడలో మరుగుదొడ్లను నిర్మించి ఇచ్చారు. ఇంకా రెండో కంటికి తెలియకుండా చేసిన గుప్తదానాలు, అందించిన సహాయసహకారాలకు లెక్కే లేదని చెప్పవచ్చును. !

బాధ్యతాయుతమైన తండ్రి తన పిల్లలనూ బాధ్యతతోనే ఎదిగేలా చూసుకుంటారు. అందుకే శ్రీ వి.ఎన్.ఆర్ గారి పిల్లలు, మనవలు బాధ్యతలను చదువుకున్నారు. పుస్తకాలలో వెతికినా కనబడని జీవితసారాన్ని వారి దగ్గర నేర్చుకున్నారు. అందుకే వారందరూ ప్రయోజకులు, విద్యాధికులు, సంస్కారవంతులయ్యి అన్ని విధాలా వి.ఎన్.ఆర్ గారికి వారసుల మనిపించుకున్నారు.

**డా. సి.వి.రావు**

శ్రీ వి.నాగేశ్వరరావు, వజ్రమ్మ గార్ల పెద్ద కుమారుడు డా.వెంకటరత్నం ENT స్పెషలిస్టు వైద్యునిగా రాణించగా, రెండో కుమారుడు శ్రీ రాజా రామ్మోహన్ రావు చాలా కాలం SEW సంస్థ సారథ్య బాధ్యతలు వహించారు. కుమార్తె శ్రీమతి సుశీల, వైద్యుడైన డా.లజపతిరాయ్ ని వివాహమాడి ఇంగ్లండులో స్థిరపడ్డారు. ప్రస్తుతం నాగేశ్వరరావు గారి మనవడు శ్రీ వల్లూరుపల్లి రాజశేఖర్ SEW సంస్థ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ సంస్థను మరింత అభివృద్ధిపథంలో పయనింప జేస్తున్నారు. ప్రతి మనిషిలోనూ అనంతమైన శక్తి దాగి ఉంటుంది. దానిని వినియోగంలోకి తెచ్చుకోవడంలోనే మనిషి విజయం ఆధారపడి ఉంటుంది. అలా తనలోని శక్తిని సంపూర్తిగా వాడుకుని ఆకాశమే హద్దుగా విజయపరంపరని కొనసాగించిన వ్యక్తి శ్రీ వల్లూరుపల్లి నాగేశ్వరరావు. వారు వేసే ప్రతి అడుగు, చేసే ప్రతి చేత – సమాజహితం కోసమే ఉండేది. ఏది జరిగినా 'మన మంచికే' అనే పాజిటివ్ దృక్పథంతో ఉండి **ఏ పని చేసినా ఇతరులెవ్వరూ చేయలేనంత గొప్పగా చేయగలగాలి** అనే దృఢసంకల్పంతో సాగిన శ్రీ వి.ఎన్.ఆర్, వృద్ధాప్య సమస్యలతో తన తొంభై మూడవ ఏట అనగా డిసెంబర్ 4, 2014న ఈ లోకాన్ని వీడారు.

**వ్యాపారస్తుడిగా విజయుడై, గృహస్తుగా మార్గదర్శి అయ్యి, వ్యక్తిగా మహోన్నతుడై, కన్నవారికి, పుట్టిన గడ్డకి, చేపట్టిన వృత్తికి గౌరవాన్ని తీసుకొచ్చి నిండైన జీవితాన్ని గడిపి, జీవితాన్ని పండించుకున్న శ్రీ వల్లూరుపల్లి నాగేశ్వరరావు గారి 'జన్మ' నిజంగా ధన్యం! ధన్యం!!**

# స్వధర్మ యోగం - అనువైన వృత్తిలో ఎనలేని ఆనందం !

**- డా. సి.వి.రావు**

ప్రియ మిత్రులారా..! .

అణువంత సూక్ష్మజీవి ఆధునిక ప్రపంచాన్ని గడగడలాడించి కాలచక్రాన్ని - "కోవిడ్ ముందు- కోవిడ్ తర్వాత" గా విభజించాల్సి వచ్చిన పరిస్థితిని తెచ్చిపెట్టింది. లక్షలాది మంది మరణించడంతో బాటు అనేక దేశాలు లాక్‌డౌన్ ప్రకటించడంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమయ్యింది. ముడిసరుకు అందుబాటులో లేక అనేక సంస్థలు ఉత్పత్తి చేయలేక పోయాయి. కొనుగోలుదారుల చేతుల్లో డబ్బులు ఆడక ఉత్పత్తి చేసినదానిని సైతం అమ్ముకోలేక మూతపడిపోయాయి. రాకపోకలపై ఆంక్షలు విధించడంతో అనేక పరిశ్రమలు నష్టపోయాయి. పర్యవసానంగా అనేకానేక సంస్థలు ఉద్యోగులను పని నుండి తొలగించడంతో లక్షలాది మందికి ఉపాధి పోయింది. ఉద్యోగులు మాత్రమేనా, వృత్తిపనివారు, కళాకారులు, బడుగు వ్యాపారస్తులు అందరూ సంపాదించే అవకాశాలు కోల్పోయారు. వస్తువులు అమ్ముడు పోనప్పుడు వాటికి మరమ్మత్తులు చేసేవారి సేవలు వినియోగించుకునే వారెవరు?

వస్తూత్పత్తితో ప్రత్యక్ష, పరోక్ష సంబంధం లేని వాళ్లంటూ ఎవ్వరూ వుండరు. ఆ సరుకు తయారీ కోసం సాంకేతిక జ్ఞానం, అమ్మకం కోసం వాణిజ్య పరిజ్ఞానం, ప్రచారం కోసం భాషా పరిజ్ఞానం.. వీటన్నింటికీ మానవ వనరులే ఆధారభూతం. అదే విధంగా వస్తు వినిమయం కూడా మనుషుల ద్వారానే జరుగుతుంది. వస్తువులకు సంబంధించిన సేవలు అందించేవారూ మనుషులే. వారి వారి నైపుణ్యం బట్టి ఆ యా రంగాలలో రాణిస్తారు, జీవనోపాధి ఆర్జించుకుంటారు. కరోనా వైరస్ కారణంగా కార్యకలాపాలు స్తంభించడంతో యీ వినిమయవృత్తం దెబ్బ తింది.

దీని కారణంగా ఉపాధి అవకాశాలు, ఉద్యోగాలు హరించుకుపోతాయి అని భయపడి బెంగపెట్టుకుందామా? పరిస్థితులు మారినప్పుడు వాటికి అనుగుణంగా మారగలిగేవాడికి ఎప్పుడూ ఢోకా వుండదు. టేప్‌రికార్డరులు వున్నంత కాలం అవి

రిపేరు చేసేవాళ్లుండేవారు. అవి మూలపడ్డాక వాళ్లేమై పోయారు? వీడియో కాసెట్టు రిపేరర్లుగా అవతారమెత్తారు! ఇప్పుడు అవీ పోయాయి. ఇంకో రకమైన సర్వీసులోకి వెళ్లి వుంటారు. వేసవిలో చలివేంద్రం పెట్టి గడించినవాడు వర్షాకాలంలో రెయిన్‌కోట్‌లు అమ్మి గడిస్తాడు. కరోనా అనంతరం కూడా మనుషులున్నారు. వాళ్లకు అవసరాలు వుంటాయి. కొత్త అవసరాలేమిటో గ్రహించి, అవి తీరిస్తే కొత్త రకమైన జీవనోపాధి అమరుతుంది. ఉద్యోగం కానీ, స్వయం ఉపాధి కానీ, వృత్తి పని కానీ – అవసరానికి, కాలానికి అనుగుణంగా మారుతూ, పని చేసే తీరులో యితరుల కంటె మెరుగ్గా వుండేవారికి సంపాదన తప్పకుండా వుంటుంది. జీవితంలో ఎదుగుతారు. పనితనం, నిజాయితీ రెండూ కలగలిస్తేనే ఉద్యోగ ధర్మం అనిపించుకుంటుంది. ఇక్కడ ఉద్యోగం అంటే వేరే వారి వద్ద జీతానికి కొలువు చేయడం అనే అర్థంలో వాడటం లేదు. తమ నైపుణ్యాన్ని ఉపయోగించుకుని సంపాదించే అందరూ ఇదే కోవకు చెందుతారు. వేరేవారి వద్ద పని చేసే ఉద్యోగులలో అభద్రతాభావం అనునిత్యం పెరుగుతున్న యీ రోజుల్లో స్వయం ఉపాధి బాట పట్టడం యువతకే కాదు, సమర్థత గలవారందరికీ అనువైనది. వారిపై యిలాంటి సంక్షోభ సమస్యల ప్రభావం తక్కువనే చెప్పొచ్చు. ఎవరైనా సరే, వృత్తిలో రాణింపు అనేది ముఖ్యం. అలా రాణించాలంటే ముందుగా ఆ వృత్తి తన స్వభావానికి, అభిరుచికి, శక్తిసామర్థ్యాలకు అనుగుణంగా వుందా లేదా అనేది తేల్చుకోవాలి.

✡ ✡ ✡

# 01. నేను ఏ వృత్తిలో రాణిస్తాను?

'నో దై సెల్ఫ్' అంటారు ఇంగ్లీషువారు. నిన్ను నీవు తెలుసుకో అనే మాట వినడానికి ఎంతో సులభంగా అనిపించినా ఆచరణలో చాలా కష్టం. 'నేనెవరిని? ఎక్కణ్నుంచి వచ్చాను? ఎక్కడికి వెళతాను?' అనే వేదాంతపరమైన ప్రశ్నలకు సమాధానం ఎంత కష్టమో యిదీ అంతే కష్టం. నా గురించి నేను తెలుసుకోవడం అంటే నా బలమేమిటి? నా బలహీనత ఏమిటి? నేను ఎందుకు పనికి వస్తాను? ఫలానాదానిలో నాకు ఆసక్తి వుందా లేదా? ఆసక్తి ఉన్నా శక్తి చాలుతుందా? కావలసిన శక్తి సమకూర్చుకోవడానికి ఎంతకాలం పడుతుంది? ఇవన్నీ అంచనా వేసుకోవాలి. ఈ బేరీజు వేసుకోవడం కూడా సకాలంలో, సత్వరంగా, పుణ్యకాలం గడిచిపోక ముందే వేసుకోకలగాలి. నడివయసు వచ్చాక 'నేను ఏరోప్లేన్ పైలట్ కావాల్సింది' అనుకుంటే ఏం లాభం?

తనకు అనుగుణమైన పని – దీన్నే స్వధర్మం అంటారు – తెలుసుకున్నాక దానినే అంటిపెట్టుకుని సాధన చేయాలి. మధ్యలో మరొకటి ఆకర్షణీయంగా అనిపించి, అడ్డదారిలో దాన్ని సాధించవచ్చని అనుకుని దీన్ని వదిలిపెడితే రెంటికి చెడ్డ రేవడి అవుతారు. దీనిలోనే చావో రేవో తేల్చుకోవాలి అన్నంత పట్టుదలతో యీ వృత్తిలో మునిగి తేలాలి. ఈ విషయాన్నే పెద్దలు భగవద్గీతలో కృష్ణుడి ద్వారా చెప్పించారు.

**శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్ స్వనుష్ఠితాత్,**

**స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః. (3:35)**

**తా :** చక్కగా అనుష్టింప బడిన పరధర్మము కంటే, గుణము లేనిదైనను స్వధర్మమే మేలు! పర ధర్మము భయము కొల్పునది. ఆచరణకు అనుచితమైనది.

వినడానికి యిదేదో సనాతనధర్మంలా, చాదస్తపు ప్రవచనంలా అనిపించినా యీ కాలానికీ వర్తిస్తుంది. ఇక్కడ గ్రహించవలసినది ఒకటుంది. గుణము అంటే యిక్కడ కారెక్టర్ అని కాదు. ప్రభావము అని. మందు గుణం చూపించింది అంటాం కదా, ఆ అర్థంలో యిక్కడ ఉపయోగించారు. స్వధర్మం ఆచరిస్తున్నపుడు దాని ప్రభావం,




అంటే ఫలితం వెంటనే కనపడక పోవచ్చు. కనబడినది మన ఆశలకు అనుగుణంగా లేకపోవచ్చు. అంతమాత్రం చేత దాన్ని విడిచి పెట్టకూడదు. సాధన చేయాలి. సాధించాలి. ఎందుకంటే ఫలితం త్వరగా వస్తుందని మరొక వృత్తిలోకి దూకితే, దానిలో మనకు నేర్పు లేక అక్కడ విఫలం కావచ్చు. సైకిలు మరమ్మత్తు చేసేవాడు, సైకిళ్ల వాడకం తగ్గగానే స్కూటర్ రిపేరులోకి, వాటి వాడకం తగ్గగానే మోటర్‌సైకిల్ మరమ్మత్తుకి వెళ్లవచ్చు. కారు మెకానిక్‌గా మారితే మార్కెట్లో కొత్త మోడల్ రాగానే దాని సంగతి గ్రహించి, ఆ పనీ చేపట్టవచ్చు. ఎందుకంటే వాహనాల మరమ్మత్తు అనేది అతని వృత్తి. అనుకున్నంత ఆదాయం రాలేదని దానిని వదలి అతను ఏ స్వర్ణకార వృత్తికో, బట్టల నేతకో మారితే దెబ్బ తింటాడు. ఇదీ భావం.

ఈ రోజుల్లో రకరకాల రంగాల్లో ఎంతో బాగా రాణించిన వాళ్లను మీరు ఓ సారి గమనించండి. వాళ్లందరూ లాటరీ టికెట్ కొని అదృష్టవంతులు కాలేదు. నచ్చిన రంగంలో కష్టపడి, కిందామీదా పడి, దాన్నే అంటిపెట్టుకుని, క్రమేపీ ఉన్నతస్థాయికి వచ్చిన వాళ్లే! “మేము కష్టపడకుండానే అభివృద్ధిలోకి వచ్చాము“ అని చెప్పగలిగేవారున్నారా? ‘అనేక ఇబ్బందులను అధిగమించి ఈ స్థితికి చేరాం’ అంటారు. ఇక్కడే అసలు గుట్టు వుంది. అన్ని ఇబ్బందులు అన్నాళ్ళు ఎందుకు పడ్డారు వాళ్లు? ఆ వృత్తి అంటే వాళ్లకు అపారమైన ప్రేమ వుంది గనుకనే కష్టాలు ఓర్చుకున్నారు. వారసత్వసౌలభ్యం వున్నవారికి ప్రవేశం సులభమే కానీ, నిలదొక్కుకోవాలంటే వృత్తిని ప్రేమించాలి. లేకపోతే రాణించలేరు. రవీంద్రనాథ్ టాగూరు కుమారుడు రచయిత కాలేదు. మహమ్మద్ రఫీ కుమారుడు గాయకుడు కాలేదు. అభిరుచి, నైపుణ్యం అనేవి వ్యక్తిగతమైనవి.

✡ ✡ ✡

## 02. కొందరే ఎందుకు రాణిస్తున్నారు?
## ఇంకొందరు ఎందుకు రాణించటం లేదు?

దీనికి సమాధానం కావాలంటే ముందుగా వేసుకోవలసిన ప్రశ్న - ప్రస్తుత పరిస్థితుల్లో వృత్తిని ఎలా ఎంచుకుంటున్నాం? అని. ఫలానా వృత్తి గౌరవప్రదంగా వుంటుందనో, సామాజికంగా స్థాయి కలిగి వుంటుందనో, విదేశాలకు వెళ్లేందుకు వీలు కలిగిస్తుందనో, ధనం బాగా సంపాదించవచ్చునో, తల్లితండ్రుల ముచ్చట తీరుస్తుందనో ఎంచుకోవడం జరుగుతోంది తప్ప వ్యక్తిగతమైన అభిరుచిని, యిష్టాయిష్టాలను, శక్తిసామర్థ్యాలను బేరీజు వేసుకుని ఎంచుకోవటం లేదు. ఆ వృత్తికి సంబంధించిన కోర్సులో చేరినప్పుడే యీ విషయం బయటపడుతోంది.

ఏదైనా ఒక పంటకు ఒక ఏడాది గిరాకీ వస్తే రైతులందరూ అదే పంట వేసి, మరుసటి ఏడాదికి దిగుబడి పెంచుతారు. దాంతో మార్కెట్‌లో సరుకు ఎక్కువై పోయి, డిమాండ్ పడిపోతుంది. అదే మాదిరిగా విద్య విషయంలో కూడా వేలంవెర్రిగా అందరూ ఒకే కోర్సులో చేరడం వలన ఉద్యోగార్థులు ఎక్కువై పోయి, చాలినన్ని ఉద్యోగాలు దొరకటం లేదు. ఏడాది తిరిగేసరికి సుమారు 50 వేల మంది ఇంజనీర్లు తయారువుతూంటే ప్రతీ ఏటా అన్ని ఉద్యోగాలు సిద్ధం కావు కదా!

అలా అని వీరిలో ఎవరికీ ఉద్యోగం రాకుండా లేదు. ఎవరికి వస్తోంది, ఎవరికి రావటం లేదు అంటే మార్కెట్ అవసరాలతో ప్రమేయం లేకుండా ఆ చదువుపై శ్రద్ధ, ఆసక్తి కలిగి, దాన్ని స్వధర్మంగా ఎంచి, దానిపై పట్టు సాధించినవారికి ఉద్యోగం లభిస్తోంది. ఇతరుల బలవంతం మీద చదివినవారికి చదువు ఒంటబట్టక ఉద్యోగ ప్రయత్నాలలో విఫలమవుతున్నారు. ఈ పరిస్థితి చూసే 'కష్టపడి చదవకండి, ఇష్టపడి చదవండి' అనే నినాదం బయలుదేరింది. ఎందుకంటే యిష్టపడి చదివినవారికి అది కష్టంగా తోచదు. చదువే కాదు, వృత్తి విషయంలో కూడా దీన్ని చూడవచ్చు. హిందీ రంగంలో అగ్రనటుడు దేవ్ ఆనంద్ తన కుమారుడు సునీల్‌ను నటనలో ప్రవేశపెట్టాడు. సునీల్ తల్లి, తండ్రి, పెదనాన్న, బాబాయి అందరూ నటులే. అయినా అతనికి నటనలో యిష్టం కలగలేదు. రెండు, మూడు సినిమాల్లో నటించి, అవి విఫలం కాగానే తండ్రి చిత్రనిర్మాణ సంస్థ వ్యవహారాలు చూసుకోసాగాడు.

అయితే ఇంటర్ స్థాయిలో కొడుకు లేదా కూతురి అభిరుచి గమనించి, తదనుగుణంగా ప్రోత్సహించే ధైర్యం సగటు తలిదండ్రులకు వుండదు. ఎందుకంటే అభిరుచి వున్నా, సామర్థ్యం లేకపోవచ్చు. 'నేను డిగ్రీలు చదువుకోను, పూర్తికాలం క్రికెట్ అభ్యాసానికి వెచ్చించి, క్రికెట్‌ను వృత్తిగా స్వీకరిస్తాను.' అని కొడుకో, కూతురో అన్నపుడు తలిదండ్రులు 'అది నీ పాషన్. దాన్ని ఆ స్థాయిలోనే వుంచుకో. జీవనోపాధికై మామూలు చదువు చదువుకుని, ఉద్యోగం తెచ్చుకో. స్థిరపడ్డాక అప్పుడు ఆ హాబీని కొనసాగిద్దువు కాని. ప్రస్తుతానికి తక్కిన అందరిలాగానే ఇంజనీరింగులో చేరి, బాగా చదువుకుని ఉద్యోగం తెచ్చుకోవడంపై దృష్టి పెట్టు' అని 'హితవు' చెప్తారు. తలిదండ్రులే కాదు, హితైషులు అనుకున్న బంధుమిత్రులందరూ అదే చెప్తారు.

'చదువు, ఉద్యోగం అయ్యాక ఆ రంగంలోకి వెళ్తే పుణ్యకాలం గడిచిపోతుంది. అంతకంటె దానికి సంబంధించిన చదువు యిప్పణ్నుంచే చదువుతాను.' అని పిల్లలు వాదిస్తే దాన్ని పెద్దవారు ఖండిస్తారు. క్రికెటర్ అవుతానంటే నువ్వు సచిన్ టెండుల్కర్ అవగలవా? అంటారు. చిత్రకారుణ్ని అవుతానంటే నువ్వు ఎంఎఫ్ హుస్సేన్ కాగలవా అని సవాలు చేస్తారు. సినిమా నటుణ్ని అవుతానంటే నువ్వు చిరంజీవి కాగలవా అని ఎద్దేవా చేస్తారు. ఆ రంగంలోకి వెళితే ఆ స్థాయి తప్ప మధ్యతరహా స్థాయిలేవీ లేనట్లు! 'మీరు చెప్పినట్లు ఇంజనీరింగులోకి వెళితే మోక్షగుండం విశ్వేశ్వరయ్యగారిని కాగలనా?' అని కుర్రవాడు అడగడు. రిస్కు తీసుకుని ఢక్కామొక్కీలు తినే కంటె వీళ్లు చెప్పినదారిలోనే వెళ్లి విఫలమైతే 'మీరు చెప్పినట్లే నడుచుకున్నాను కదా అనవచ్చు' అనుకుంటాడు. పైగా 'క్రికెట్ వంటి క్రీడల్లో అభిరుచి వుంది కానీ ప్రావీణ్యత సంతరించుకోగలనా? ఎందుకొచ్చిన ప్రయోగాలు, అందరూ నడిచే దారిలోనే వెళితే పోలా?' అని ఆలోచింపచేసే అధైర్యాన్ని చుట్టూ వున్న సమాజం అతనిలో నింపుతుంది.

పెద్దల ఆదేశం మేరకు ఇంజనీరింగు అయిందనిపించి, ఉద్యోగాల వేటలో విఫలమై నిరుద్యోగంతో సతమతమవుతున్నపుడు యీ ఆలోచన మళ్లీ కలుగుతుందతనికి. ఈ 'దండగమారి' చదువు చదివే బదులు ఐదేళ్ల క్రితమే ఫైన్ ఆర్ట్సులో చేరి వుంటే యీ పాటికి ఏ యానిమేషన్ కంపెనీలోనో, ఏ గ్రాఫిక్స్ కంపెనీలోనో, ఏ గేమింగ్ కంపెనీలోనో చక్కటి వుద్యోగం వచ్చేది కదా అని. పోనీ ఆలస్యమైనా దానిలోకి

వెళదామంటే మళ్లీ సందేహం – అది నా అభిరుచి మాత్రమేనా, లేక స్వధర్మమా? స్వధర్మమైతే రాణించగలను, కేవలం అభిరుచి మాత్రమే అయితే ఫ్యాన్‌గా మాత్రమే మిగులుతాను. తేల్చుకోవడం ఎలా? అనేదే వారి ముందున్న ప్రశ్న.

పిల్లలు ఇంటర్ స్థాయిలో వుండగానే 'ఎందుకొచ్చిన రొటీన్ ఉద్యోగాలు, పోనీ వాళ్లు కోరినట్లు వేరే రంగంలో ప్రయత్నించడానికి ఛాన్సు యిద్దామా?' అని ఆలోచించే తలిదండ్రులను కూడా యీ ప్రశ్న వేధిస్తుంది. వీళ్లకు నిజంగా దానిలో సత్తా వుందా? లేక పాలపొంగులాంటి ఉత్సాహమేనా? ఇది వాడి స్వధర్మమా? లేక పాషన్ మాత్రమేనా? ఎలా తెలుసుకోవడం అని వారూ ఆలోచనలో పడతారు. కౌన్సిలింగును ఆశ్రయిస్తారు.

✡ ✡ ✡

## 03. ఏది పాషన్ ? ఏది స్వధర్మం ?

ప్రాపంచిక లాభనష్టాలతో పని లేకుండా, దేనిపైననైనా మక్కువ పెంచుకుని దానికోసం ఎంతైనా శ్రమించడానికి ప్రేరేపించేది ప్యాషన్! తెలుగులో తీవ్ర అభినివేశం అనవచ్చు. ఇది పూర్తిగా మానసిక ఆనందం కోసం చేసేది. ఇతరుల దృష్టిలో – ఇది కూడుగుడ్డా పెట్టదు.




ఒక రకమైన వెర్రి. సాధ్యమైనంత త్వరలో వదుల్చుకోవలసినది! కానీ సంబంధిత వ్యక్తి మాత్రం దీని కోసం లౌకిక సుఖాలను త్యాగం చేయడానికి సిద్ధపడతాడు. దానిలో తను రాణిస్తాడో లేదో తెలియకపోయినా, అవసరమైన తర్ఫీదు పొందే అవకాశం లేకున్నా, అనుకున్న ఫలితం సిద్ధిస్తుందన్న గ్యారంటీ లేకపోయినా, సర్వం ఒడ్డడానికి, ఏళ్ల తరబడి కష్టాలు పడడానికి సిద్ధమవుతాడు.

ఎంచుకున్న లక్ష్యమే అతన్ని పురికొల్పుతుంది, ఆశ కలిగిస్తుంది. నడిపిస్తుంది. సినిమారంగంలో నటులుగా, దర్శకులుగా, రచయితలుగా ప్రవేశించడానికి నిత్యం నగరానికి వచ్చే కొత్తవారిలో యిది స్పష్టంగా చూడవచ్చు. దీనిలో ఫలితం దైవాధీనం. టేలంట్ ఉన్నా పైకి రాలేకపోయిన వారెందరో కనబడతారు. కొంతమంది వచ్చిన అవకాశాలు వినియోగించుకోలేక పోవడమూ చూస్తాం. దీనిలో వైఫల్యం వారిని తీవ్రంగా కలచివేస్తుంది. చదువులో, ఉద్యోగాల యింటర్వ్యూలలో ఫెయిలయినా ఓర్చుకుంటారు కానీ సినిమా అవకాశం వచ్చినట్లే వచ్చి చేజారిపోతే తట్టుకోలేక పోతారు.

ఇక స్వధర్మం విషయానికి వస్తే – ఒక వ్యక్తి తన మనోధర్మానికి తగిన జీవనమార్గాన్ని ఎంచుకొని తన సర్వశక్తులనూ అందులోనే ఏకీకృతం గావించి మనుగడ సాగించడం స్వధర్మం. ప్రస్తుతం చేస్తున్న వృత్తిని తనకు అభీష్టంగా మలచుకోవడం కూడా స్వధర్మోచితమే. దీనిలో నిరంతరం తనను తాను సానబెట్టుకుంటూ యితరుల కంటె మెరుగ్గా నిలవడం కనబడుతుంది. కుటుంబం, సమాజం వీరిని గౌరవిస్తుంది, అండగా నిలుస్తుంది. తమ పాషన్‌కు అనుగుణమైన రంగంలోకి వెళ్లి విజయశిఖరాలకు చేరినవారికి వచ్చినంత గుర్తింపు, పేరుప్రఖ్యాతులు వీరికి రాకపోవచ్చు.

ఎందుకంటే దానిలో రిస్కు వుంది కాబట్టి ప్రాఫిట్ కూడా ఎక్కువే వుంటుంది. ఇక్కడ అంత ప్రతిఫలం కనబడదు. కానీ తమ సర్కిల్‌లో వీరికి మన్నన వుంటుంది. ఈ మార్గంలో ఆత్మసంతృప్తితో పాటుగా సంపాదన, కుటుంబప్రగతి, సంఘశ్రేయస్సు అన్నీ సమకూరుతాయి. ఇతరులకు ఆదర్శంగా కూడా నిలుస్తారు. దీనిలో అదృష్టం పాత్ర తక్కువ. నైపుణ్యం వున్నవారికి అవకాశాలు వాటంతట అవే వెతుక్కుని వస్తాయి.

ఇక్కడే పాషన్‌కు, హాబీకి గల తేడా చర్చించాలి. హాబీని తెలుగులో ప్రవృత్తి అంటున్నారు. పాషన్ అనేది వృత్తితో సంఘర్షించినంతగా ప్రవృత్తి, వృత్తితో ఘర్షించదు. వృత్తి అనేది మనుగడ కోసం చేయవలసిన నిరంతరప్రక్రియ. అనునిత్యం అదే పని చేయడం వలన కొన్నాళ్లకి మొనాటనీ కలుగుతుంది. విసుగు పుడుతుంది. అప్పుడు హాబీ అతన్ని ఆదుకుని, రీచార్జి చేసి మళ్లీ పనికి సిద్ధం చేస్తుంది. పని ఎక్కువైపోయి బోరు కొట్టినప్పుడో, మానసికంగా భారమైపోయి ఒత్తిడికి గురి చేసినప్పుడో, కాస్త విరామం దొరకగానే మనిషి కాస్సేపు పాటలు వింటాడు, ఏదైనా జోక్స్ చదువుతాడు, నచ్చిన వెబ్‌సైట్‌కు వెళ్లి సినిమా కబుర్లు తెలుసుకుంటాడు, లేదా కంప్యూటర్‌లోనే కాస్సేపు పేకాట ఆడతాడు.

ఇవన్నీ ఊరట కలిగించేవే తప్ప వృత్తికి హాని కలిగించేవి కావు. రొటీన్‌ను బ్రేక్ చేయడమే వీటి ప్రయోజనం. మిఠాయికొట్టు వాడు మధ్యలో లేచి వెళ్లి మిర్చి బజ్జీ తిన్నట్లు, మిర్చీ బజ్జీలు అమ్మేవాడు వెరైటీ కోసం మిఠాయి కొనుకున్నట్లు, పత్రికాఫీసు ఉద్యోగి విరామం దొరికినప్పుడు రేడియో పాటలు వింటే, ఆ పాటలు వినిపించే ఆకాశవాణి ఉద్యోగి విరామసమయంలో పుస్తకాలు చదువుతాడు. ఇవి వృత్తిని మరింత ఉత్సాహంగా, మరింత మెరుగుగా చేసేందుకు దోహదపడేవే.

ప్రవృత్తిని వృత్తిగా మార్చుకునే అవకాశం గనుక వస్తే అంతకంటే భాగ్యం మరొకటి లేదు. అతడు పనిలో అలసట అనేదే ఫీలవడు. హాబీగా ప్రారంభమైనది పాషన్‌గా మారి, వృత్తికి భంగం కలిగించిన సందర్భాలూ వున్నాయి. ఏదైనా ఉద్యోగం చేస్తూ నటన మీద యిష్టంతో సినిమాలలో వేషాలకోసం ప్రయత్నిస్తూ చివరకు ఉద్యోగాన్ని, కుటుంబాన్ని నిర్లక్ష్యం చేసి, వాటికే సమయమంతా వెచ్చించి ఉద్యోగాలు పోగొట్టుకున్న వారెందరో వున్నారు.

ఏదైనా అంశంపై అభిరుచి వుందని మీ మనసుకు తట్టగానే, మీరు చేయవలసినది అది నా స్వధర్మమా? వృత్తిగా పనికి వస్తుందా? హాబీగా మిగులుతుందా? పాషన్‌గా మారుతుందా? అనేది విశ్లేషించుకుని దాని ప్రకారం మీ కెరీర్‌ను మలచుకోవాలి. దానికి గాను, మిమ్మల్ని మీరే ఎక్స్‌రే తీసుకోవాలి, శోధించుకోవాలి. ఆత్మపరిశీలన చేసుకుని, నిర్మొగమాటంగా బేరీజు వేసుకోవాలి. ఎలా? నాకు తోచిన పద్ధతి సూచిస్తాను. ప్రయత్నించి చూడండి.

✡ ✡ ✡

## 04. తరచి చూసుకోండి...

కొన్ని రోజుల పాటు రోజుకో గంట, మీరు రొటీనుగా చేసే పనులన్నింటినీ ప్రక్కన బెట్టి, కరోనా క్వారంటైన్‌లో ఉన్నట్లుగా భావించుకుని, ఏకాంతంగా కూర్చుని మీ గురించి మీరు నోట్స్ వ్రాయండి. సంఘటనలను రికార్డు చేసే డైరీ కాదిది. లేనివి కల్పించి రసవత్తరం చేయడానికి కథ అంతకంటే కాదు. ఏదైనా సంఘటన గుర్తు చేసుకుని రాసినప్పుడు దాని పూర్వాపరాలు, అది కలిగించిన ప్రభావం నిజాయితీగా రికార్డు చేయండి. మీ మనసుకు తోచిందే మీరు రాయాలి తప్ప, యితరులు దాన్ని

ఎలా పరిగణించారు అనేది యిక్కడ ముఖ్యం కాదు. మీ పేరెంట్స్ తో సహా ఏ ఇతరుల వ్యాఖ్యలకు దీనిలో చోటు లేదు.



మీకు చిన్నప్పటి నుండీ ఏ వ్యాపకం అంటే మక్కువ? దేనికోసం మీరు ఎంతటి కష్టానికైనా సిద్ధపడతారు? ఎన్ని గంటలు వెచ్చిస్తారు? మీరు అనుకున్నది సాధించినప్పుడు మీకు ఆనందం ఏ స్థాయిలో కలుగుతోంది? స్కూల్, కాలేజీ రోజులలో ఏ వ్యాపకం ద్వారా, ఏ కళ ద్వారా మీకు గుర్తింపు వచ్చింది? ఏ విషయంలో మీరు శభాష్ అనిపించుకున్నారు? దేని విషయంలో పెదవి విరుపులకు గురి అయ్యారు? ప్రశంస తెచ్చిన సంఘటనలు, కష్టపడినా అంతగా గుర్తింపు దక్కని సంఘటనలు, వ్యాఖ్యలు అన్నీ రాసుకుపొండి. చిన్నప్పటి విషయాలు యిప్పుడేం గుర్తుంటాయి అనుకోవద్దు. వ్రాస్తుంటే ఎన్నెన్నో వాటంతట అవే గుర్తొస్తాయి. లేదూ.. ఇప్పుడున్న స్థితిలో కూడా “నాకు గనుక ఫలానా అవకాశం వచ్చి వుంటే ఇంకా బాగా చేసేవాడిని” అనిపించే ఆలోచన ఏదో నోట్ చేయండి. అదీ చేత కావట్లేదనుకుంటే. చిట్టచివరి చిట్కా ఇదిగో!

మీరు కాస్త ఎక్కువ సేపు ఏకాంతం పాటించి, మౌనంగా అంత:దృష్టితో ఆలోచించండి. “నేను ఏ పని చేస్తుండగా ఎన్ని గంటలైనా గడియారం వంక తొంగిచూడను?’ అని ప్రశ్నించుకుని, స్వీయపరీక్ష జరుపుకొనాలి. సోషల్ మీడియా, వీడియోగేమ్స్ లాంటివి ఈ పరిధిలోకి రావని సుస్పష్టం. ఈ పరిశీలన ఒక సీరియస్ విషయం. ఇతరుల జోక్యాలు, ప్రభావాలు, వ్యాఖ్యానాలు ఇందులో ఏమాత్రం దూరకూడదు. మన అంతరంగం గురించి మనకు తెలిసినంతగా ఈ ప్రపంచంలో ఎవ్వరికీ తెలియదనేది ఎంత సత్యమో – ఎవ్వరికీ కూడా పట్టదు అనేది కూడా కఠోరవాస్తవం.

ఈ అంతఃసమీక్ష తర్వాత నాకు ఫలానా పని, వృత్తి మీద అనురక్తి వుందని ఓ నిర్ధారణకు వచ్చారనుకోండి, అదే మీ మనోధర్మం, స్వధర్మం. మీ మనోధర్మాలకు చెందిన అభిరుచులు ఒకటే వుండాలని లేదు, రెండు కూడా అయిఉండొచ్చు. కానీ వాటి మధ్య క్లాష్ రాకూడదు. రెండింటిలో మెరుగైన దానికి మొదటి ప్రాధాన్యం ఇచ్చి, రెండో దానిని ప్రస్తుతానికి ప్రవృత్తిగా కొనసాగించొచ్చు, మొదటిదానిలో విఫలమయ్యే సందర్భం వస్తే, రెండోదే స్వధర్మంగా మారవచ్చు.

ఈ సమీక్ష, స్వధర్మమేదో తెలుసుకోవలసిన కసరత్తు ప్రతి మనిషికి చాలా అవసరం. నిజానికి ప్రతి గొంగళిపురుగులో ఒక సీతాకోకచిలుక దాగి వుంటుంది. అయితే అది ఒకేసారి క్రిమి దశ నుండి కీటకంగా మారదు. మధ్యలో సమస్త కార్యకలాపాలు స్తంభింపచేసుకుని, తనలో తానే మార్పు చేసుకునే ప్యూపా దశ ఒకటి వుంటుంది. కొన్నాళ్లకు ఆ దశను పూర్తి చేసుకుని రెక్కలు సంతరించుకుని, బంధనాలు తెంచుకుని బయట పడుతుంది. ఆ పడే ప్రయత్నంలో రెక్కలకు విపరీతమైన శ్రమ కలుగుతుంది. కానీ ఆ క్రమంలోనే రెక్కలు బలపడతాయి. వర్ణమయమైన విశాల విశ్వంలోకి రంగురంగుల ఆకర్షణీయ రూపంతో ప్రవేశించి సుదూరతీరాలకు చేరాలంటే ఆ పాటి కఠోర పరిశ్రమ అవసరం. మనిషి కూడా క్రిమి దశ నుండి మారాలంటే ప్యూపా వంటి తన మనోవల్మీకంలోకి వెళ్లి కొంతకాలం ధ్యానం చేయాలి. అప్పుడే తనలో సీతాకోకచిలుక దాగి వుందనే గ్రహింపు కలుగుతుంది. సీతాకోకచిలుకగా మారడానికి తన బంధనాలు తెంచుకోవాలనే ఎఱుక రాగానే, కష్టపడి, శ్రమపడతాడు. ఆకాశమే హద్దుగా ఎదుగుతాడు.

✡ ✡ ✡

## 05.స్వధర్మం తెలుసుకున్నాక ఏమి చేయాలి?

ఆ పని/వృత్తి యొక్క పూర్వాపరాలు, లోతుపాతులు సమగ్రంగా అధ్యయనం చేస్తూ వుండాలి. మీ మార్గాన్ని తెలుసుకున్న మీదట, ఆయా రంగంలో స్థితిగతులు, అవకాశాల గురించి వృత్తినిపుణులతోనే సంప్రదించాలి తప్ప సన్నిహితులనుకున్న వారందరికీ వెల్లడించనవసరం లేదు. కొన్ని సందర్భాల్లో మీ కుటుంబం నుంచే మీకు ప్రతిఘటన ఎదురుకావచ్చు. ఎందుకంటే, ఇంటా బయటా అందరూ ఏ జాబ్

చేస్తే ఎంత ఆదాయం వస్తుందీ అనే ధోరణే తప్ప; 'ఎంత హాయిగా, సంతృప్తిగా నీ పనిని నువ్వు ఎంజాయ్ చేస్తున్నావు?' అని ఏ ఒక్కరూ అడగరు. ఇక్కడ ఒక సత్యం తెలుసుకోవాల్సి వుంది. తనకు నచ్చిన పనిలో స్థిరపడిన (ఇప్పుడు సెలెబ్రెటీలుగా పేరుపొందిన అందరితో సహా) ఎవరైనా తమ తొలి నాళ్లలో నామమాత్రపు ఆదాయాన్నే పొందివున్నారు. కాలం గడుస్తున్న కొద్దీ అనూహ్యమైన ఆదాయం, ఆదరణా పొందుతూ వచ్చారు. కనుక అలాంటి సంశయం ఏ ఒక్కరికీ అవసరం లేదు. 'ఉద్ధరేదాత్మ నాత్మానామ్' -అనే గీతా శ్లోకానుసారం, 'ఎవరో వస్తారని ఏదో చేస్తారని-ఎదురు చూసి మోసపోకుమా' అన్న మహాకవి స్ఫూర్తి ననుసరించి మీ మీద మీరే ఆత్మవిశ్వాసం పెంచుకోవాలి. ఎవ్వరూ పని గట్టుకొని నిన్ను బలపర్చరు. ఎవరి పనుల్లో వాళ్లు తలమునకలై వుంటారు గనుక!

ప్రతికూల సూచనలను ప్రక్కకు నెట్టే పని ముగిశాక ఏమి చెయ్యాలి? గుర్తించిన స్వధర్మానికి సంబంధించిన వృత్తిలో ఉన్నతస్థాయిలో వున్నవారెవరో వారి జాబితా రాసుకోండి. వారే మార్గంలో పైకి వచ్చారో తెలుసుకోండి. వారనుసరించిన మార్గాన్నే అనుసరించాలని మాత్రం ఆలోచించకండి. మీ క్రియేటివిటీ మీదే మీరు ఆధారపడండి. సదరు రంగంలోనే కొందరు విఫలమైనవారు కూడా వుంటారు. వాళ్లను చూసి బెంబేలు పడకండి. అవకాశం కల్పించుకుని వాళ్లను ఇంటర్వ్యూ చేయండి. ఎందుకు విఫలమయ్యారో తరచి చూడండి. ఏ స్టేజిలో ఏ రాంగ్ స్టెప్ వేశారో వారి ముఖతహ వినండి. వారు చెప్పకపోతే యితరులను అడిగి తెలుసుకోండి. చేయకూడని తప్పులు ఏవో – నష్టపడక ముందే మీకు తెలిసొస్తాయి. ఇతరుల కష్టనష్టాల నుండి గుణపాఠం నేర్చుకోవటం వలన ఎంతో సమయం, ధనం కలిసివస్తాయి.

ఒక్కోసారి మీరు ఇష్టపడే వృత్తి కలిగించే లాభం, ప్రభావం అల్పమనే భావన పొడచూపుతుండవచ్చు. దిగాలు పడనక్కర్లేదు. ఇప్పుడున్న మార్కెట్‌లో పెద్దపెద్ద పరిశ్రమలు ఒక్కోసారి చతికిల పడగా, అతి చిన్న పరిశ్రమలు ఉద్భవించి, నిలదొక్కుకుని, క్రమేపీ వృద్ధిలోకి వచ్చాయి. చిన్న స్థాయిలోనే కొత్త ఆలోచనలను అమలు చేసి కోట్లలో వ్యాపారం చేసిన, చేస్తున్న సంస్థల గురించి మనం దినపత్రికల ఆదివారం ప్రత్యేక సంచికల్లో ఎన్నో సార్లు చదివాము, చదువుతున్నాము.

ప్రతిభ, అభిరుచి వున్న స్వధర్మయుతమైన ఉద్యోగంలో అయితే రాబడితో బాటు

సంతృప్తి కూడా కలిగి జీవనం సుఖంగా సాగుతుంది. ఉద్యోగి స్థాయి నుండి సొంత వ్యాపారం చేయదగ్గ స్థాయికి ఎదిగేందుకు పురికొల్పుతుంది కూడా!

✡ ✡ ✡

## 06. చేస్తున్న వృత్తిలో కొనసాగుతూనే, స్వధర్మ ఆశయాన్ని మనసులో ఎలా పరిపోషించుకోవాలి?




పని అంటే కర్మ చేయటం. అది మనుగడ కోసం ఎవరికైనా తప్పని చర్య.

అందివచ్చిన ఏ పని అయినా లక్షణంగా చేయటం మన బాధ్యత.

నా స్వధర్మం యిది కాదనుకుంటూ దీనిని నిరసనగా చూడడం సరి కాదు.

చేతిలో వున్న పని బాగా చేసిన వాడే- భవిష్యత్తులో చేయవలసిన పనులను కూడా చక్కగా చేయగలడు అనేది సూత్రం.

నీ ప్రస్తుత వృత్తి పై ఆధారపడే నీ కుటుంబం సాగుతున్నది అనే కఠోరవాస్తవం గుర్తించి పని పట్ల నిబద్ధతతో, యజమాని పట్ల కృతజ్ఞతతో వుండాలి.

**మారుతున్న సామాజిక పరిణామాల వలన స్వధర్మంగా నమ్ముకున్న వృత్తి డిమాండ్ కోల్పోతూ వుంటే మనుగడ ప్రశ్నార్థకం కాదా?** అలాంటప్పుడు ప్రత్యామ్నాయం ఏమిటి? ఇటువంటి సంక్లిష్ట పరిస్థితిలో ఏమాత్రం దిగాలు పడకుండా, ఇతరుల సిఫార్సులతో తికమక పడకుండా విశ్లేషించుకోవాలి. ప్రస్తుతం మార్కెట్లో వున్న అవకాశాలలో మీ మనోధర్మానికి సన్నిహితమైన, మీ అనుభవానికి, జ్ఞానానికి సరిపోలే వృత్తిని స్వీయవిచక్షణతోనే ఎంపిక చేసుకొనవచ్చును. దానిని అనుసరించవచ్చును. ఉదాహరణకి – రొమాంటిక్ హీరోగా నిలబడటం ఇకపై కష్టం అనుకున్న నటుడు జగపతిబాబు, తన వ్యూహం మార్చుకొని క్లాస్ విలన్‌గా సరికొత్త కెరీర్‌లో గొప్పగా రాణించారు.

**తన అభీష్టం మేరకు తానే ఏర్పరచుకునే వృత్తిమార్గాన్ని "స్వయం ఉపాధి" అంటారు.**

ఇతరుల వద్ద, లేదా ఇతర సంస్థల్లో పని చేస్తే అది ఏ స్థాయిలోది ఐనా ఉద్యోగమే

ఔతుంది. పొందే జీతాన్ని బట్టి, హోదా బట్టి వ్యక్తికి విలువ ఆపాదించటం పరిపాటి. ఇది అర్ధసత్యం మాత్రమే. చేస్తున్న పని పట్ల శ్రద్ధ, నైపుణ్యం చూపించటాన్ని బట్టే వ్యక్తులకు సముచిత గౌరవం లభిస్తాయి.. దానినే వృత్తి నైపుణ్యం అంటాము. అదే ఉన్నతస్థాయిలో గుర్తింపు పొందినపుడు "వృత్తి కౌశలం" అంటారు. కనుక ఏ వృత్తిలో వున్నామనేది కాదు ప్రధానం ఎంత నిబద్ధతతో పని చేస్తున్నామన్నదే ప్రమాణం.

అలా చేపట్టిన పనిని ఒద్దికతో చేసిన వారే అంచెలంచెలుగా ఎదిగిపోతారు. అప్పుడు శ్రమకు తగిన మూల్యం రాక తప్పదు. ఒకవేళ అది జరుగ లేదూ అంటే, మీరు రాంగ్ ప్లేస్‌లో వున్నారని అర్థం.

ఇక ఇక్కడి నుండి బయట పడాలని మీరు కంగారుపడుతూ ప్రస్తుతం చేస్తున్న పనిని అరకొరగా మాత్రం చెయ్యకూడదు. మీరు ఎక్కడ ఏ పని, ఉద్యోగం ఎన్నాళ్ళు చేసినా నిజాయితీగా చేసిన ముద్ర ఎన్నటికీ చెరగదు అన్న సత్యం గమనించండి.

సంతృప్తికరమైన పనితనం చూపి, దాని ఫలితం వీక్షిస్తున్నపుడు ఏం జరుగుతుందో తెలుసా!?

త్రికరణశుద్ధిగా పని చేసే వ్యక్తికి ఆత్మసంతృప్తి కలగటంతో పాటు, ఈ స్థితిలో శరీరంలో శరటోనిన్ అనే హార్మోన్ ఉత్పన్నమై "పని చాల సుఖమే" అనిపించే అనుభూతిని కూడా ఇస్తుంది. ఇంతకంటే ఏం కావాలి? ఇక్కడ ఒక విషయం చెప్పాలి.

'నా పనితనం ఇంకా ఎవరూ ఎందుకు గుర్తించరు? ఎందుకు మెచ్చుకోరు?' అని ఫేస్‌బుక్‌లో, ట్విట్టర్‌లో లైక్‌ల కోసం ఎదురు చూసినట్లు ఎదురుచూడడం తగదు.

ఒక్కటి గుర్తుంచుకోండి. నైపుణ్యంతో చేసే ప్రతి పనీ ఇప్పటికే కాదు, మున్ముందు కూడా పరపతిని నిలబెడుతుంది. సమాజమెప్పుడూ ప్రతిభకు పట్టం కడుతుంది. ఐతే ఫలితం పట్ల తృప్తి పడాలే తప్ప గర్వపడకూడదు. పని ఫలితం మనలో వినయాన్ని, యింకా బాగా చేయాలనే ఆతృతను పెంచాలే గాని అంతా నా వల్లనే సాధ్యమయింది, దీనిని మించి ఎవరూ ఏమీ చేయలేరు అనే "అహం" ఏమాత్రం ఉండకూడదు. **స్వధర్మానికి** చెందిన వృత్తి తాలూకు ఫలాఫలాలను శ్రద్ధగా, నిష్పక్షపాతంగా సమీక్ష చేయటానికి రోజులో కొంత సమయాన్ని కేటాయిస్తూండాలి.

మొక్క ఎదుగుతున్నపుడు కలుపు తీసేయాలి, అవసరాన్ని బట్టి ఎరువు వేయాలి. నూతనోత్సాహం ఎరువు అయితే, అహంభావం కలుపు మొక్క వంటిది.

✡ ✡ ✡

## How to justify professional and personal life

-Dr.P.Usha bala



Decades before, the duty of a woman was only household duty and the earning member of the family was the man.

But as times changed women are now well educated, efficient and equal in all sectors. The problem arises to balance between professional and personal life. It also differs in different socio economic status.

Advantage of today's working women is that they have child care centres where the child can be left during working hours and also the husbands are sharing the domestic work like cooking, cleaning and looking after children.

My father always insisted that we go during lunch hour, pick children from school, feed them and leave them at school again. After all, we earn to live and looking after children is more important. Coming to the professional part, it again depends on the speciality we work.

In addition, if you are academically active like giving lectures in conferences and writing papers in journals it consumes more time. Again coming to children's schooling and college years, it is important to concentrate on their studies and personality development. So, you need to spend more time on personal life. I see a lot of lady doctors leaving conferences at 9 PM saying children are alone at home. I remember an anchor telling in an interview that she had to bring her daughter with fever to the sets while she had to do a television show. That shows her commitment.

Over all professional life is always there, but in personal life there are stages where you need to spend more time when children need you.

✡ ✡ ✡

# 07. 'అరకొర పనిమంతులు' అంటే ఎవరు ?

ఏ పని లక్షణంగా చేయాలన్నా దానికి సంబంధించిన జ్ఞానం అంటూ కొంత ఉండాలి కదా! మీ కొత్త మొబైల్‌ను, కొత్త వాహనాన్ని భద్రంగా వాడుకోవడానికి ఒక మాన్యువల్ ను అందిస్తారు. దానిని కొంతైనా స్టడీ చేస్తాం. వాడుతూ కూడా తగు జాగ్రత్తలు తీసుకుంటాం. మరి జీతం తీసుకుని చేసే పని పట్ల మనం శ్రద్ధ పెట్టకుండా, లోతుగా అధ్యయనం చేయకుండా, ఆషామాషీగా, యాంత్రికంగా చేస్తూ పోయే స్వభావం ఎంతవరకు సమంజసం? జీతాల రోజు తప్ప తక్కిన అన్ని రోజులూ ఉద్యోగాన్ని తిట్టుకుంటూ, ఇది నా ప్రతిభకు తగిన ఉద్యోగం కాదంటూ సణుగుతూ, తప్పనిసరి తద్దినంలా భావిస్తూ, ఆ కోపాన్ని, విసుగుని, క్లయింట్లపై, సహోద్యోగులపై ప్రదర్శించడం భావ్యమా?

అస్సలు ఏ పని జోలికి వెళ్లక చెప్పిన ప్రతి పనికి వంకలు పెట్టే ప్రబుద్ధులుంటారు. పని చెప్పగానే తమకు అన్యాయం జరిగిపోయినట్లు నసపెట్టే వారు కొందరు. పని చేస్తున్నట్లు నటిస్తూ కాలం వెళ్లబుచ్చేవారు ఇంకొందరు. పని పాతర పెట్టి పైఅధికారులకు యిచ్చకాలు, ప్రక్కనున్న వాళ్ళ మీద చాడీలు చెబుతూ కాలక్షేపం చేసేవారు మరి కొందరు. ఆఫీసు వేళల్లో సొంత పనుల మీద వెళ్లిపోయేవారు, ముచ్చట్లతో పొద్దు పుచ్చే బద్ధకస్తులు, నిరంతరం గోడగడియారం వైపు చూస్తూ గంట పనిని నాలుగు గంటలకు సాగదీసేవారు, కంప్యూటర్ స్క్రీన్‌లోకి సీరియస్‌గా చూస్తూనే ఆఫీసు పనికి బదులు వార్తలు చదివేవారు, చీటికిమాటికి అనారోగ్యం పేర సెలవులు పెట్టేవారు, ఆఫీసు వేళల్లో వ్యక్తిగత సమస్యల గురించి ఆలోచిస్తూ పని నాణ్యత చెడగొట్టేవారు, కాస్త క్లిష్టమైన పని చెప్పగానే 'నాకు అంత బాగా రాదండి, ఫలానావాడికి అప్పచెపితే నిమిషంలో చేస్తాడు' అనేవారు, క్లయింటు వచ్చి నెత్తి మీద కూర్చుంటే తప్ప ఫైలు తెరవనివాళ్లు.. ఇలాంటి ఉద్యోగుల వలన పెండింగ్ పనులు పెరిగిపోయి, సంస్థకు తీవ్రమైన నష్టం వాటిల్లుతుంది. వీళ్ళనే అరకొర పనిమంతులు అనవచ్చు. వీళ్లను సరైన సమయంలో అదుపు చేసి, సరిదిద్దకపోతే పనిమంతులు కూడా వీళ్లను చూసి చెడిపోతారు. యజమాని గుఱ్ఱాలను, గాడిదలను సమానంగా చూడకూడదు. గాడిదలను అదలిస్తూ, గుఱ్ఱాలను వెన్ను తట్టి ప్రోత్సహించకపోతే త్వరలో అందరూ గాడిదలుగా మారిపోతారు.

**పనిలో ఆలోచన / పరిజ్ఞానం / సమన్వయం ఎంతటి అవసరం? :** కార్యాచరణకు సాధనం జ్ఞానమే. పని స్వరూపాన్ని ఎంత లోతుగా అవగతం చేసుకుంటే, అంత చక్కగా ఫలితం వస్తుంది. మిడిమిడి జ్ఞానంతో మొదలుపెడితే గారెల కథలా వుంటుంది. ఆ కథను మీరూ వినే వుంటారు. ఒకావిడ గారెలు చేయాలనుకుని, ఎలా చేయాలని పక్కింటి ఆవిడను అడిగిందట. ఆవిడ "మినప్పప్పు నానబోయాలి..." అని చెప్పగానే యీవిడ "తెలిసింది, తెలిసింది" అంటూ వెంటనే తనింటికి వచ్చేసి నానబోసి గారెలు వస్తాయేమోనని చూసింది. ఎంతకీ రాకపోతే మళ్లీ వెళ్లి అడిగింది. ఆవిడ "మీరు పూర్తిగా వినాలి. ఆ పప్పును రుబ్బి.." అంటూండగానే యీవిడ మళ్లీ "తెలిసిపోయింది" అంటూ యింటికి వచ్చేసి రుబ్బేసి ఏవీ గారెలు? అనుకుని కాస్సేపాగి మళ్లీ వెళ్లి... యిలా సాగుతుంది కథ. పూర్తిగా విన్నాకనే, సందేహాలు తీర్చుకున్నాకనే పనికి ఉద్యమించాలి తప్ప తెలిసీతెలియకుండా పనిలోకి దిగితే వనరులు, సమయం, శ్రమ అన్నీ వృథా అవుతాయి.

సంగీత కచ్చేరిలో వాద్యకారులు, గాయనీగాయకులు శ్రుతిలయ జ్ఞానం ముందుగానే ఏళ్ల తరబడి అభ్యసించి వుంటారు. అందుకే ఎంతమంది పాల్గొన్నా, అందరూ చక్కటి సమన్వయంతో గంటల తరబడి కచ్చేరీ చేయగలుగుతారు. సమిష్టి అవగాహనతో ప్రదర్శనం రక్తి కట్టిస్తారు కాబట్టి శ్రోతలు సమ్మోహితులవుతారు. వీరిలో ఎవరికి అర్ధజ్ఞానం వున్నా, అభ్యాసం చాలకపోయినా, ఏదో ఆలోచిస్తూ అన్యమనస్కంగా వున్నా సభ రసాభాస అవుతుంది. అలాగే కార్యాలయంలో కూడా అందరూ సమానప్రజ్ఞతో, సమాన శ్రద్ధాసక్తులతో పనిచేయకపోతే సంస్థ కుంటుపడుతుంది.

పై ఉదాహరణలో కచ్చేరీ చేస్తుండగా వాళ్ళు ఊసురో మంటున్నారా? లేక గాత్రం, వాద్యంలో లీనమై సంతోషపడ్డారా? గమనించండి. శ్రోతల మాట ఎలా వున్నా, వారిలో తమ కౌశలం ఎంతమందికి అందుతోందో తెలియక పోయినా, తమ గాత్రాన్ని, వాద్యాన్ని వీరు ఎంజాయ్ చేస్తూ పని చేశారు కదా! అందుకే వాళ్లకు ధనం, ప్రతిష్ఠ,



సంతృప్తితో పాటు అందరూ చేతులెత్తి నమస్కరించే ఆదరణ కూడా దక్కుతుంది! కార్యాలయంలో పని కూడా ఆ స్థాయిలో వుంటే అవే ఫలితాలు దక్కుతాయి.

మనసుకు ఊరట కలిగించే సంగీతం కాబట్టి వాళ్లు శ్రమ ఫీల్ కాలేదనుకోకండి. అది వినడం మీకు హాబీ కావచ్చు, కానీ వినిపించడం వారికి వృత్తి, బాధ్యతతో కూడిన పని. ఎవరి పనిలో వారికి శ్రుతితో అనుసంధానం వుండాలి. పని తీరులో లయ వుండాలి. ప్రక్కవాళ్ళతో సమన్వయం, సహకారం అందాలి. అలాంటి పని వాతావరణం కార్యాలయంలో కూడా సాధించిన రోజున ఫలితాలు అద్భుతంగా ఉంటాయి. తరచి చూస్తే మన శరీరం కూడా శ్రుతిలయబద్ధంగా నడుస్తుంది. ప్రతి అవయవం మరొకదానితో సమన్వయం చేసుకుంటూ అనేక దేహవ్యవస్థలను ఏకకాలంలో నడిపిస్తుంది. అంతేకాదు, బయటి పరిణామాలతో వ్యవస్థ అస్తవ్యస్తమైతే సరిదిద్దుతుంది కూడా. అనవసరమైన గందరగోళపు ఆలోచనలతో మనం మన మెదడును సతమతం చేస్తుంటాము. కానీ ఆ మెదడుకు సరైన విశ్రాంతి నిస్తే లోపలి అలజడిని అదుపులోకి తెచ్చి అవే ఆలోచనలను ఒక క్రమంలో పెట్టి ప్రశాంతంగా నిద్ర పట్టేలా చేస్తుంది. అందుకే మన ఆలోచనాధోరణి మార్చుకుంటే అన్నీ కుదుటపడతాయంటారు.

✡ ✡ ✡

## 08. నైపుణ్య శిక్షణ, రిఫ్రెషింగ్ కోర్సులు ఎంత అవసరం?

ప్రతి వ్యక్తికి స్వతహాగా కొంత నేర్పు వుంటుంది. అంతమాత్రాన తాను చేపట్టిన పనిని తొలి ప్రయత్నంలోనే అద్భుతంగా చేసేస్తాడని అనుకోలేము. అర్జునుడు అంత గొప్ప విలుకాడయ్యాడంటే ద్రోణుడి కారణంగానే అయ్యాడు. ఆ విధమైన తర్ఫీదు అవసరం. పని ప్రారంభించబోయే ముందు దాని పట్ల అవగాహన ఏర్పడడం అన్నిటి కంటె ముఖ్యం. అది అనుభవజ్ఞుల ద్వారానే, ఆ బాటలో మన కంటె ముందు నడిచినవారి ద్వారానే మనకు సమకూరుతుంది. అవగాహన ఏర్పడిన తర్వాత ఆ పనిని ఎలా చేయాలన్న దానిపై పట్టు రావాలంటే తప్పకుండా శిక్షణ - ట్రైనింగ్ అవసరం. ఆ శిక్షణ యిచ్చేందుకు సదరు వృత్తిలో అనుభవజ్ఞులైన పెద్దలుంటారు. వారు శిక్షణా శిబిరాలు, శిక్షణా తరగతులు నిర్వహిస్తూ వుంటారు. తమ వద్దకు వచ్చినవారి బలాలు, బలహీనతలు, అర్థం చేసుకునే సత్తా, అర్థం చేసుకునే తీరు స్వయంగా బేరీజు వేసుకుని తగువిధంగా తర్ఫీదు నిస్తారు.

శిక్షకుల విషయానికి వస్తే – వారు మొదటగా చూడవలసినది తమ వద్దకు వచ్చినవారు ఆ పనిని స్వధర్మంగా భావిస్తున్నారా, లేక ఆపద్ధర్మంగా భావిస్తున్నారా అనేది అంచనా వేయాలి. ఎందుకంటే దేన్నికైనా ఆసక్తి ముఖ్యం. ఆసక్తి వుంటే నేర్పు తర్వాతనైనా వస్తుంది. అసలు ఆసక్తి, దానిలో అభిరుచి లేకపోతే మొత్తమంతా వృథా ప్రయత్నమే అవుతుంది. ఆసక్తి అంతగా లేనివారికి సబ్జక్టును ఆసక్తి రగిలించేట్లా చెప్పడం కూడా ఒక కళే. అది శిక్షకులు అలవర్చుకోవాలి. ఇక శిక్షణ మొదలుపెట్టాక, విద్యార్థులకు, ఉద్యోగులకు స్వధర్మసూత్రం గురించి, పని గురించి సంపూర్ణంగా, అర్థమయ్యేలా చెప్పాలి. దానిలో కష్టనష్టాలేమిటో, ఫలితాలు కళ్లచూడడానికి ఎంతకాలం వేచి వుండాలో కూడా స్పష్టంగా ముందే చెప్పాలి. లేనిపోని ఆశలు కల్పించకూడదు.




కొంతకాలం గడిచాక తాము చెప్పినదాన్ని విద్యార్థులు ఏ మేరకు అర్థం చేసుకున్నారో టెస్ట్ పెట్టి మరీ తెలుసుకొనాలి. పనిని నిజంగా ప్రేమిస్తూ, అందులో ఆనందం వెతుక్కునే వారెవరో కనిపెట్టాలి. ముఖ్యంగా వారిని వారు సెల్ఫ్–ఎసెస్ చేసుకునేట్లా చేయాలి. దానికిగాను కింది తరహాలో ప్రశ్నావళి యిచ్చి, వారిని వారే ప్రశ్నించుకుని, సమాధానాలు రాసుకోమనాలి.

- ఈ పనిని చేపట్టే ముందు దాని పని తీరును, లక్ష్యాన్ని సుస్పష్టంగా తెలిసికొన్నానా?
- దీన్ని సంపూర్తి చేయటానికి నాకున్న శక్తి సరిపోతుందా? పెంచుకోవాలా?
- పని క్రమాన్ని ఒక నియమిత పద్ధతిలో, ఆర్డర్‌లో పెట్టుకుని చేస్తున్నానా?
- పనిని ప్రేమతో, చిత్తశుద్ధితో, ప్రశాంతతో చేస్తున్నానా? ఆందోళన పడుతున్నానా?
- పనికి సంబంధించి వేరేవారి నుంచి సాయం కావాలా? ఆ సాయం అందించగలిగేవారెవరు?
- పని చేపట్టాక మధ్యమధ్యలో సమీక్షించుకుంటున్నానా? ఇతరుల మాట ఎలా వున్నా నా పని నాకు నచ్చుతోందా?

వీటికి సమాధానాలు వ్రాసి చూసుకుని, సమీక్షించుకోవాలి.

ఒక మనిషి స్వధర్మయుతమైన పనిని చేస్తున్నపుడు వివిధ శాఖలలో తనకు గల సమస్త నైపుణ్యాన్ని దానితో సమన్వయం చేయాలి. నేను యోగబోధనను వృత్తిగా స్వీకరించాను. నాకు తెలిసిన చిత్రకళను యోగాసనాల చిత్రాలు గీయడంలో ఉపయోగించాను. ప్రసంగకళను ఆరోగ్యప్రసంగాలను శ్రోతలను ఆకట్టుకునేట్లా చెప్పడంలో వినియోగించాను. చమత్కార సంభాషణా నైపుణ్యాన్ని యోగాభ్యాసకులకు కష్టమైన యోగాసనాలు వేసేటప్పుడు కలిగే అలసట పోగొట్టడానికి ఉపయోగించాను. ఇతరుల సమస్యలను ఓర్పుగా విని శాంతంగా నచ్చచెప్పగలిగే నేర్పును శారీరక, మానసిక రోగాలతో బాధపడుతూన్న సాధకులకు స్వాంతన చేకూర్చడానికి ఉపయోగించాను. యోగాభ్యాసులు ప్రశాంతాసనం వేసే వేళల్లో నా సంగీతాభిరుచిని వినియోగించి శ్రావ్యసంగీతం వినిపిస్తూ, మంద్రస్వరంతో పాటలు, కీర్తనలు పాడుతూ సాధకులకు ఆహ్లాదం చేకూర్చాను. నాలోనే కాదు, ప్రతి వ్యక్తిలోను అనేక కళలు వుంటాయి. వాటిని సమన్వయం చేసి, వృత్తికి అనుబంధంగా చేయడం వలన ఫలితం రెట్టింపు అవుతుంది.

పని నేర్చుకుని,దాన్ని వృత్తిగా మలచుకొని,ముందుకు సాగుతున్నా, అప్పుడప్పుడు రెఫ్రెషర్ కోర్సులకు హాజరవుతుండాలి. ఎందుకంటే సాంకేతిక పరిజ్ఞానం ఎప్పటికప్పుడు మారిపోతూ వుంటుంది. కొత్త కొత్త ఉపాయాలు, సాధనాలు మార్కెట్లోకి వస్తూ వుంటాయి. వాటివలన పని సులువుగా జరుగవచ్చు, త్వరగా జరుగవచ్చు,తక్కువ ఖర్చుతో జరుగవచ్చు.ఇవేమీ కాకపోయినా మనం తయారు చేసే వస్తువుకు ప్రత్యామ్నాయం మార్కెట్లోకి వచ్చి మనకుపోటీగాఎదగవచ్చు. అందువలన పునర్విమర్శ తరగతులకు హాజరై కొత్త విషయాలు తెలుసుకుంటూ వుండాలి. దీనిలో సిగ్గు పడవలసినదేదీ లేదు. ఈ రోజుల్లో ఎంత పెద్ద కార్పొరేట్ సంస్థల్లో సయితం ప్రతి ఏటా స్కిల్ ఇంప్రూవ్‌మెంట్, స్ట్రెస్ మేనేజ్‌మెంట్, ఫ్యామిలీ కౌన్సిలింగ్ లాంటి రిఫ్రెషర్ కోర్సులు జరుపుతూనే వున్నారు.

**రిఫ్రెషింగ్ కోర్సుల ఆవశ్యకత**

2000 సం. నుండి అనేక సంస్థలలో కంప్యూటర్లు ప్రవేశపెట్టారు. పాత పద్ధతులలో

పని నేర్చుకుని, కంప్యూటరంటే భయపడినవారు ఉద్యోగాలు మానుకున్నారు. కొత్తగా వచ్చిన సాధనం గురించి కోర్సులు చేసి, తన నాలెడ్జ్‌ను కొత్త పరికరంతో సమన్వయించిన వారు బాగుపడ్డారు. ఇప్పటికి చాలామంది చేతిలో స్మార్ట్ ఫోన్ వుంటుంది. ఎవరైనా ఫోన్ చేస్తే మాట్లాడడం, నెంబరు నొక్కి కాల్ చేయడం తప్ప వేరేమీ చేత కాదు. మెసేజి పంపినా చూసుకోలేరు. అడుగడుగునా ఒటిపిలు అడుగుతున్న యీ ఆధునిక యుగంలో యిది చాలా యిబ్బందులు కలగచేస్తుంది.

✡ ✡ ✡

## 09. పనిలో విసుగు, పరధ్యానం ఎందుకొస్తాయి?

పని ఎంత బాగా నేర్చుకున్నా, అది పూర్తి చేయవలసిన అవసరం ఎంత తీవ్రంగా వున్నా, విసుగు పడుతూంటుంది, మధ్యలో పరధ్యానం వస్తుంది అని కొందరు ఫిర్యాదు చేస్తూంటారు. దానికి కారణం ఏమిటి? పని రొటీన్‌గా వున్నప్పుడు, మన అవయవాలు మన ప్రమేయం అంతగా లేకుండానే చేసుకుంటూ పోతాయి. లోగడ పదేపదే చేసిన పనే, కాబట్టి మనసు పెట్టకుండా చేసినా చేతులూ, కాళ్లూ యాంత్రికంగా వాటి పని అవి చేసేస్తూంటాయి. ఆ సమయంలో మనసు ఖాళీగా వుండకుండా ఆలోచనల్లో పడుతుంది. దీనినే పరధ్యానం అంటాం. డ్రైవింగ్ బాగా అలవాటై పోయాక, రోడ్డు ఖాళీగా వుండి ట్రాఫిక్ ఎక్కువగా లేకపోతే డ్రైవర్ల ఆలోచనలు ఎటో వెళ్లిపోతాయి. యాక్సిడెంట్లకు కారణమవుతాయి. ఫ్యాక్టరీల్లో యంత్రాల దగ్గర పనిచేసే కార్మికులు యిలాంటి పరధ్యానంలో పడే, చేతులు, కాళ్లు గాయపరచు కుంటూంటారు. మనసును ఇన్వాల్వ్ చేయకుండా కేవలం మెకానికల్‌గా చేసే పనులే అప్పగిస్తే యిలాంటి యిబ్బందులు వస్తాయి. అందువలన ఏదైనా పనిని డిజైన్ చేసినప్పుడు మైండ్‌ను ఎలర్ట్‌గా వుంచేటట్లు ప్లాన్ చేయడం మంచిది. తాము మనసు పెట్టి పని చేయకపోతే పని పూర్తి కాదు, సవ్యంగా రాదు అని పని చేసేవారికి తోచాలి. మెదడు ఇన్‌వాల్వ్ కానక్కరలేని పనులుంటే వాటిని ఆటోమెటిక్ మెషిన్ల ద్వారా చేయించడం మంచిది తప్ప మనుష్యులను ఆ స్థానంలో పెట్టకూడదు. పెట్టడం వలన మానవశక్తిని వృథా చేసినట్లవుతుంది. పైగా వీరి పరధ్యానం వలన పని చెడిపోయే ప్రమాదం వుంది. యంత్రానికైతే పరధ్యానం వుండదు కదా!

ఒకింత ఆలోచిస్తే.. ఈ రోజుల్లో వైద్య రంగం లాంటి పెద్ద స్థాయిల్లో జరిగే సర్వీసుల విషయంలో సయితం వినిమయదారులకు పట్టుకున్న ఈ "పరధ్యాన" భయం ఏపాటిదో అర్ధమవుతున్నది. గతంలో కుడి చెవికి బదులు ఎడమ చెవికి ఆపరేషన్ చేశారనే వార్తలు వచ్చేయి. కత్తులు, కతార్లు కడుపులో మర్చిపోయేరనే జోకులు వచ్చేవి. ఇటీవల సెల్‌ఫోన్ల పిచ్చి పెరిగాక కొందరు డాక్టర్లు కన్సల్టేషన్ టైములో కూడా సెల్ మాట్లాడుతున్నారని చాలామంది వాపోతున్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూనే కంటి శుక్లాల ఆపరేషన్ చేసిన వార్త వచ్చింది. ఇటువంటి సంశయాలతోనేమో కాబోలు కార్పొరేట్ హాస్పిటల్‌లో చేర్చిన తమ బంధుమిత్రులకు శ్రద్ధగా, ఏకాగ్రతతో సర్జరీ చేయమని సదరు డాక్టర్లకు వాళ్లకు సన్నిహితులైన పెద్దలచే సిఫార్సు చేయించడం పెరిగిన పరిస్థితి నేడు వింటున్నాం.




ఇక విసుగు మాటకొస్తే – 'ఈ పని నాకు ఇష్టం లేదు. వద్దనుకున్నా ఖర్మ కొద్దీ చేయాల్సి వస్తోంది.' అని తిట్టుకుంటూ చేయడం వలన విసుగు వస్తుంది. అది అంతటితో ఆగదు, పని అప్పగించిన వారిపై విరుద్ధ భావం కలుగుతుంది. తన సహచరులకు వేరే మంచి పని యిచ్చారని అసూయ పడడం, వారిపై అకారణంగా కోపం కలగడం జరుగుతాయి. ఈ రకమైన విసుగు వలన పని భారంగా తోస్తుంది. త్వరగా అలసట కలుగుతుంది. బ్లడ్ ప్రెషర్ పెరిగి, అస్వస్థత సంభవిస్తుంది. ఇది కుటుంబ వాతావరణంపై కూడా ప్రభావం కలిగిస్తుంది. ఆఫీసులో కోపతాపాలు యింట్లో వారిపై ప్రదర్శిస్తే అక్కడ వాతావరణమూ పాడవుతుంది. నిజానికి పనిలో సామర్థ్యం పెరగాలంటే కుటుంబ వాతావరణాన్ని కూడా సవ్యంగా వుండేలా చూసుకోవాలి. లేకపోతే కాపురంలో వుండే చికాకులు వ్యక్తి యొక్క ఆలోచనా శక్తిని, కార్యనిర్వాహక శైలిని కుంటుపరుస్తాయి. దేనికి దానికి కంపార్టుమెంటలైజ్ చేసుకోవడం అలవర్చుకోవాలి. ఆఫీసు సమస్యలను యింటికి మోసుకెళ్ల కూడదు. కుటుంబ సమస్యలను ఆఫీసు వేళల్లో తలవకూడదు.

ఇంటిలో ఘర్షణ పడి, ట్రాఫిక్ రద్దీలో మరింత విసుగు పడి వచ్చినపుడు కలిగే ఆందోళనను పోగొట్టడానికి ఉద్యోగులను పనిలో దిగే ముందు పది నిమిషాల పాటు మౌన ధ్యానాన్ని చేయమనాలి. ఆ సమయాన్ని ఆఫీసు పనిలో భాగంగానే చూడాలి. అదే విధంగా పని ముగించి వెళ్లబోయే ముందు కూడా ధ్యానం చేసి, పని తాలూకు ఆందోళనలు యిక్కడే వదిలి వెళ్లమనాలి. ఆ విధంగా వారి కుటుంబ వాతావరణం ప్రశాంతంగా వుండేట్లు చూసినవారమౌతాము.

పని నెమ్మదించడానికి, బోరుగా అనిపించడానికి కారణం మొనాటనీ కావొచ్చును. దాన్ని అధిగమించడానికి, పని చేసే స్థలంలో తక్కువ స్థాయిలో వాద్యసంగీతం వినిపించడం మంచిదని శాస్త్రీయంగా నిరూపితమైంది. సంగీతం మనకు తెలియకుండానే మనసుకు ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. అదే విధంగా ఆఫీసు రొటీన్ వర్క్ నుంచి రిలీఫ్ కలగజేయడానికి ఆఫీసు ఖర్చులతోనే సిబ్బందిని కుటుంబసభ్యులతో సహా తరచుగా పిక్నిక్‌లకు పంపించడం, ఆర్నెల్లకోసారి ఆఫీసు పరిసరాల్లో వినోద, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసి, పోటీలు పెట్టి, బహుమతులు అందచేయడం మంచిది. కుటుంబసభ్యులు వచ్చి ఆఫీసు వాతావరణం చూసి యింప్రెస్ అయితే భర్తను లేదా భార్యను బాగా పనిచేసి పేరు తెచ్చుకోమని ప్రోత్సహించే అవకాశం వుంది. ఇలాంటి కార్యక్రమాలు లేని పక్షంలో కుటుంబసభ్యులు ఆఫీసుకి వచ్చే అవకాశం వుండదు. ఈ విధంగా విసుగు, పరధ్యానాలను పారద్రోలితే చేసే పనిని స్వధర్మంగా పాటించి, పనిలో రాణించే అవకాశాలు పెరుగుతాయి.

పని చేసే ప్రాంగణంలో సుహృద్భావ వాతావరణం పెంపొందాలంటే ఆఫీసులో ఎటువంటి రాజకీయపరమైన, ప్రాంతీయపరమైన, కులమతపరమైన విషయాలను చర్చించనీయకూడదు. ఎందుకంటే కొందరు వీటిపై తీవ్రభావాలు కలిగి వుంటారు. మొదట్లో ఎకడమిక్ డిస్కషన్‌గా ప్రారంభమైన పోనుపోను వాగ్వివాదాలు తీవ్రమై ఘర్షణ వాతావరణం ఏర్పడుతుంది.

✡ ✡ ✡

# WOMEN - WORK LIFE BALANCE

**- Smt. Lalitha Raghuram**
**Mohan Foundation**



A working woman's life is like that of the girl we see in the street corner walking on a thin rope and holding clay pots on her head. We are a wife, daughter, daughter in law, mother, mother in law and a working woman. You have familial duties along with deadlines at work. You have an important meeting at work and a Parent Teachers Meeting in your daughter's school. You want to do your best at both, but quite often one of the two is a compromise. That is where strong family support is important. In my case, my husband and mother in law held the fort. Not to forget that the children themselves were very understanding.

When you are in a joint family, you actually end up "giving" more than what you "take". I have simple mantras for work life balance.

**Mantra 1 :** Love everyone genuinely. Your in-laws are not your enemies. They are yours. Be it home or office, I have loved everyone like they are my own. So, life becomes so much more beautiful when you do that

**Mantra 2 :** Stay true to yourself. When you cannot do something, express your inability. After all, we are all humans. Let us not fake as if we are "super humans".

**Mantra 3 :** Work very hard as if there is no tomorrow. When you give your 100 percent, the universe speaks to you.

**Mantra 4 :** Value your family : Spend time with family, have a hearty laugh, go to the cinema, enjoy music and go on a vacation. Try a new cuisine.

**Mantra 5 :** Remember to have "Me time". Our passion, our cravings, our small desires are important. Going to a beauty salon, getting a massage done or just going out with friends are good for us to recharge.

**Mantra 6 :** Help team members grow. Remember knowledge is for sharing. Your team members are not your competitors. When you do that, you will find that they actually share your responsibilities.

**Mantra 7 :** We are humans, and we are not perfect. Be it our body shape, the colour of our skin or the texture of our hair; let us remember we are made differently. Enjoy what you are and celebrate it. Comparison does not take us anywhere.

**Mantra 8 :** Be committed. Whether it is work or home, any small or big responsibility on your shoulder, give it complete attention.

**Mantra 9 :** Learn something new every year. Age is only a number, and never think you are too old, for some new activity or hobby. Keep trying.

Lastly, this world is beautiful with its imperfections and don't forget to **smile.**

✡ ✡ ✡

MOHAN FOUNDATION

# 10. పనిలో కొత్త ఒరవడి తేవాలంటే ఆలోచనలను క్రమపద్ధతిలో పెట్టాలి

మనిషి తన ప్రమేయం అంతగా లేకుండానే యథేచ్ఛగా సాగే ఆలోచనల వెంట పరిగెత్తటం సహజ లక్షణం. అసలు ఆలోచించటమే ఓ కష్టమైన పని. లోతుగా, క్రమపద్ధతిలో ఆలోచించటం మరీ కష్టమనిపిస్తుంది. ఎందుకంటే ఏదైనా ఆలోచించడం మొదలుపెట్టగానే మనసు అటూయిటూ పరిగెడుతుంది. ఏవేవో అప్రస్తుతమైన విషయాలు గుర్తుకు వస్తాయి. మన ఆలోచనలు దారి తప్పి దాని వెంట పరిగెడతాయి. గాలిలో పండుటాకులా ఆ ఆలోచనాప్రవాహంలో ఎక్కడికో కొట్టుకుపోతాం. కొద్దిసేపటికి ఏదో గట్టుకి చేరి, సమీక్షించి చూసుకుంటే ఆలోచనాక్రమం ఎక్కడ ప్రారంభమైందో మర్చిపోతాం. మళ్లీ జాగ్రత్తగా, మానసికంగానే, వెనక్కి అడుగులు వేసుకుంటూ వస్తే, దేని గురించి ఆలోచన మొదలైందో గుర్తుకువస్తుంది. అటూయిటూ పోతున్న మనసనే గుర్రాన్ని కళ్లెం వేసి బిగించి, మళ్లీ ఆలోచించడం మొదలుపెడతాం.

సాధారణంగా ఆలోచనలు యిలా దారి తప్పడం వలన మనసు రిలాక్సవుతుంది. చేసే పని భౌతికమైన, మానసికమైన ఒత్తిడి కలిగించినపుడు, విసుగు పుట్టించినపుడు కాస్సేపు ఆలోచనల్లో పడి కొట్టుకుపోవడం వలన జరిగే హాని ఏమీ వుండదు. రోడ్డు మీద నడుచుకుంటూ పోతున్నప్పుడు యాక్సిడెంటు కనబడితే, ఆసుపత్రుల గురించి ఆలోచన పోతుంది. ఇంతలో మిఠాయి దుకాణం కనబడితే, ఆ ఆలోచన మర్చిపోయి, తిండి గురించి ఆలోచిస్తాం. అంతలోనే ముష్టివాళ్లు కనబడితే దేశ దుస్థితి గురించి బాధపడుతూ నాకే అధికారం వుంటే ఇలా జరగదు అంటూ ఆలోచిస్తాం. ఇంతలో సినిమా పోస్టరు కనబడితే, మనసు అటువైపు పోతుంది. వీటివలన కలిగే లాభం ఏమీ లేకపోయినా, మనసు ఒత్తిడికి గురవదు. కానీ బండి లాగే గుర్రం చూపు అటూయిటూ పోకుండా గంతలు కట్టి నడిపించినట్లు, ఆలోచనలు చెదిరిపోకుండా ఒక క్రమపద్ధతిలో నడిపించాలంటే మాత్రం మానసికంగా శ్రమ కలుగుతుంది. కానీ దానివలన ఒక మార్గం తప్పక గోచరిస్తుంది. నేను యీ పనిని మనసుపెట్టి చేస్తున్నానా లేదా? ఎంతటి అంకితభావంతో, ఎంత సామర్థ్యంతో చేస్తున్నాను, ఇంతకంటె సులభంగా లేదా మెరుగుగా, లేదా కొత్తరకంగా చేసే అవకాశం ఉందా? అని సరిగ్గా, నిష్పక్షపాతంగా అంచనా వేసుకునే అవకాశం వస్తుంది.



మనిషి ఏ పనినైనా చేపట్టినపుడు యాంత్రికంగా చేయకూడదు. 'దీనిపై నేను పెట్టే శ్రద్ధ వలన నేనే కాక, నా కుటుంబం, భావితరాలు, సమాజం కూడా బాగుపడతాయి.' అనే భావనతో చేయాలి. పిచ్చుక వంటి అల్పప్రాణి మనకు యీ విషయంలో పాఠాలు చెపుతుంది. ఎక్కడెక్కడో తిరిగి, పుల్లాపుడకా, గడ్డీపరకా ముక్కున పట్టి తెచ్చి తన పసికూనల కోసం గూడు కడుతుంది. ఎండావానల నుంచి వాటిని సంరక్షించుకుంటుంది. మనం పనిచేసే సంస్థ మనకు గూడూ, కూడూ యిస్తుంది. అది ఆశ్రయం యిచ్చే చెట్టులాంటిది. దాన్ని మనం రక్షిస్తే, అది మనల్ని రక్షిస్తుంది. పిచిక తన పిల్లల కోసం చేసినపాటి మనం మన భావితరాల కోసం చేయవద్దా?

పిచిక ఒక పక్షి, తరతరాలుగా ఒకే రీతిలో గూడు కడుతుంది. గిజిగాడు గూడు కట్టినంత నైపుణ్యంతో, తేనెటీగలు తేనెతుట్ట కట్టినంత టీమువర్క్‌తో కట్టలేదు. కానీ మనిషి పిచిక కంటె అభివృద్ధి చెందిన ప్రాణి. గిజిగాడు, తేనెటీగలు రెండిటికి కలిపిన శక్తి కంటె ఎక్కువ ఉంది. పైగా నిరంతరం తనను తాను మెరుగు పరుచుకోగలడు. కొత్తగా ఆలోచించి, సృజనాత్మకత ఉపయోగించి, నూతనమార్గాలు అన్వేషించి సంస్థలోని యితరులతో భుజం కలిపి, సమిష్టి కృషితో అద్భుత ఫలితాలను సాధించగలడు. ఎటొచ్చీ పిచికకున్న అంకితభావం వుండాలంతే! ఈ విషయంలో అది మనకు గురువు.

**వ్యాపారంలో నూతన ధోరణులను ప్రవేశ పెట్టడం ఎలా?**

దేశంలో అనేక జిమ్‌లు, ఫిట్‌నెస్ ట్రైనింగ్ సెంటర్లు వున్నాయి. పోటీ ఎక్కువై వ్యాపారంలో నష్టం వచ్చి మూతపడినవి కూడా ఉన్నాయి. "క్యూర్‌ఫిట్" అనే సంస్థ యితరులకంటె భిన్నంగా ఏం చేయగలమా అని ఆలోచించింది. సాధారణంగా జిమ్‌లన్నీ ఫిజికల్ ట్రైనింగ్ మీదే దృష్టి పెడతాయి. కానీ "క్యూర్‌ఫిట్" కసరత్తుతో బాటు తగిన ఆహారం, మానసిక ఆరోగ్యం విషయాలలో కూడా తర్ఫీదు యిస్తానంది. ఏ విధమైన ఆహారం, ఎంత తినాలో

సూచనలు యిస్తూ, పోషకాహారం వున్నవాటిని ఆన్‌లైన్‌లో తెప్పించుకునే వెసులుబాటు కల్పించింది. వాటిల్లో కూడా సౌత్ ఇండియన్, నార్త్ ఇండియన్, ఇటాలియన్, చైనీస్ వగైరా భిన్నరకాల వంటకాలలో ఏవేవి మంచివో సూచించేది. తమ వద్దకు వచ్చాక వెయిట్ చేయనక్కరలేకుండా ఆయా క్లాసులకు ముందుగా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే వీలు కల్పించింది. వర్క్‌ఔట్ చేయడంలో కూడా యోగా, జుంబా, ఎచ్ఐఐటి, బాక్సింగ్ యిత్యాది అనేక ఆప్షన్లు యిచ్చింది. దీంతో ఆ కంపెనీ ప్రత్యర్థుల కంటె ముందుగా దూసుకుపోయింది.

**వ్యాపారంలోనే కొత్త అవకాశాన్ని సృష్టించుకోవడం ఎలా?**

ఒకతనికి టైలరింగు దుకాణం వుంది. ఆ ప్రాంతంలో అవే తరహా దుకాణాలు అనేకం వుండడంతో అతనికి పెద్దగా బేరాలు వచ్చేవి కావు. ఆ సమయంలో ప్లాస్టిక్ బ్యాగ్‌ల నిషేధం రావడంతో అంతా గుడ్డ సంచీలు వాడడం మొదలు పెట్టవలసి వచ్చింది. ఇతను అందంగా, ఫ్యాషనబుల్‌గా గుడ్డ సంచీలు అమ్మడంతో అందరూ ఎగబడి కొన్నారు. అతని వ్యాపారం నిలదొక్కుకుంది.

✡ ✡ ✡

# 11.నేటి పనిమంతుడే- రేపటి శ్రీమంతుడు

కొందరు పని మొదలెట్టినప్పటి నుంచీ ఎప్పుడు పూర్తి చేసుకొని బయటపడదామా అన్న ఆలోచనలో ఉంటారు. మరికొందరు, నేను గనుక రాకపోతే ఈ పని ఎవరివల్లా తెమిలేది కాదు అని బడాయికి పోతారు. ఇంకొందరు 'నేను కష్టపడదల్చుకుంటే ఇంతకంటే బాగా చేయగలను, కానీ ఎందుకంత ఆయాసపడాలి? నేను ఎంత నేర్పుగా, త్వరగా చేసినా అదనంగా ఒరిగేదేమైనా వుందా? లేనప్పుడు ఓవర్‌యాక్షన్ అనుకుంటారు కదా, అందరిలాగే మొక్కుబడిగా కానిస్తే పోలా!?' అని భావిస్తూంటారు. కాస్త బుర్ర పెట్టి ఆలోచిస్తే ఈ రకమైన ధోరణులు చచ్చు తెలివితేటల క్రిందకు వస్తాయని చెప్పొచ్చు. ఎలాగంటే, ఇలాంటి వాళ్ళ మీద ఎలాంటి ఇంప్రెషన్ పడుతుందో ఒకసారి విశ్లేషిద్దాం.

రొటీన్ పని చేసే సాదా వ్యక్తులకు ఏ గుర్తింపూ వుండదు. ఎల్లయ్య అయినా, పుల్లయ్య అయినా ఒకటే ఉన్నా ఊడినా తేడా రాదు అనుకుంటాడు యజమాని. నా

పనితనం వేరెవ్వరికీ రాదు అనుకునే వారు నా కోడీ కుంపటీ లేనిదే తెల్లవారదు అనుకునే ముసలమ్మ లాంటివాళ్లు. ఎవరు లేకపోయినా బండి నడిచే విధంగా వ్యవస్థను కూరుస్తారు. నీ ముందూ, నీ తర్వాతా కూడ ఆ సీటులో వేరెవరో పని చేశారని, చేస్తారనీ




గుర్తు పెట్టుకోవాలి. ఇక మూడో కేటగిరీ – ప్రతిభ వుండి కూడా పని చేయనివాడు టికెట్ కొన్నా రైలు ఎక్కని వ్యక్తి లాంటివాడు. సంతకం చేయడం తెలిసినా వేలిముద్ర వేసే మూర్ఖుడు. ప్రతిభకు ఏనాటికైనా గుర్తింపు వుంటుందని, యజమాని ఏదో ఒక విధంగా ఉద్యోగులందరినీ గమనిస్తూనే వుంటాడని, సమయం వచ్చినపుడు పై పదవికి పంపడమో, యింటికి పంపడమో చేస్తాడని అర్థం చేసుకోలేని అజ్ఞానులు.

ఇలాంటి అవలక్షణాలు గల చాలా మంది వ్యక్తులు 'చురుకైన పనితనం అని వేరే ఒకటుందా? అదెలా వుంటుందో చెప్పుచూదాం?' అనే చులకన భావంతో వుంటారు. పర్యవసానంగా వీళ్ళ ఎదుగుదల అరకొరగా వుంటుంది. ప్రమోషన్ సమయంలో తమను పక్కకు పెట్టినపుడు అసూయతో భగ్గుమంటూ అవతలివాళ్లపై ఆరోపణలు చేస్తారు తప్ప, తప్పు తమలో వుందని గ్రహించరు. సంస్థపై పగబట్టి, దానికి ఎలాగైనా హాని చేయాలని చూస్తారు. ప్రమోషన్ రాలేదు కాబట్టి అధిక ఆదాయానికై అవినీతి మార్గాలు పడతారు. అది చివరకు బయటపడి, వినాశనానికి దారి తీస్తుంది. మొదటి దశలోనే పనిమంతుడిగా ప్రవర్తించి వుంటే యిన్ని దుష్పరిణామాలు చోటు చేసుకునే అవకాశమే వుండదు కదా.

**అసలు సిసలైన పనిమంతుడి తీరు ఎలా ఉంటుంది? :** పనిమంతుడైన వాడు ప్లంబరైనా, ప్రైమ్ మినిస్టర్ ఐనా తన పనికి గౌరవం ఇచ్చుకుంటాడు. నన్ను నమ్మి నాకు అప్పగించిన పనిని సవ్యంగా చేయాలి, అప్పగించినవారి అంచనాలకు మించి చేసి వారిని మెప్పించాలి అనుకుంటాడు. పాతదే రిపీట్ చేసే బదులు, తాజా అవసరాలకు తగినవిధంగా మార్పులు చేయగలనా? సహచరులను సంప్రదించి

మెరుగైన అవుట్‌ఫుట్ ఇవ్వగలనా? అని ఆలోచిస్తాడు. తెలిసిన పనిని చకచకా చెయ్యాలి. తెలియని కొత్త పనిని ఆలోచించి నేర్పుగా, ఒడుపుగా చెయ్యాలనుకుంటాడు. తనకు మెప్పు లభించినపుడు ఆ క్రెడిట్‌ను తన టీములోని అందరితో పంచుకుంటాడు. మెప్పు లభించినపుడు ఆత్మతృప్తి కలిగింది కదా అని ఊరడిల్లుతాడు. ఈ ధోరణి వలన మిత్రుల సంఖ్య పెరుగుతుంది. అసూయకు తావుండదు. పని చేస్తున్న చోట సానుకూల వాతావరణం వెల్లివిరుస్తుంది. ఈ విధానం ఎవరు అవలంబించినా శ్రీమంతులే కాగలరు. ఇక్కడ శ్రీమంతుడంటే ధనవంతుడని కాదు, తను పొందిన మనోవికాసాన్నీ, ఆత్మతృప్తినీ సమాజంతో పంచుకునేవాడు!

**చిన్న పనికి కూడా పెద్ద గుర్తింపు:** మన రోజువారీ జీవితం అంటేనే చిన్నాపెద్దా పనులు చేసేవారితో ముడిపడి వుంది. మన కంప్యూటర్ రిపేరు చేసేవాడు ఎంత ముఖ్యమో, ఇల్లు చిమ్మేవాళ్లు, వడ్రంగి పని చేసేవారు, బాత్‌రూమ్ కడిగేవాళ్లు కూడా అంతే ముఖ్యం. ప్రతి పని మనకు అత్యంత ముఖ్యమే. అందుకే ఎవరు పని బాగా చేస్తారో, వాళ్ళ ఫోన్ నెంబర్లు సేవ్ చేసుకుంటాము. అవసరానుసారంగా మళ్ళీ మళ్ళీ పిలిపించుకోవడమే కాకుండా, వేరొకరికి రిఫరెన్సు కూడా ఇస్తుంటాము. పని సవ్యంగా చేయనివారిని గుర్తు పెట్టుకుని యిక మళ్లీ పిలవం. 'మంచి డ్రైవర్ ఉంటే చెప్పండి, మంచి తోటమాలి వుంటే చెప్పండి' అని ఎందరో మనల్ని అడుగుతూంటారు. అంటే అర్థమేమిటి? మంచి పనివాడికి ఎప్పుడూ డిమాండ్ వుంటుంది. పాత కష్టమర్ పదేపదే పిలుస్తాడు. కొత్త కస్టమర్ ఓ సారి వచ్చి కాస్త చేసిపో అని పిలుస్తూంటాడు. వీళ్లు ప్రకటనలు యివ్వనక్కరలేదు, సిఫార్సులు చేయించుకోనక్కరలేదు. మౌత్ పబ్లిసిటీ ద్వారానే నిరంతర ఆదాయం వచ్చి పడుతూంటుంది. ఏ పనివాడైనా సరే, యిలాటి స్థితిలో వుండాలని కోరుకోవాలి. దానికి ఒక్కటే ఉపాయం – చేసేదేదో శ్రద్ధగా చేయడం!

ఇదే సూత్రం కార్యాలయాలలోన కూడా వర్తిస్తుంది. ఏ స్థాయిలో పని చేస్తున్నావన్నది కాదు, ఏ పని చేసావు అనేది కాదు. ఎలా చేశావు అన్నదే గుర్తింపు తెచ్చిపెడుతుంది. సరిగ్గా పనిచేయని మేనేజరు కన్నా, శ్రద్ధగా పనిచేసే అటెండరుకు ఎక్కువ మన్నన ఉంటుంది.

✡ ✡ ✡

## నేటి యువతీ యువకుల్లో తీవ్ర మానసిక ఒత్తిడి ఎందుకు?

మన సామాజిక వ్యవస్థ, అందులోనూ యువత సాంకేతికంగా ఎంతో ముందడుగులో వుంది. కానీ, మానసికమైన కుంగుబాటు మాత్రం యువతలో నానాటికీ పెరిగిపోతున్నది. నాగరికత పేరుతో కొందరు ధనిక వర్గాల యువత దుర్వ్యసనాల పాలవుతున్నారు. అభద్రతతో ఉన్న నిరుద్యోగులకు బాధ, మానసిక ఆందోళనలు వుండటం సహజం అనుకుందాం. మంచి జీతంతో ఉద్యోగం చేస్తున్న అనేకమంది యువతీయువకులు కూడా భవిష్యత్తు పట్ల, ఉద్యోగంలో ప్రమోషన్‌ల పట్ల బెంబేలు పడుతూ, మానసిక వేదనకు లోనవడం, ఇతరులతో పోల్చుకొని తమ కెరీర్ ముందుకు సాగడం లేదంటూ నైరాశ్యానికి గురి కావటం శోచనీయం. ఇక కుటుంబసమస్యల విషయానికొస్తే ప్రేమలు, పెళ్లిళ్ల వ్యవహారాల్లో నిస్పృహతో కొందరు యువ కళాకారులు, ఉద్యోగస్తులైన యువత తీవ్ర మానసిక సంఘర్షణలకు గురై, ఆత్మహత్యకు పాల్పడిన ఉదంతాలను ఇటీవల మనం గమనిస్తున్నాం. ఈ పరిస్థితిని కేవలం ఆర్థిక సమస్యతోనే ముడిపెట్టలేము. సంఘంలో ఇదో మనోవ్యాధిగా మారింది.! తన కెరీర్‌లో ఇంకా స్థిరపడలేదనే నెపంతో, వయసు మీరుతున్నా పెళ్లిళ్లు వాయిదా వేసుకొని కొందరు యువతీ యువకులు తమ సమస్యలను తామే కొని తెచ్చుకుంటున్నారు. వీటన్నింటికీ మూలకారణం– కెరీరే సర్వస్వం అనుకోవడం, సంపాదన కొనసాగుతుందో లేదోనన్న అభద్రతా భావం. తాము ఏ రకమైన ఉద్యోగం, వృత్తిలో హ్యాపీ గా ఇమడగల్గుతామో స్వధర్మ భావనతో గుర్తెరిగితే, ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని భావించవచ్చు.

**నేటి యువత తప్పక పాటించాల్సింది –(1) చేసే వృత్తి పట్ల గౌరవం (2) ఆశించే ఫలితాల పట్ల నిరీక్షణా సమయంలో ఓర్పుతో కూడిన నిబద్ధత.** ఒకసారి తమకు నచ్చిన కెరీర్‌ను చేపడితే పనిలో వారి నైపుణ్యాన్ని చూపుతారు గనుక జీతంలో పెంపు, ప్రమోషన్ అనేవి సహజంగానే వస్తాయి. ఉద్యోగాన్ని యాంత్రికదృష్టితో కాకుండా, సృజనాత్మకంగా చేస్తే విసుగు బదులు మనసుకి వికాసం కలుగుతుంది. ఈ నేపథ్యంతో ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగంలోనే కాదు, జాబ్ మారినా కూడా, ఇందులో పెంపొందించుకున్న ప్రావీణ్యతలు కొత్త జాబ్‌లో లేదా సొంతవృత్తిలో అనుభవసారంగా, జ్ఞానానికి పెట్టుబడిగా ఉపకరిస్తాయి. ఇక ఇష్టమైన పనిని హాయిగా చేస్తున్న వారికి మానసిక ఒత్తిడి దానంతట అదే దూరమౌతుంది కదా!

✡ ✡ ✡

# 12. కష్టమర్ల సంతృప్తికి గీటురాయి ఏది?



తన క్లయింట్లను తృప్తిపరచగలిగినవాడే మంచి పనిమంతుడు అని నిర్వచించాం. బాగానే వుంది. కానీ ఆ తృప్తికి కొలబద్ద ఏది? గతంలో అయితే అతడు థాంక్స్ చెప్పాడనో, చిరునవ్వు నవ్వాడనో, మళ్లీ వచ్చాడనో గమనించి సంతృప్తి పడ్డాడని అనుకునేవాళ్లం. కానీ యిప్పుడు రేటింగుల విధానం వచ్చింది. పని పూర్తి కాగానే, 'మీరు యీ పనివాడితో లేదా ఉద్యోగితో తృప్తి పడ్డారా లేదా, పడితే ఏ స్థాయిలో తృప్తి పడ్డారు? ఏ కారణంగా తృప్తి పడ్డారు? ఇతన్ని మళ్లీ పిలుస్తారా లేదా?' ఇలా ప్రశ్నలు గుప్పించి, అతనిచ్చే సమాధానాల ఆధారంగా ఆ ఉద్యోగికి రాంకింగ్ యిస్తున్నారు. దాంతో టాక్సీ దిగగానే టాక్సీ డ్రైవరు 'సార్, కాస్త 5 రేటింగు యివ్వండి.' అని బతిమాలే పరిస్థితి వస్తోంది. మనం రైలు పట్టుకునే హడావుడిలో వుండి రేటింగు యివ్వకపోతే పాపం అతను నష్టపోతున్నాడు. గతంలో అయితే ప్రయాణం సౌకర్యంగా జరిగిందా అని డ్రైవరు అడిగితే 'టాక్సీ ఎక్కాం, దిగాం, డబ్బిచ్చాం, దింపావ్. దీనిలో ఏమంత ఘనకార్యం వుందని బాగుందాని అడగడం?' అని విసుక్కునేవారం. ఇప్పుడు ప్రతీదానికీ ప్రతీవాడు రేటింగులు యిచ్చేవాడే!

ఏదైనా హోటల్‌లో దిగి, పొద్దున్న పేపరు రావడం ఆలస్యమైతే 'ఇది ఒక చెత్త హోటల్' అని రాసేస్తున్నారు. తీర్పులివ్వడం అందరి వలనా చేతకాదు. అందుకే కొంతమందే జడ్జిలు అవుతారు. కానీ రేటింగు సిస్టమ్‌లు వచ్చాక ప్రతీవాడూ జడ్జి అయిపోయాడు. కార్పోరేట్ ఆసుపత్రులు 'మా డాక్టరుకి రేటింగు యివ్వండి' అని అడగడం, వెళ్లినవాడు '3కి మించి యివ్వను. అనవసరంగా టెస్టులు చేయించాడు' అనడం జరుగుతోంది. టెస్టులు అవసరమో కాదో తెలుసుకునేటంత వైద్యపరిజ్ఞానం యీ రోగికి వుందా అన్న సందేహం వెంటనే వస్తుంది.

**మరి ఈ రేటింగుల యుగంలో మంచి పనివాడని అనిపించుకోవడం ఎలా? :** ఒక నాయకుడు ఓట్ల కోసం, ఒక వ్యాపారి టర్నోవర్ కోసం, కళాకారులు, క్రీడాకారులు

ప్రజాదరణ కోసం ఎప్పుడూ ఆరాట పడుతూనే వున్నారు, వుంటారు కూడా. అంటే ప్రతివారు ప్రజాదరణ మీదే దృష్టి పెడుతున్నారు. ఒక సినిమా లేదా ఒక ఆట కొన్ని గంటలకు పరిమితమై ఉంటుంది గనుక వాటిపై ప్రొఫెషనల్స్‌గా చెప్పబడేవాళ్ళు విశ్లేషణ చేస్తూ రేటింగ్ ఇవ్వటం అనేది కొంతవరకు సబబు అనుకుందాం. ఒక దుకాణానికి లేదా సంస్థ చేసే కార్యకలాపాల పట్ల తాత్కాలికంగా స్పందించే వ్యక్తుల వ్యాఖ్యల బట్టి కొన్ని వెబ్‌సైట్లు రేటింగ్‌లను నిర్ధారించితే, దానిని అనుసరించి నిర్ణయాలు తీసుకోవటం ఎంతవరకు సమంజసం? ఇందులో శాస్త్రీయత ఏ మేరకు వుంది?

కాస్త లాజిక్ ఉపయోగించి చూద్దాం. మనం ఏదైనా వూరు వెళదామనుకుని అక్కడ హొటల్స్‌లో మంచిదేదో తెలుసుకోగోరాం. లేదా ఆన్‌లైన్‌లో ఏదైనా వస్తువు కొందామనుకుని అంతకుముందు వాడినవారి రివ్యూలు, దాని ప్రకారం యిచ్చే రేటింగ్స్ శాతాలు చూస్తున్నాం. కొనబోయే సరుకు, ఆశించే సర్వీసులపై ప్రాథమిక అంచనాకు రావటానికి యీ పద్ధతి ఒక విధంగా మంచిదే అనిపించవచ్చు. ఎంత ఎక్కువమంది దాన్ని ఆమోదిస్తే అంత మంచిదని మనం అనుకుంటున్నాం. అయితే యిక్కడ మనం మర్చిపోతున్న విషయమేమిటంటే – మొత్తం వాడకం దారుల్లో వ్యాఖ్యాతల శాతం అనేది అతి తక్కువ అని. పైగా సంతృప్తి పడిన కస్టమరు సాధారణంగా స్పందించరు. ఉదాహరణకు మనమే వున్నాం. ఏదైనా ఆన్‌లైన్‌లో వస్తువు తెప్పించాం. వస్తువు సక్రమంగానే చేరింది, మనం అనుకున్న సైజులోనే, అనుకున్న రంగులోనే ఉంది. తల వూపి వూరుకుంటాం. దీనికి రేటింగు యివ్వండి, కాస్త టైము కేటాయించి మా సర్వేలో పాల్గొనండి అని వెబ్‌సైటు వాడు మన వెంట పడతాడు. మెయిల్స్ పంపుతాడు, మెసేజిలు గుప్పిస్తాడు.

మనం ఏమనుకుంటాం? 'మనం డబ్బిచ్చాం, వాడు సరుకు పంపించాడు, చేసిన ఘనకార్యం ఏముంది? ఈ సర్వే వలన నాకు ఒరిగే లాభమేముంది, టైము వేస్టు తప్ప' అనుకుని మన అభిప్రాయాన్ని చెప్పం. అదే పంపిన సరుకు తృప్తిగా లేదనుకోండి. కసి పెరుగుతుంది, వెంటనే ఛడామడా తిడుతూ వ్యాఖ్యలు పెడతాం. అప్పుడు టైము వేస్టయిందనుకోము. మనను దగా చేసిన వీడి వ్యాపారాన్ని దెబ్బ తీయాలి, అలాగైనా మనకు జరిగిన నష్టం మానసికంగానైనా పూడుతుంది అనుకుంటాం. ఈ విధంగా అసంతృప్తులైన కస్టమర్లే ఎక్కువగా వ్యాఖ్యలు పంపుతూ వుంటారు. అవి మాత్రమే చూస్తే మనకు క్లియర్ పిక్చర్ రాదు... కదా!

అంతేకాకుండా ఆ వ్యాఖ్య చేసి ఎన్నాళ్లయింది అనేది కూడా మనం గమనించాలి. ఎందుకంటే సరుకులు, సర్వీసుల స్థాయి ఎప్పటికప్పుడు మార్కెట్ పరిస్థితిని బట్టి మారిపోతుంటుంది. ఒక కాలేజీ నాణ్యత ఫ్యాకల్టీపై ఆధారపడి వుంటుంది. ఒక హాస్పిటల్ నాణ్యత డాక్టర్స్ ప్యానెల్ బట్టి వుంటుంది. వారిలో కొందరు వెళ్లిపోయినా, మరి కొందరు వచ్చి చేరినా నాణ్యత పెరగవచ్చు, తరగవచ్చు. మనుషులు మారకపోయినా వారి మనస్తత్వాలు మారవచ్చు. ఇలాంటి అనేక వ్యవస్థలలో సంస్థాగతమైన కొన్ని మార్పులు నిరంతరం చోటు చేసుకుంటూనే ఉంటాయి. కనుక, ఒకప్పటి రేటింగ్ ఇప్పటికీ అలాగే వర్తిస్తుందని చెప్పలేము. అందుచేత వీటిపై ఎక్కువగా ఆధారపడకుండా ప్రొఫెషనల్స్‌ను సంప్రదించడం మేలు. లేదా తెలిసున్నవారిని అడగడం మేలు. ఈ విషయంలో వినిమయదారులు ఆచితూచి వ్యవహరించడం ఎంతైనా మంచిది. మనమే సేవలందించేటప్పుడు మనపై కూడా వ్యతిరేకమైన వ్యాఖ్యలు వస్తాయని ముందే సిద్ధపడి, మన ఆత్మవిశ్వాసం కోల్పోకూడదు. ఈ వృత్తికి మనం పనికిరామనే ఆలోచనకు తొందరపడి రాకూడదు.

**స్వాధ్యాయంతో మనకే గొప్ప మేలు:** స్వ + అధ్యాయంను **స్వాధ్యాయం** అంటారు. అష్టాంగ యోగంలోని, నియమ సూత్రాల్లో ఇదొకటి. పూర్తి చేసిన పనులను ఒకసారి పునఃసమీక్ష చేసుకోవడం, లోపాలను అవగతం చేసుకొని సరిదిద్దుకోవటం ఇందులో ప్రధాన అంశం. ఈ విధానాన్ని ఎవరైనా తమకుతాము అమలు చేసుకోవచ్చును. ప్రతి రోజు నిద్రపోయే ముందు 'ఈ రోజు ఏమేమి చేసాము? ఏవి ఎందుకు చేయలేక పోయాము? ఇవాళ చేసిన పొరపాట్లు ఏమిటి? దీని నుంచి కొత్త గుణపాఠం ఏమి నేర్చుకున్నాను?' అని ఒక డైరీలో నోట్ చేసి పెట్టుకోవటం ఉత్తమం. ఈ విధమైన పరిశీలన ద్వారా మనల్ని మనం చక్కదిద్దుకోవటానికి స్వాధ్యాయం ఒక ఉపకరణంగా పేర్కొనవచ్చును.

ఇది వ్యక్తిగతమైతే, సంస్థాగతంగా చేసుకునే ఆత్మపరిశీలనను ఫీడ్‌బ్యాక్ అంటారు. అది వారు సిబ్బంది నుంచి, క్లయింట్ల నుంచి సేకరిస్తారు. ఆ ప్రక్రియ వారికి ఎంతగానో ప్రయోజనకరం. ఏ ఉత్పాదన గురించి వినియోగదారులకు అవగాహన వుందో, ఏది వారికి ఏ మేరకు నచ్చుతోందో, తమ ప్రచారవిధానం వారిని ఆకట్టుకుంటోందో లేదో, దాని ధర గురించి వారి అభిప్రాయమేమిటో తెలుస్తుంది. చక్కదిద్దుకోవడానికి మంచి అవకాశాన్ని కల్పిస్తుంది. సేవారంగంలో వున్న సంస్థలు సైతం తమ సిబ్బంది

పని తీరు గురించి, నాణ్యత గురించి క్లయింట్ల అభిప్రాయాన్ని సేకరిస్తున్నారు. వారి స్పందనను బట్టి భవిష్యత్ ప్రణాళికలను రచించడం సులభమౌతుంది.

అందుకే పెద్ద హాస్పిటల్స్ నుంచి, అనేక కార్పొరేట్ సంస్థల వరకు తమ తమ కస్టమర్ల నుండి ఫీడ్‌బ్యాక్ ఫారం పూర్తి చేయించటం జరుగుతున్నది. కారు వంటిది అమ్మగానే ఫీడ్‌బ్యాక్ తీసుకోవడం సరే, ప్రతీ సర్వీసు తర్వాత కూడా ఫోన్ చేసి ఎలా వుందని మరీ అడుగుతున్నారు. ఇక వాట్సాప్‌లో కాల్ చేస్తే. కాల్ పూర్తవగానే కాల్ క్వాలిటీ ఎలా వుందని ఫీడ్‌బ్యాక్ అడుగుతున్నారు. కోట్లాది టర్నోవరున్న కార్పోరేట్ కంపెనీలే ఫీడ్‌బ్యాక్‌కి అంత ప్రాధాన్యత యిస్తూండగా మనం వ్యక్తిగతంగా ఎందుకు యిచ్చుకోకూడదు? కంపెనీలైతే దానికై ఖర్చు పెడుతున్నాయి. మనం ఖర్చు పెట్టేది రోజులో ఓ పావుగంట సమయం మాత్రమే!

స్వీయ లోపంబు లెఱుంగుట గొప్ప విద్య – అన్నాడు గాలిబ్ కవి. ఆత్మ పరిశీలన ద్వారా గమనించే తప్పొప్పులు పరిమిత స్థాయిలోనే ఉండొచ్చు. మన లోపాలన్నీ మనకు తెలియకపోవచ్చు. అందువలన అప్పుడప్పుడు కొందరు హితులు చేసే వ్యాఖ్యలను సైతం పట్టించుకుంటూ 'వినదగు నెవ్వరు చెప్పిన..' అనే సూత్రాన్ని అమలు చేయాలి. ముఖ్యంగా మనం గుర్తించాల్సింది ఒకటుంది. మన సరుకులో నాణ్యత, సేవల్లో నిజాయితీ, వేగం చూపించగలిగితే బోలెడు ఖర్చు పెట్టి చేసే పబ్లిసిటీ కంటే మౌత్ పబ్లిసిటీ ద్వారానే మనకు గుర్తింపు వస్తుంది. అనేక చిన్న సినిమాలు యిదే రీతిలో తమ పెట్టుబడిని రాబట్టడమే కాక, లాభాలు ఆర్జించాయి. ఆడియో ఫంక్షన్లు, సక్సెస్ మీట్‌లు అంటూ ఎంతో హంగామా చేసిన కొన్ని పెద్ద సినిమాలు బోల్తా పడ్డాయి. పెద్ద పబ్లిసిటీ లేకుండానే తాజా కూరగాయలు, పండ్లను అందుబాటు ధరల్లో అందించి "పొలిమేరాస్" విస్తరిస్తూ పోతున్న వైనం కూడా గమనించవచ్చు.

✡ ✡ ✡

# 13. స్వధర్మ మార్గంలో చేయవలసిన పనులు

1– ఎంపిక చేసుకున్న వృత్తికి సంబంధించిన సమగ్ర సమాచారం ఇంటర్‌నెట్ నుండి, లైబ్రరీ పుస్తకాల నుండి, మార్కెట్‌లో వున్న మేగజైన్ల నుంచి సేకరించుకోవాలి. వీటితో బాటు ప్రొఫెషనల్ కౌన్సిలింగ్‌లో పాల్గొనాలి.

2– ఆ రంగంలో మీకు పూర్వప్రవేశం లేకపోయిన పక్షంలో, దానిలో పెట్టుబడి

పెట్టి ప్రయోగం చేసే బదులు ఆ రంగానికి సంబంధించిన సంస్థలో చేరి ఉద్యోగం చేసి, అనుభవం సంపాదించి, తర్వాత దానిని వృత్తిగా చేసుకుంటే మేలు. ఎందుకంటే ఎన్ని పుస్తకాలు చదివినా, ఎన్ని ప్రసంగాలు విన్నా, అనుభవానికి సాటి రావు.

3– ఉద్యోగిగా అనుభవం గడించాక, మార్కెట్ లోతుపాతులు తెలుసుకున్నాక, ధైర్యం, నమ్మకం చిక్కితే సొంత వ్యాపార ప్రయత్నానికి శ్రీకారం చుట్టొచ్చు. ఎవరైనా కలిసి వస్తారనుకుంటే, నమ్మకస్తుడైతే భాగస్వామ్యంతో ప్రారంభించడం చేత రిస్కు తగ్గుతుంది, కాంటాక్టులు పెరుగుతాయి.

4– వ్యాపారం పెట్టే ధైర్యం చాలకపోతే ఉద్యోగిగా కొనసాగుతూనే ఆ రూపంలో మీ స్వధర్మాన్ని ఆస్వాదిస్తే కూడా ఆత్మసంతృప్తి, జీవితంలో పురోగతి లభిస్తాయి.

**ఎంచుకున్న వృత్తిలో రాణించడానికి ఎలాంటి శిష్యరికం చేయాలి? :** ఉద్యోగంలోనే కొనసాగినా, సొంత వ్యాపారం పెట్టుకున్నా ఆ రంగంలో వున్న సీనియర్లను కలిసి మాట్లాడుతూ వుండాలి. వారు జయించి వుండవచ్చు, అపజయం చవి చూసి వుండవచ్చు. ఇద్దరి నుంచీ నేర్చుకోవలసినది చాలా వుంటుంది. మీకు వారితో అవసరం వుంది కానీ, వారికి మీతో లేదన్న విషయం గుర్తుంచుకోవాలి. మీకు సమయం కేటాయించడం వలన వారి సమయం వ్యర్థమౌతుంది కాబట్టి, వారు పెద్దగా ఆసక్తి చూపరు. అయినా వారి అభిమానాన్ని చూరగొని వారితో స్నేహాన్ని పెంచుకోవడానికి మీరు గట్టిగా ప్రయత్నించాలి. ఎవరికైనా సరే, తామెంత కష్టపడ్డామో చెప్పుకోవాలనే యావ వుంటుంది. కుటుంబసభ్యులు వినరు, స్నేహితులు పట్టించుకోరు. మీరు వారిని ఆ దిశగా కదిలించగలిగితే వారు మిమ్మల్ని దగ్గరకు రానిస్తారు. అవసరం మీది కాబట్టి మీరే వారిని పార్టీకి, లేదా యింట్లో భోజనానికి పిలిచి మాట్లాడించాలి.

వారు తమ జీవితం సాగిన తీరును, వ్యాపారంలో ఎదురైన ఒడిదుడుకులను చెప్తూ వుంటే అవసరమైన చోట సరైన వ్యాఖ్యలు చేస్తూ, అదనపు సమాచారం అడుగుతూ వారిని ఉత్సాహపరచాలి. వారు చెప్పేదానిలో అతిశయోక్తులు వుండవచ్చు కానీ వాటిని మనం మనసులో నిక్షిప్తం చేసుకుంటూనే వేరే ఒక పుస్తకంలో నోట్ చేసుకోవాలి. ప్రతి బిడ్డ నడక నేర్చుకోవడానికి తప్పటడుగులు వేస్తాడు. అవే ఆసక్తికరం. నడకంటూ వచ్చిన తర్వాత ఎంత వేగంగా నడిచాడన్నది ముఖ్యం కాదు. వ్యాపారం నెలకొల్పిన తొలి నాళ్ళలో ఎదురైన ఇబ్బందులే మనకు పాఠాలు. ఈ రకమైన సమావేశాల వలన మనం అవి నేర్చుకోవచ్చును.

స్వయంగా వెళ్లి కలవడం దేనికి, రానిస్తాడో లేదో, దాని కంటె వాళ్లు పత్రికలకో, టీవీలకో యిచ్చిన ఇంటర్వ్యూలు చూస్తే సరిపోతుందిలే అనుకోరాదు. ఎందుకంటే ప్రశ్నలడిగే విలేకరికో, యాంకర్‌కో వీటిలో ఎంత పరిజ్ఞానం వుందో, ఎంత ఆసక్తి వుందో మనకు తెలియదు. ఏదో మొక్కుబడిగా అడిగితే సమాధానాలు కూడా అంటీముట్టనట్లుగానే చెప్తారు. శ్రోత ఉత్సాహం బట్టే వక్త మనసు విప్పి మాట్లాడతాడు. ప్రత్యక్షంగా కలిసి అడిగినప్పుడు, లోతైన ప్రశ్నలు వేసినప్పుడు చెప్పాలనే ఉత్సాహం వారిలో కలుగుతుంది. తెలియనివారితో వారు మాట్లాడరన్న జంకు వద్దు. లేఖల ద్వారా మీరు ఎపాయింట్‌మెంట్ అడిగి, నిజాయితీగా ప్రయత్నం చేస్తే వారు మీకై సమయం కేటాయించవచ్చు. ఎందుకంటే వారు వ్యాపారంలో పైస్థాయికి వచ్చారంటే మనుష్యులను అంచనా వేయడంలో దిట్టలై వుంటారు. ఒకవేళ తాము బాగా బిజీగా వుంటే 'మీరే ఎవరినైనా సూచించండి. వెళ్లి వారిని కలుస్తాను.' అని అడగవచ్చు. అప్పుడు వారు కంపెనీలో తమ సహచరుల పేరో, భాగస్వాముల పేరో సూచించవచ్చు. వారిని కలిసి కొంత సమాచారం సేకరించాక అప్పుడు వీరి దగ్గరకి మళ్లీ రావచ్చు.

MBBSలో గొప్ప ర్యాంక్ సంపాదించినా, హౌస్ సర్జన్సీ చేయడం ఎంత అవసరమో యిదీ అంతే అవసరం. ఎందుకంటే థియరీ వేరు, ప్రాక్టికల్ ప్రాబ్లెమ్స్ వేరు. హౌస్ సర్జన్‌గా సీనియర్ డాక్టర్స్ టీముల్లో తిరుగుతూ, వారిని గమనిస్తూ, అప్రెంటిస్‌గా తిట్లు తింటూనైనా పని నేర్చుకుంటూ వున్నపుడే వైద్యవిద్యలో రాణించగలుగుతారు. వారి మెప్పు పొందినపుడు మీ ఆత్మవిశ్వాసం పదింతలవుతుంది. ఏ పొరపాటు ఏ తీవ్రపరిస్థితికి కారణమవుతుందో అనుభవజ్ఞులు యిట్టే చెప్పగలరు. ఈ శిష్యరికం చేసే సమయంలో మీ మెంటార్‌ల సొంత అలవాట్లు, బలహీనతలు పట్టించుకోకూడదు. వారి వ్యక్తిగత విషయాల జోలికి ముమ్మాటికీ వెళ్లతగదు. కేవలం వారి వృత్తికౌశలం మీదనే మీరు దృష్టి నిలపాలి. కొన్నాళ్లు వారి సాంగత్యంలో సహనంతో శిష్యరికం చేయాలి. అప్పుడే మీరు రాణిస్తారు.

**వృత్తిలో అపజయం పొందినవారిని కూడా ఎందుకు కలుసుకోవాలి? :** మీరు ఎంచుకున్న రంగంలోనే ఫెయిలయినవారు కొందఱుంటారు. వారిని కూడా మీరు కలవటం మంచిదనే సంగతి గుర్తుంచుకోండి. ఎందుకంటే, విజయం సాధించిన వాళ్లు తమ ప్రతిభాపాటవాలు చాటుకుంటారు. కానీ అపజయం పాలైన వాళ్లు

తాము ఏ విషయంలో పప్పులో కాలేశామో, తమ అంచనాలు ఎక్కడ గురి తప్పాయో మననం చేసుకొంటూ, కుములుతూ వాటి గురించి బయటివారితో ముచ్చటించడానికి యిష్టపడరు. వాటిలో కొన్ని వారి తప్పిదాలు అయి ఉండచ్చేమో గాని బయటి పరిస్థితుల నుంచి ఎదురయిన అనేకానేక సమస్యలు, వాటిని సమర్థవంతంగా త్రిప్పి కొట్టలేక పోయిన పరిస్థితులు మీకు ఉదాహరణలుగా ఉపకరిస్తాయి. మీరు ఇవన్నీ కేవలం సాక్షీభావంతో వినాలే తప్ప, పరాజయం తెచ్చిపెట్టిన వారి నిస్పృహను ఏ మాత్రం అంటగట్టుకోకూడదు, ఇతరుల దగ్గర చర్చించ కూడదు అన్నది ప్రధానసూత్రం.

పైగా యీ అపజయగాథల వలన ఆ వృత్తి లేదా రంగం పట్ల మీకు యిదివరకే ఉన్నటువంటి మక్కువ ఏ కోశాన తగ్గరాదని గుర్తుంచుకోండి. వారు వెలిబుచ్చిన కష్టనష్టాలను మీరు తటస్థదృష్టితో విశ్లేషించడం, తమ తప్పిదాల వలన పొందిన అనుభవాలను మీరు గుణపాఠాలుగా పరిగణించడం ముఖ్యం. ఈ విలువైన సమాచారసేకరణ అనేది మీ కెరీర్ లో ఒక ముందస్తు హెచ్చరిక గాను, నష్టనివారణ చర్యగాను ఎంతగానో ఉపకరిస్తుంది. 'ప్రమాదకరమైన మలుపు ముందున్నది, జాగ్రత్త' అనే బోర్డు చూసిన డ్రైవరు కారు స్పీడు తగ్గించి, బ్రేకులు వేసినట్లు మీరు కూడా ఎప్పుడు నెమ్మదించాలో నేర్చుకుంటారు.

ఇక వ్యాపారంలో విఫలమై వున్నవారిని కలిసినప్పుడు, వారిని హేళన చేసే తీరులో కాకుండా, వారి శ్రమను అర్థం చేసుకుంటున్నట్లు మాట్లాడితే వారూ తమ కథ వినిపిస్తారు. అయితే వారి తప్పులను కూడా విధివిలాసంపై, యితరులపై నెట్టివేసే ప్రయత్నాలు చేస్తారు కొందరు. మీరు వారి ముందు తలవూపినా, యింటికి వచ్చి విచక్షణతో వాటిని విశ్లేషించి, ఎనలైజ్ చేసుకోవాలి. అప్పుడే నివారించదగిన ప్రమాదమేదో, నివారించలేనిదేదో అర్థమౌతుంది. ఏది ఏమైనా యీ సమావేశాల వలన తప్పులెందుకు జరుగుతాయో, ఎన్ని రకాలుగా జరుగుతాయో మీకు ముందే తెలిసి, అవి జరగకుండా జాగ్రత్తలు తీసుకునే అవకాశం వుంది. ఏ వ్యాపారమైనా కేవలం అదృష్టంపై ఆధారపడి వుండదని, అంచెలంచెలుగానే ఎదగగలమని మీకు తెలియవస్తుంది.

✡ ✡ ✡

# 14. సొంత వృత్తి లేదా వ్యాపారాన్ని ఎలా మొదలెట్టాలి ?

**వ్యాపారంలో విజయ రహస్యాలు చెప్పటానికి ఇంటర్నెట్ వుంది కదా, ఈ పుస్తకంలో ప్రత్యేకంగా చెప్పడమెందుకు? :** కొత్త వ్యాపారం ఎలా స్థాపించాలో, ఎలా నడపాలో ఇంటర్నెట్‌లో, మార్కెట్‌లో పుస్తకాల ద్వారా కావాల్సినంత సమాచారం లభ్యం అవుతోంది, నిజమే. కానీ అవన్నీ జనరలైజ్ చేసి రాసినవి. ప్రతి వ్యక్తికి తనదంటూ ఆలోచన ఉంటుంది. తనదంటూ శైలి వుంటుంది. 'ఒన్ మాన్స్ మీట్ యీజ్ అనదర్ మాన్స్ పాయిజన్' అని ఆంగ్లంలో సామెత వుంది. ఒకరికి ఆహారమైనది మరొకరికి విషం కావచ్చు. మీ శరీరతత్త్వం బట్టి, మానసిక స్థితి బట్టి అలా మారుతుంది. మేము చెపుతున్నదేమిటంటే ఎవరో దేనిలోనో ఏడు మెట్లు ఎక్కి లేదా ఐదు సూత్రాలు పఠించి విజయవంతమయ్యారని, వాటిని మీరు అనుసరించబోతే, అనుకరించబోతే మెడికల్ షాపతని నడిగి మందులు వేసుకున్నట్లే! మీ శరీరానికి ఏది సరిపడుతుందో, ఏది పడదో, మీ శరీరతత్వం ఎటువంటిదో మీ డాక్టరుకి మాత్రమే తెలుసు. ఆయన సరైన మందు యివ్వగలరు.




అలాగే మీ శక్తియుక్తులేమిటో, మీ లోపాలేమిటో, మీ అభిరుచులేమిటో స్వాధ్యయనం చేస్తే మీకే తెలుస్తాయి. దాన్నే స్వధర్మం అంటున్నాం. మీ స్వధర్మానికి అనుగుణంగా మీరు వృత్తి లేదా వ్యాపారాన్ని ఎంచుకున్నపుడే విజయం సాధించగలరు. మీ స్వధర్మాన్ని తెలుసుకోవడానికి మిమ్మల్ని మీరు శ్రద్ధగా పరిశీలించు కోవాలి. వృత్తిపరమైన గురువుల వద్దకు వెళ్లి సమీక్షించుకోవాలి. మీ నాడి చూసి మీ డాక్టరు మీకేది మంచిదో చెప్పినట్లే, యీ గురువు మీ స్వభావం చూసి, మీరు ఏ వృత్తికి సరిపోతారో చెప్పగలరు. స్వధర్మాన్ని తెలుసుకోమనే యీ పుస్తకం ఉద్బోధిస్తుంది. అది తెలుసుకునేందుకు కొన్ని సూత్రాలను చెపుతోంది.

పుస్తకాల్లో, యింటర్నెట్‌లో చెప్పే వ్యాపారసూత్రాలలో ఎక్కువ శాతం జ్ఞానసూత్రాలు, ఉద్బోధలు ఉంటాయి. పాప్యులారిటీ కోసం చిట్కాలు చేరుస్తారు. కానీ పుస్తకంలో

యిచ్చిన నమూనా పరిస్థితి మన చుట్టూ వుండకపోవచ్చు. అలాంటప్పుడు ఆచరణలోకి వచ్చేసరికి  చాలా సూత్రాలు, ఉపదేశాలు బెడిసికొడతాయి. స్థానిక, వర్తమాన పరిస్థితుల బట్టి మనం అన్వయిస్తూ, మార్చుకుంటూ పోవాలి. పైగా ఆ పుస్తకాల్లో చాలామంది ఆర్థికవిజయం గురించే మాట్లాడతారు. కేవలం ఆర్థిక విజయమే పరమావధి అనుకుంటే – దాని వెంట యావజ్జీవితం పరిగెట్టినా చివరకు అసంతృప్తే మిగులుతుంది. గెలుపును ఇతరులతో పంచుకునే దృష్టి ఉన్నపుడే ఆత్మతృప్తి కలుగుతుంది. మన భారతీయ తత్త్వం సమాజహితం గురించి చాలా చక్కగా చెప్తుంది. వ్యక్తి, సమాజం పరస్పరాశ్రితాలు. ఒకరు బాగుంటే మరొకరు బాగుంటారు. తన ప్రగతిని సర్వజనుల శ్రేయస్సు కోసం  వినియోగించ గలిగినప్పుడే  అతను  పరిపూర్ణ మానవుడు కాగల్గుతాడని మన సంస్కృతి చెపుతోంది.  ఇతరుల కడుపులు మాడ్చి, నువ్వొక్కడివి పొట్ట పగిలేట్లు తినమని మన ధర్మం చెప్పదు. పైగా మనకున్న నాలుగు పురుషార్థాలలో **అర్థం**(ధనం) నాలుగో వంతు మాత్రమే. సమగ్రమైన విజయమంటే మానసికమైన తృప్తి, సంసారంలో సుఖశాంతులు, సమాజంలో గౌరవప్రతిష్ఠలు, ధర్మరక్షణ.. యివన్నీ వుంటాయి. ఈ పుస్తకాల్లో వీటి ప్రస్తావన వుండదు.

కష్టపడి పని చేస్తే చాలు, గొప్ప భవిష్యత్తు గ్యారంటీ – అని చాటి చెప్తారు. కృషి అంటే కేవలం శ్రమ పడడం అనే అపోహ కలుగుతుంది. ఈ సిద్ధాంతాన్ని అంటిపెట్టుకున్న లక్షలాది మంది యాంత్రికంగా కష్టపడుతూ జీవితాంతం సామాన్యులుగానే మిగిలి పోతున్నారని మనం గమనించవచ్చు. శారీరక శ్రమతో పాటు, తనను తాను ఎప్పటికప్పుడు అధ్యయనం చేసుకుంటూ, తన స్వధర్మంతో సమన్వయం చేస్తూ, సరికొత్త ప్రణాళికలు వేసుకుంటూ, ఇతరుల మేధస్సు, శ్రమశక్తిని కూడా కలుపుకుంటూ, మెరుగుపరుచుకుంటూ ముందడుగులు వేసినవారే విజయ శిఖరాలను  చేరుతారు.

ఈ విషయాన్ని సోదాహరణంగా చెప్పడానికి, సుదీర్ఘకాలం పాటు వివిధ రంగాలలోని వందలాది వృత్తినిపుణుల స్వానుభవాలను సేకరించి, క్రోడీకరించి, పాఠకులకు, యువతకు, ఉద్యోగులకు, ఔత్సాహిక వ్యాపారవేత్తలకు ఒక ఆచరణ యోగ్యమైన కరదీపికను అందించాలనే సంకల్పంతో "స్వధర్మ యోగం" అనే యీ పుస్తకం రూపుదిద్దుకుంది.

ఏ బిజినెస్ లోకి అడుగు పెట్టాలనుకున్నా ప్రధానంగా మూడు రకాల పెట్టుబడులు

అవసరం. **1) ఆ బిజినెస్ మీద అనుభవం/అవగాహన అనే పెట్టుబడి 2) ఆర్థిక వనరుల పెట్టుబడి 3) తొలిదశలోని ఆటుపోట్లను, రిస్కును తట్టుకోగలనన్న ఆత్మవిశ్వాసమనే పెట్టుబడి.**

విపులంగా చెప్పుకోవాలంటే – 1) అప్పటికే చేస్తున్న ఉద్యోగానుభవంతో అదే తరహా వ్యాపారాన్ని మొదలుపెట్టడంలో ఒక సులువుంది. పనిలో మెళుకువలు తెలుస్తాయి. ముడిసరుకు, యంత్రాలు ఎవరి దగ్గర్నుంచి ఎంతకు తెచ్చుకోవాలో, ప్రాసెస్ చేసి ఎవరికి అమ్మాలో, వేటికి డిమాండ్ వుందో, వేటికి లేదో, మరీ ముఖ్యంగా ఏ ధర పెడితే అమ్ముడుపోతుందో, ఏజంట్లకు ఎంత కమిషన్ యివ్వవచ్చో, పనివాళ్ల జీతభత్యాలు ఏ రేంజ్‌లో వుండవచ్చో యిలాంటివన్నీ ముందుగానే తెలుస్తాయి. వాటిని బట్టి అన్నీ ముందుగానే ప్లాన్ చేసుకోవచ్చు. ఆ కారణంగా రిస్కుల తీవ్రత తగ్గి, నిర్వహణా సామర్థ్యం పెరుగుతుంది. లోగడ చేసిన సంస్థలో నుండి తనకు ఆత్మీయులు, సమర్థులని తోచిన కొందరిని సొంత సంస్థలో చేర్చుకోవడం జరుగుతూంటుంది. వారితో కలిసి పని చేసిన పూర్వానుభవంతో వారి లోపాలోపాలను బేరీజు వేయటం సులభం. కానీ కొలీగ్‌గా వుండేటప్పుడు వుండే సమీకరణం వేరు. ఒకసారి మీరు యజమాని అయ్యాక యజమాని–ఉద్యోగికి మధ్య సహజంగా వుండే వైరుధ్య లక్షణాలు మాత్రం పొడసూపక మానవనే విషయం గమనార్హం. యజమానిగా మీ స్వధర్మం మీది, ఉద్యోగిగా అతని స్వధర్మం అతనిది అని గుర్తెరగండి.

అప్పటివరకు చేసిన ఉద్యోగానికి భిన్నంగా, కొత్త రంగంలో వ్యాపారం ప్రారంభించాలనుకునే వారు పైన చెప్పినట్లు, మొదటగా వృత్తి నిపుణులను సంప్రదించి వారితో సమగ్రంగా అన్ని అంశాలు చర్చించాలి. అంతేగాని, బంధుమిత్రులు చెప్పారు గదా అనో, మార్కెట్‌లో డిమాండు ఉందిట అనో, ఏదో ఒక దాన్ని ఎంచుకోవటం సబబు కాదు. ఏ ప్రోడక్టుకు బ్యాంక్ వారు ఋణాలు మంజూరుచేస్తారో ఖరారు చేసుకొని ఆ బిజినెస్‌ను ఎంచుకోవటం కూడా అసంబద్ధం. అప్పు పుట్టడం అనేది మూడు అంశాల్లో ఒకటి మాత్రమే. లాభసాటిది అనుకుని అందరూ వ్యాపారంలో దిగితే, మంది ఎక్కువైన కొద్దీ మజ్జిగ పల్చన అవుతుంది. సప్లయి ఎక్కువై డిమాండు పడిపోయి సరుకు అమ్ముడు కాదు. అమ్మకాలకు కావలసిన మౌలిక అంశాలు **– 1. మార్కెట్ డిమాండ్ 2. నాణ్యమైన ఉత్పాదన/సేవలు 3. మీ ఉత్పాదన యొక్క ప్రత్యేకత.**

కొబ్బరినూనె అమ్మకాలు బాగున్నాయట అని ఆ వ్యాపారంలో దిగితే, కస్టమర్లు 'మేం యిప్పటికే కొంటున్నది మానేసి, నీదెందుకు కొనాలి?' అని అడుగుతారు. ఎందుకంటే వాళ్లు కొంటున్న బ్రాండ్ ఎన్నో ఏళ్లగా మార్కెట్‌లో వుంటూ బ్రాండ్ వేల్యూ సంతరించుకుని వుంటుంది. దాని నుండి దృష్టి మరల్చాలంటే మీ నూనెలో సుగంధం వుందనో, జుట్టు నల్లబరుస్తుందనో, మెదడు చల్లబరుస్తుందనో ఏదో ఒక ప్రత్యేకతను కన్విన్సింగ్‌గా చెప్పగలగాలి. అప్పుడు వాళ్లు మీ సరుకు ఒకసారి వాడి చూస్తారు, నచ్చితే కొనసాగిస్తారు. దీనినే యుఎస్‌పి (యునీక్ సెల్లింగ్ పాయింట్) అంటారు. యుఎస్‌పి లేనిదే ఏ ఉత్పాదనా మార్కెట్‌లో నిలదొక్కుకోలేదు. వ్యాపారంలో దిగే ముందు యీ మార్కెటింగు సూత్రాలు బాగా వంటపట్టించుకుని అడుగు పెట్టాలి తప్ప, దైవాధీనంగా ప్రారంభించకూడదు. మార్కెటింగ్ అంటూ తెలిస్తే ఆ జ్ఞానాన్ని ఏ ఉత్పాదనకైనా అన్వయించవచ్చు.

శ్రీ జె.వేణుగోపాల్ అనే వ్యక్తి "ఈనాడు" సంస్థ, హైదరాబాద్ బ్రాంచ్‌లో సర్క్యులేషన్ డిపార్టుమెంటులో ఎగ్జిక్యూటివ్‌గా 5 సం.లు పనిచేశారు. ప్లాస్టిక్ వ్యాపారంలోకి వెళదామనుకున్నారు. ఉద్యోగంలో చేరడానికి ముందు చదివిన ఎమ్‌బిఏ చదువు యిప్పుడు అక్కరకు వచ్చింది. మార్కెట్ బాగా అధ్యయనం చేసి, నిశిత ప్లాస్టిక్స్ అనే సంస్థను ప్రారంభించి, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తగా రాణించారు. ఇక్కడ చేసిన ఉద్యోగానికి, చేపట్టిన వ్యాపారానికి పొంతన లేదనిపిస్తుంది. కానీ పత్రికలు అమ్మాలన్నా, ప్లాస్టిక్ సామగ్రి అమ్మాలన్నా టెక్నిక్ ఒకటే అని ఆయన అర్థం చేసుకుని అమలు చేశారు. అయితే ప్లాస్టిక్ వ్యాపారంలోని యితర విషయాలను అనుభవజ్ఞులను అడిగి తెలుసుకుని, జాగ్రత్త పడ్డారు కాబట్టే జయప్రదంగా వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు.

**2. ఆర్థిక వనరులు :**

ఎంచుకున్న వ్యాపారానికి మార్కెట్‌లో గల డిమాండ్‌ను అందులో దిగే ముందే పసిగట్టే విధంగానే, ఆ వ్యాపారానికి స్థూలంగా కావాల్సిన పెట్టుబడి ఎంత? వనరులను సమీకరించుకునే మార్గాలు ఏవేవి? అనే విషయంపై సొంత అంచనాలకే పరిమితం కాకుండా, ఆర్థిక నిపుణుల వద్ద సమగ్రంగా చర్చించి తగిన సూచనలు, సలహాలు తీసుకొనాలి. సొంతంగా ఎంత మొత్తం పెట్టుబడి పెట్టనున్నాను? భాగస్తుల వంతు ఏ మాత్రం? ఏ బ్యాంకు వారు తక్కువ శాతం వడ్డీకి ఋణ సదుపాయం కల్పిస్తారు?

అప్పటికీ చాలక పోతే ఆప్తులు, సన్నిహితుల వద్ద కాస్త తక్కువ వడ్డీతో ఎంత మొత్తం మేరకు ఋణం తెచ్చుకోగలిగే అవకాశాలున్నాయి? సులభ వాయిదాల్లో చెల్లింపుకు ఎన్నేళ్లు పడుతుంది? అనే ఈ ఆర్థిక వ్యవహారాలన్నిటిలో బిజినెస్ లోని భాగస్తులందరి అవగాహన, ఆమోదంతోనే ముందుకు సాగటం ఉత్తమం. ఇందులో గోప్యతకు తావుండకూడదు. ఆర్థిక వ్యవహారాల్లో ఆచితూచి అడుగులు వేయడం ఆరంభం నుంచే ఉండాలి.

సొంతంగా వ్యాపారం పెట్టాలంటే ఆర్థిక వనరులు ఎక్కణ్నుంచి వస్తాయని అడుగుతారందరూ. మనసుంటే మార్గం వుంటుందని చిన్నమ్మ పిళ్లయ్ అనే ఆమె కథ చెప్తుంది. తను, భర్త పొలాల్లో రోజుకూలి చేసేవారు. అవసరం పడి పని చేసే భూస్వామిని అప్పడిగితే యిచ్చేవాడు కానీ 300 శాతం వడ్డీ కట్టాల్సి వచ్చేది. జీతమూ పెంచడు. దాంతో అప్పెలా తీరుతుంది? ఇలాంటి పరిస్థితిలో వాళ్ల వూరికి మైక్రో ఫైనాన్సింగ్ సంస్థ ధన్ ఫౌండేషన్ అని వచ్చింది. చిన్నమ్మ లాంటి 15 మంది బాధిత మహిళలు దానిలో చేరి, నెలకు తలా రూ.20 చొప్పున వేసుకుంటూ, అలా పోగడిన 300 రూ.లను ఆ నెలలో అవసరం పడి చిట్టు పాడుకున్నవారికి 60శాతం వడ్డీకి యిచ్చేవారు. భూస్వామి వడ్డీతో పోలిస్తే యిది ఐదో వంతే కదా అని తీసుకునేవారు. వచ్చిన వడ్డీని 15 మందీ పంచుకునేవారు. చిన్నమ్మ సారథ్యంలో అలా ప్రారంభమైన ఉద్యమం 29 ఏళ్లలో 13 రాష్ట్రాలలోని 63 జిల్లాలకు, 250 బ్లాకులకు వ్యాపించింది. దాంతో 1999లో ఆమెకు స్త్రీ శక్తి పురస్కార్ యిచ్చారు. తమిళనాడు ప్రభుత్వం 2018లో అవ్వయ్యార్ ఎవార్డు యిచ్చింది. 2019లో కేంద్రం పద్మశ్రీయే యిచ్చింది. డబ్బు చెట్లకు కాయదు. మన చుట్టూ వున్నవారి చెమటలోనే వుంటుంది. దాన్ని ఉభయతారకమైన పెట్టుబడిగా మార్చాలంతే.!



**3. ఆటుపోట్లను, రిస్కులను తట్టుకోగలనన్న ఆత్మవిశ్వాసం :**

ఎవరు ఏ వృత్తిలో దిగినా సగటు వ్యాపారస్తుని తొలి దశల్లో కొంత నష్టంతో ప్రారంభమై, బ్రేక్ ఈవెన్ (గిట్టుబాటు) కావడానికి టైము పడుతుందని గమనిస్తాము. ఆ నిరీక్షణా కాలాన్ని తట్టుకునే ఓర్పు ఉంటేనే పై మెట్టుకు ఎదుగుతారు. ఇందుకు

భిన్నంగా కొందరు ఆరంభవేగంతో జోరు సాధించినప్పటికీ, మధ్యంతరంగా ఒడిదుడుకులు వచ్చి తీరతాయి. వాటిని భరించకుండా ఎవ్వరూ ఒడ్డున పడలేదు. కనుక ఓడిపోవడానికి సిద్ధపడి ఉండటం, రిస్కు మేనేజ్‌మెంట్ అనేవి వృత్తిలో భాగంగా స్వీకరించటం సముచితం. సంక్షోభ పరిస్థితులు ఎదురైనపుడు ఆత్మీయుల దగ్గర గోడు వెళ్లబుచ్చుకుని స్వాంతన పొందాలనుకొనుకుంటే కొత్త తలనొప్పులు తోడవుతాయి. కనుక అనుభవజ్ఞులైన వారితోనే వ్యాపారభాగస్తులు సావధానంగా సంప్రదించి తరణోపాయం కనుక్కోవటం విజ్ఞత. మూడు నెలల కోసారి తమ వృత్తి తాలూకు ప్రగతి గ్రాఫ్‌ను భాగస్తులు చక్కగా సమీక్షించుకుంటే రిస్కు స్థాయిని తగ్గించుకోవచ్చు. వాతావరణ హెచ్చరిక ఆధారంగా ముందు జాగ్రత్త పడేలాగ రాగల రిస్కును వాస్తవదృష్టితో అంచనా వేసి ముందు జాగ్రత్తలు తీసుకోవచ్చును. కాగా, నిత్య యోగసాధన, మెడిటేషన్, సత్సాంగత్యం చేసేవారికి ఇలాంటి రిస్కులు, ఒత్తిడులు తట్టుకునే ఆత్మస్థయిర్యం సహజంగా కలుగుతుంది. ఆత్మవిశ్వాసం కూడా చిగురిస్తుంది.

1969 సం.లో 10వ తరగతి చదివే రోజుల్లో ఒక రైలు ప్రయాణంలో జరిగిన యాక్సిడెంట్‌లో రెండు కాళ్ళూ, ఒక చెయ్యిని కోల్పోయిన శ్రీ బండారి శ్రీనివాస్ – ఒంటి చేత్తోనే జీవన సమరాన్ని ఎదుర్కొన్నారు. సికిందరాబాదులో చిన్న అగరబత్తి దుకాణంతో తన జీవనయానం ప్రారంభించిన ఆయనకు THINK -BIG అనే – లక్ష్యం అప్పట్లోనే తొలిచింది. అంగవైకల్యాన్ని సానుకూలంగా మలచుకొని, HP GAS distribution కోసం ఏళ్ల తరబడి ప్రయత్నించి, ఎట్టకేలకు 1984లో భారత ప్రభుత్వం నుంచి అనుమతి పొందారు. తనకు కేటాయించిన జూబిలీహిల్స్, రోడ్ నెం.65 లోని లోతట్టు ప్రదేశాన్ని భారీ ఖర్చుతో పూడిక చేసుకొని, B.S. ENTERPRISES పేరుతో గోడౌను, కార్యాలయంను నిర్మించుకున్నారు. LPG గ్యాస్ సేవా రంగంలో ఆయనకున్న అమితాపేక్ష, ఆత్మ విశ్వాసంతో శ్రీనివాస్ తన వృత్తిలో అదనపు గంటలు పని చేసి, అనేక డిస్ట్రిబ్యూషన్ శాఖలుగా విస్తృత పరచారు. DOMESTIC మరియు COMMERCIAL సప్లై సర్వీస్‌లలో ఆధునికతను



చూపి, జంట నగరాలలో వేలాదిమంది కష్టమర్ల ఆదరణను పొందారు. ఒరిస్సా, కర్ణాటక రాష్ట్రాలలో కూడా COMMERCIAL H.P. GAS సర్వీసులను నెలకొల్పి వ్యాపార ప్రమాణాలను మెరుగుపరిచారు. B.S.సంస్థ తన సేవల నాణ్యతలో అనతికాలంలోనే ISO 9002 మార్కు స్థాయిని అందుకోవడం విశేషం. అంతేగాక, 1993-94 సం.నికి - శ్రీనివాస్ గారు Best Handicapped Entrepreneur అవార్డ్‌ను రాష్ట్రపతి శంకర్ దయాల్ శర్మ నుండి అందుకున్నారు. అనేక సంస్థల నుంచి ప్రశంసా అవార్డులు మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ అవార్డులు కూడా దక్కాయి. ఆయన KMRR ట్రస్టుకు గౌరవ సెక్రటరీగా తన సేవలందిస్తున్నారు.

✡ ✡ ✡

## 15. వ్యాపారంలో భాగస్వామిని ఎలా ఎంచుకోవాలి ?

ఇది వ్యాపారంలో అత్యంత కీలకమైన అంశం. ఓ రకంగా జీవితభాగస్వామిని ఎంచుకోవటం లాంటిదే! డబ్బు మాత్రమే పెట్టుబడి పెట్టగలిగి వుండే వారు స్లీపింగ్ పార్టనర్. వ్యాపార వ్యవహారాల్లో పాలు పంచుకునే వారు యాక్టివ్ పార్టనర్‌గా భావిస్తారు. భాగస్వామ్యం విజయవంతం కావాలంటే డబ్బు పెట్టుబడి పెట్టేవారి కంటె మీతో కలిసి చురుగ్గా పని చేసేవారు, యీ రంగంలో పూర్వానుభవంతో రాటు తేలినవారు వుంటే మంచిది. ఆ భాగస్వామికి మీ మాదిరిగానే ఆ వృత్తిలో నిజమైన మక్కువ వున్నదా? మీకు సమాంతరమైన వ్యాపార పరిజ్ఞానం, లేదా నేర్చుకొని చేయాలనే జిజ్ఞాస ఉన్నదా? లేక మీ కార్యశీలత మీదనో, మీతో వుంటే కలిసొస్తుందనే మూఢనమ్మకంతోనో మీతో భాగస్వామ్యానికి సిద్ధపడ్డారా? అనేది తెలుసుకోవడం అవసరం. ఈ విషయంలో ఎంపిక పొరపాటు చేసిన కొందరు ప్రముఖుల స్వానుభవంతో చెప్పిన సలహాలను కింద ఉదాహరిస్తున్నాం.

(1) కనీసం 3 సంవత్సరాల నుండి సన్నిహిత పరిచయం వున్న వ్యక్తినే బిజినెస్ పార్టనర్‌గా తీసుకొనాలి. కష్టించి పనిచేసే స్వభావం వుందా లేదా అన్నది చూసుకోవాలి.

(2) కాబోయే భాగస్వామి ఫ్యామిలీ, మీ ఫ్యామిలీ కలిసి ఒక 5 రోజులు ఏదైనా ఊరికి విహార యాత్ర చేసినట్లయితే వారి వ్యక్తిత్వం, వివిధ సందర్భాల్లో వారి ప్రవర్తన తీరుతెన్నులు కొంత మేర తెలిసి వచ్చే వీలుంది.




(3) అతనింటికి ముందుగా చెప్పకుండా వెళ్లాలి. ఫ్యామిలీ ముచ్చట్లను చెప్పుకుంటూనే కొన్ని వ్యాపార సంగతులు కూడా ప్రస్తావించాలి. ఆ విషయాల్లో వారి భార్యామణికి ఏదైనా చొరవ వున్నదా? లేదా? నిర్ణయాలు తీసుకోవడంలో ఆమె ప్రమేయం ఏ మేరకు ఉంది? ఆమె తెలివితేటలు, ఆశలు ఎలా వున్నాయి అనే సంగతి కొద్దిగానైనా బహిర్గతం అవుతుంది.

ఇక్కడ ఒక సూత్రం గమనించాలి. విద్య నేర్పే గురువు విషయానికొస్తే వారి వ్యక్తిగతం మీకు అప్రాధాన్యం. కానీ మీతో వ్యాపార సహజీవనం చేసే వ్యక్తి యొక్క జీవితభాగస్వామి గుణగణాలు భాగస్తుల మీద, బిజినెస్ మీద కూడా ప్రభావం చూపుతాయి గనుక ముందస్తు అవగాహన అనేది ఎంతైనా మంచిది.

**బిజినెస్‌లో ఆర్థిక నిర్వహణా సామర్థ్యానికి ఎంతటి ప్రాముఖ్యత ఉంది? :** స్వయం ఉపాధి మార్గంగా ప్రభుత్వాలు యువతకు బ్యాంకుల ద్వారా ఋణాలను సమకూరుస్తూ చేస్తూన్న ఆర్థికసాయం చాలామందికి సత్ఫలితాలు యివ్వలేకపోయింది. చిన్న చిన్న ఋణాలు కూడా తిరిగి చెల్లించలేని దుస్థితి కలుగుతున్నది. ఇందుకు ప్రధానమైన కారణం – ఋణం తీసుకున్న వారికి ఆ పరిశ్రమ మీద అవగాహన లేకపోవడం. ఒక వేళ ప్రవేశం వున్నప్పటికీ, నిర్వహణా సామర్థ్యం కొరవడటం. కనుక ముందస్తుగానే శిక్షణ పొంది తగినంత సమర్థతను సంతరించుకోవడం ఎలాంటి వ్యాపారికైనా అవశ్యం, అనివార్యం. దానితో బాటు ఆర్థిక విషయాలపై కనీస జ్ఞానం సంపాదించుకోవాలి.

చాలామంది టెక్నోక్రాట్స్‌కి వస్తూత్పత్తి విషయంలో పరిజ్ఞానం వుంటుంది కానీ ఆర్థిక విషయాల్లో కనీస అవగాహన కూడా వుండదు. అందువలన ఆర్థిక వ్యవహారాలు చూసుకోవడానికి సమీప బంధువునో, స్నేహితుడినో నియమించుకుంటారు. ఇక దాని గురించి పట్టించుకోవడం మానేసి, వాళ్లు సంతకాలు పెట్టమన్న చోటల్లా పెట్టేస్తూ వుంటారు. ఎంతసేపూ ప్రొడక్షన్ బాగా జరుగుతోందా లేదా, సేల్స్ బాగున్నాయా

లేదా అనే చూసుకుంటారు తప్ప వచ్చిన రాబడిలో బ్యాంకు ఋణం ఏ మేరకు కట్టాము, సప్లయర్లకు ఏ మేరకు డబ్బు పంపించాము, రావలసిన వారి నుంచి ఏ మేరకు వసూలు చేశాము అనేవి పట్టించుకోరు. చాలా సందర్భాల్లో ఆర్థిక వ్యవహారాలు చూసే వ్యక్తి వీళ్లను దగా చేయడం జరుగుతుంది. చివరకు కంపెనీ మూతపడడమే కాక, బ్యాంకుకు తాకట్టు పెట్టిన స్థిరాస్తులు కూడా పోగొట్టుకుంటారు.

అందువలన సాంకేతిక పరిజ్ఞానం మాత్రమే ఉన్నవాళ్లు ఆర్థిక వ్యవహారాలపై ప్రత్యేకమైన కోర్సులకు హాజరై ప్రాథమికమైన విషయాలు తెలుసుకోవాలి. ఇన్‌కమ్ టాక్స్ ఎగ్గొట్టడానికి అంటూ.. నల్లధనంలో వ్యవహారాలు చేయడం, బినామీల పేర ఆస్తులు కొనడం వంటివి చేయకూడదు. అలాంటి పరిస్థితుల్లో ఖాతా పుస్తకాల్లో చూపించే అంకెలు నమ్మదగినవిగా వుండవు. ప్రభుత్వాన్ని ఏమారుస్తున్నామంటూ పెట్టుబడిదారుణ్నే ఏమార్చే ఆషాఢభూతులు, నమ్మకద్రోహులు వుంటారు. అందువలన నిజాయితీగా పన్నులు చెల్లిస్తూ, అకౌంట్లను పారదర్శకంగా నిర్వహించడం అన్ని విధాలా శ్రేయస్కరం. ప్రతి ఆర్థిక సంవత్సరం త్రైమాసికం వారీ టర్నోవర్‌ను ముందస్తు ప్రణాళిక చేసుకోవటం/తదనుగుణంగా సమన్వయకృషిని వ్యూహరచన చేయటం ఉత్తమం.

✡ ✡ ✡

## 16. మీ బిజినెస్‌లో సరైన మానవ వనరులను ఎంపిక చేసుకోవటం ఎలా ?

ఎన్ని కంప్యూటర్లు వచ్చినా, ఎంత ఆధునిక సామగ్రి పెరిగినా మానవుడికి వుండే విలువ ఎప్పటికీ పోదు. గతంలో ఉద్యోగులంటే చులకన వుండేది. జీతం పారేస్తే ఒకరు కాకపోతే మరొకరు వస్తారనే అహం యజమానికి వుండేది. క్రమేపీ సంస్థ పురోగతి ఉద్యోగుల సామర్థ్యంపైనే ఆధారపడి వుంటుందని తెలిసి వచ్చింది. అందుకనే హ్యూమన్ రిసోర్సెస్ (ఎచ్‌ఆర్) శాఖ ప్రత్యేకంగా ఏర్పడింది. మంచి పనిమంతుడిని వెతికి పట్టుకోవడం - వెతికి పెట్టినవారికి కమీషన్ చెల్లించి కూడా - వాళ్లను నిలుపుకోవడం, వాళ్లు సంస్థను వీడి వెళ్లిపోతూ వుంటే 'ఎందుకు వెళ్లిపోతున్నారు,

యిక్కడ మీకు నచ్చనిదేమిట'ని యింటర్వ్యూ నిర్వహించి కనుక్కోవడం.. యివన్నీ ఆ శాఖ పనులు.

సంస్థలో పనిచేస్తున్నంత కాలం ఉద్యోగులకు ఆఫీసులో అనుకూల వాతావరణం కల్పించడంతో బాటు, కుటుంబపరంగా కూడా ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడేందుకు సైతం యీ శాఖ కృషి చేస్తోంది. ఏదైనా మెచ్చుకోదగిన పని చేసినపుడు ప్రశంసా పత్రంతో బాటు నగదు బహుమతులూ యిస్తున్నారు. కుటుంబాలతో సహా స్టాఫ్‌ను పిక్నిక్‌లకు, పార్టీలకు వెళ్లమని ప్రోత్సహిస్తున్నారు. కంపెనీలే ఆ ఖర్చు భరిస్తున్నాయి కూడా. ఎక్కువ సంఖ్యలో ఉద్యోగులు కంపెనీని వీడుతూ వుంటే సంస్థాగతమైన లోపాలేమైనా వున్నాయా అని సమీక్షించుకుంటున్నారు కూడా.




కోట్లాది రూపాయల టర్నోవరు ఉన్న పెద్ద కంపెనీలే మంచి ఉద్యోగులను పోగొట్టుకోకూడదని అంత తాపత్రయ పడుతూ వుంటే యిక ఎదగవలసిన కంపెనీలు యింకెంత జాగ్రత్త తీసుకోవాలో ఆలోచించండి. అయితే ఆ కంపెనీలకు హెచ్‌ఆర్ అనే ప్రత్యేక శాఖ నిర్వహించే స్తోమత వుంది. చిన్న కంపెనీలో యజమానే ఆ బాధ్యత కూడా వహించాలి. ఉన్నత స్థాయి ఉద్యోగులకు దండిగా జీతాలిచ్చి, నిలుపుకుంటూ క్రింది స్థాయి వారిని 'హైర్ అండ్ ఫైర్' (చేర్చుకోవడం, చిన్న కారణానికే తొలగించి వేయడం, వారి స్థానంలో మరొకరిని తెచ్చుకోవడం) చేసినా సంస్థ నడిచిపోతుందని కొందరనుకుంటారు. అది పొరబాటు.

ఈ రోజుల్లో ఉన్నతస్థాయి ఉద్యోగులు ఏ కంపెనీకి కట్టుబడి వుండటం లేదు. చేరిన మర్నాటి నుంచే వేరే అవకాశాల కోసం పక్కచూపులు చూస్తున్నారు. ఈ సంస్థ కంటె జీతం మరో వెయ్యి యిస్తారని తెలిస్తే దీన్ని వదిలి వెళ్లిపోతున్నారు. మధ్య, చిన్న స్థాయి ఉద్యోగులే కంపెనీని అంటిపెట్టుకుని వుంటున్నారు. మంచి జీతాలిచ్చి ప్రోత్సహిస్తే వారే ఉన్నతోద్యోగుల బాధ్యతలు మోయగలిగే స్థాయికి చేరతారు. ముందు జాగ్రత్త చర్యగా ప్రతి ఉన్నతోద్యోగి వద్ద ఒక జూనియర్‌ను నియమించి, తర్ఫీదు యిమ్మనడం

మేలు. వారి హఠాత్ నిష్క్రమణ కారణంగా పని కుంటుపడకుండా నడిచిపోతుంది.

అయితే మంచి ఉద్యోగులు దొరకడమనేది ఒక సవాలుగా వుంది. డిగ్రీలున్నా, ఉద్యోగిత (ఎంప్లాయబిలిటీ) వుండటం లేదు చాలామందికి. ఎందుకంటే చదువు, ఉద్యోగలక్షణం రెండూ వేర్వేరు అంశాలు. గోల్డ్ మెడలిస్టు అహంభావంతో టీములోని యితరులతో కలుపుగోలుగా, సఖ్యంగా వుండలేక పోవచ్చు. ఇది తన స్థాయికి తగని వుద్యోగమనే నిస్పృహలో వుండవచ్చు. మార్కులు తక్కువ వచ్చినవాడు కామన్ సెన్స్‌తో ఏదైనా సమస్యకు సులభంగా పరిష్కారం కనుక్కోవచ్చు, కష్టపడి పనిచేసేందుకు సిద్ధపడవచ్చు. కస్టమర్లతో చక్కగా మాట్లాడి మెప్పించవచ్చు. ఎవరిలో ఏ కళ వుందో కనుక్కోవడం సులభంగా పట్టుబడే విద్య కాదు. అనుభవం మీదే అది తెలిసివస్తుంది. ఈ క్రమంలో కొన్ని పొరపాట్లు జరుగుతాయి కూడా. ముఖ్యంగా మనం తెలుసుకోవలసినది పెద్దపెద్ద డిగ్రీలున్నాయి కదాని హెచ్చు జీతానికి ఉద్యోగిగా తీసుకోవలసిన అవసరం లేదు. ఈ ఉద్యోగాన్ని 'స్వధర్మం'గా భావిస్తున్నాడా, చేయవలసిన పనిని ప్రేమిస్తున్నాడా, లేక యీసురోమని వున్నాడా అన్నది తెలుసుకోవాలి.

నేర్చుకునే ఉత్సాహం వున్నవారిని, ఏ స్థాయికైనా తీసుకుని వెళ్లవచ్చు. పనిలో చేరగానే వారికి శిక్షణ యిప్పించడం అవసరం. శిక్షణలో వాళ్లు చేసే పొరపాట్లను ఓర్పుతో సరిదిద్ద వలసిన బాధ్యత కూడా యజమానిదే. అంతేకాదు, శిక్షణకాలంలోనే అతను ఏ విభాగానికి బాగా నప్పుతాడో తెలిసివస్తుంది. ఉద్యోగంలో చేరిన తర్వాత కూడా తరచుగా శిక్షణ యిప్పిస్తూ వారిని అప్‌టుడేట్ చేయిస్తూండాలి. ఉద్యోగానికి సంబంధించిన సాంకేతిక విషయాల మీదనే కాకుండా, పనిలో ఒత్తిడి తగ్గించుకోవడం ఎలా, మానవసంబంధాలు మెరుగు పరుచుకోవడం ఎలా, అపజయాలను తట్టుకోవడం ఎలా యిటువంటి యితర విషయాలపై కూడా కోర్సులు హాజరయ్యేట్లు చూడాలి. వీటితో బాటు స్వధర్మం గురించి వారికి పూర్తిగా అవగాహన కల్పించాలి. అప్పుడు పనిలో ప్రొడక్టివిటీ (ఉత్పాదకశక్తి) పెరిగి యజమాని, ఉద్యోగి యిద్దరూ లాభపడతారు. 'మన ఖర్చుతో తర్ఫీదు పొంది, చివరకు మన కంపెనీ వదిలేసి వేరే సంస్థకు వెళ్లిపోతే మనకిదంతా దండగ ఖర్చు కదా' అనే ఆలోచన యజమానికి రాకూడదు. ఉన్నంతకాలం బాగా పని చేస్తాడు కదా, అది చాలు అనుకోవాలి.

✡ ✡ ✡

# 17. బిజినెస్‌లో లేదా వృత్తిలో పోటీని ఎదుర్కోవటం ఎలా?

ఏదైనా బిజినెస్‌లో మీరు అడుగు పెట్టడానికి ముందే మార్కెట్‌లో ఆ రంగంలో అనేకమంది వుండి వుంటారు కదా! వారితో బాటు నేనూ అనుకోకుండా, 'నేను కష్టమర్ల కొంగ్రొత్త అవసరాన్ని తీర్చబోతున్నాను, లేదా పాత అవసరాన్నే ప్రస్తుత వ్యాపారస్తుల కంటె మెరుగ్గా లేదా చౌకధరలో తీర్చబోతున్నాను' అనుకుని దిగాలి. ప్రస్తుత వ్యాపారస్తులు చేరలేని ప్రాంతాలకు చేరడం ద్వారానో, ఉత్పాదనలోనో, సర్వీసు లోనో వారి కంటె నాణ్యంగానో వుండగలను అనుకున్ననాడే మీరు ఆ రంగంలోకి కాలిడాలి. నిజంగా మీరు వారి కంటె బాగా చేస్తూ, ముందుకు దూసుకుని పోతూ వుంటే, ప్రస్తుత వ్యాపారస్తులు చూస్తూ కూర్చోరు. మీలో ఉన్న ప్రత్యేకత ఏమిటో అధ్యయనం చేసి, తమ పద్ధతులను మార్చుకుంటారు, మెరుగు పరుచుకుంటారు. మార్కెట్‌లో తమ వాటా తగ్గిపోకుండా చూసుకోవడానికి క్రమపద్ధతిలోనో, అక్రమపద్ధతిలోనో ప్రయత్నాలు చేస్తారు. అందువలన మీరు సాటి వ్యాపారస్తులను కూడా ఒక కంట గమనిస్తూనే వుండాలి. వాళ్లతో పోల్చుకుని సంబరపడి పోవడానికో, లేదా నీరస పడటానికో కాదు, రోజూ మెడిటేషన్ చేస్తూ ఇతరులతో పోలిస్తే మనం ఎక్కడ, ఏ స్థాయిలో వున్నాం? రేపు ఎక్కడ వుంటాం? అని మనమటుకు మనం స్వాధ్యాయం చేసుకోవడానికి మాత్రమే. మనకు మనమే పోటీగా భావించుకుంటూ నిరంతరం మెరుగు పరుచుకుంటూ పోవాలి. ఇదే స్వధర్మసాధన.

ఏ వృత్తిలో వారికైనా ఈ నిరంతర అధ్యయన ప్రక్రియ ఒక ఇంధనంలా, ప్రేరకంగా పని చేస్తుంది. చదువులో, వృత్తిలో, వ్యాపారంలో స్పర్ధ అభిలషణీయమే.అది అసూయగా, కక్షగా మారితేనే ప్రమాదం. స్పర్ధ సరిహద్దు దాటకుండా చూసుకోవడానికి ప్రశాంతచిత్తంతో ఉన్నపుడే వీటి గురించి ఆలోచించాలి. అందుకే ప్రతిరోజూ కొంత సమయాన్ని కేటాయించి, యోగా, ప్రాణాయామం, ధ్యానం సాధన చేసి, అప్పుడు యీ విషయాలపై ఆలోచన సాగించాలి. దానివలన ఆవేశకావేశారహిత నిర్ణయాలు తీసుకోగలగడంతో బాటు ఏ బెరుకూ, భయం అంటని మానసిక స్థిరత్వం కూడా అబ్బుతుంది.

వ్యాపారం ప్రారంభించడం, నూతన విధానాలతో మార్కెట్‌లో చోటు

సంపాదించుకోవడం కొంతవరకు సులభమే కానీ ఒకసారి మార్కెట్‌లో విస్తరించడం ప్రారంభమయ్యాక, నాణ్యత తగ్గకుండా, డెలివరీలో ఆలస్యం కాకుండా చూసుకోవడం, రావలసిన బాకీలు వసూలు చేసుకోవడం రానురాను కష్టమై పోతుంది. సరైన పర్యవేక్షణతో లోపాలు సవరించుకోకపోతే కొత్త ప్రదేశాలలో మార్కెట్ చేజిక్కుతూండగానే పాత ప్రదేశాల్లో మార్కెట్ చేజారుతూ వుంటుంది. పనిలోని లోటుపాట్లు పని చేసే సమయంలో తెలుసుకొన లేకపోయినా, సమీక్షించే సమయంలో తెలుసుకునే అవకాశం వుంటుంది.

అంచెలంచెలుగా పర్యవేక్షణ, తరచుగా క్రమపద్ధతిలో సమీక్ష చేసుకోవడం వలన లోపాలను సరిదిద్దుకోగలుగుతాం. పరుగులు పెట్టే క్రమంలో వీటిని నిర్లక్ష్యం చేస్తే భారీ మూల్యమే చెల్లించుకోవలసి వుంటుంది. పని చేస్తుండే వారికి తెలియని కొన్ని లోటుపాట్లు, పనిని పర్యవేక్షణ చేస్తూండే వారికే తెలుస్తాయి. పర్యవేక్షణ అనేది చేసిన పనులకు వంక బెట్టటానికి కాదని సమీక్ష చేసేవారు, సమీక్షకు గురయ్యేవారూ యిద్దరూ గ్రహించవలసిన అవసరం వుంది.

సమీక్షా సమావేశాల్లో వ్యవస్థలో ఎక్కడ వెనకబాటు వుంది? ఏ శాఖలో వడి, వేగం పెరగాల్సి వుంది? అనేది నిష్పక్షపాతంగా చర్చించవలసిన అవసరం ఉంది. లోపాలు జరిగినపుడు దానికి కారకుడిగా విమర్శకు గురైన వ్యక్తి తన పరిశీలనలను వినిపిస్తూనే, తప్పులు జరిగాయని తోచినప్పుడు వాదనలకు దిగకుండా, తన పరిమితులేమిటో, యిబ్బందులేమిటో చెప్పుకోవడం నేర్చుకోవాలి. పర్యవేక్షకులు పెత్తనం చలాయించడం లేదు, మన పనితీరును మెరుగుపరుస్తున్నారు అని అర్థం చేసుకుని సహకరిస్తూ, సహకారం కోరితే చర్చలు సుహృద్భావ వాతావరణంలో జరుగుతాయి. అలాగే పర్యవేక్షకులు, సమీక్షకులు ఉపదేశాలకు దిగకుండా ఆచరణాత్మకమైన సూచనలు చేయాలి, అవసరమైతే తాము పనిలో సహకరిస్తామని భరోసా కల్పించాలి, పని చేసి చూపించాలి.

మనం పనిచేయడం సులభం కానీ ఎదుటివారితో అదే స్థాయిలో పనిచేయించడం కష్టం, అందుకే గుమాస్తాల కంటె అధికారులకు ఎక్కువ జీతం యిస్తారు - అని అందరూ గుర్తెరగాలి. పర్యవేక్షణలో భాగంగానే కొందరిని గుప్తంగా నియమించుకుని, సంస్థలో కుట్రలు జరుగుతూంటే కనిపెట్టమనాలి. పోటీ సంస్థలు కొందరు పనివాళ్లను లోబరుచుకుని, యంత్రాలను పాడు చేయించడమో, వస్తువుల నాణ్యత దెబ్బతీయించడమో చేస్తూంటారు కాబట్టి యీ గూఢచారుల అవసరం పడుతుంది.

**ఆధునికతను సాంకేతికతను వ్యాపారానికి జోడించడం**

అద్దెకు సైకిళ్లు, స్కూటర్లు యివ్వడమనేది ఎప్పుణ్నుంచో వుంది. కానీ ఎక్కడో ఓ మనిషి దగ్గర తీసుకోవడం, మళ్లీ అక్కడికే వచ్చి అతనికి అప్పగించవలసి వచ్చేది.




నగరాలలో చిన్నచిన్న దూరాలు వెళ్లడానికి మెట్రో రైల్ స్టేషన్ల వద్ద, రైల్వే స్టేషన్ల వద్ద, యితర ముఖ్యమైన కూడళ్ల వద్ద స్కూటర్లు అద్దెకు తీసుకుని, వాడుకుని మరో స్కూటర్ పార్కింగ్ ప్రదేశం వద్ద వదిలేసే వ్యాపారం తలపెట్టింది "బౌన్స్" సంస్థ. అయితే ప్రతీ చోట మనుష్యులను ఏర్పాటు చేయనక్కర లేకుండా, ఒక యాప్ ద్వారా మొత్తం ఆపరేట్ చేయగలుగుతోంది. మొబైల్‌కు వచ్చిన ఒటిపి (వన్ టైమ్ పాస్‌వర్డ్) ద్వారా తాళంచెవి లేకుండానే స్కూటర్‌ను స్టార్ట్ చేయవచ్చును. ఈ ఉపాయంతో బౌన్స్ సంస్థ వ్యాపారాన్ని వృద్ధి చేసుకుంది.

**టర్నోవర్‌ను వృద్ధి చేసుకోవడం ఎలా? సమాజంలోని కొత్త వర్గాలకు వ్యాపారాన్ని విస్తరించడం ఎలా?**

"ఆకాశం నీ హద్దురా" సినిమాకు ప్రేరణ నిచ్చిన కెప్టెన్ జిఆర్ గోపీనాథ్, ఎయిర్ డెక్కన్ స్థాపించినప్పుడు విమానయానం ఖరీదైన వ్యవహారంగా వుండేది. చాలా తక్కువ మందే ప్రయాణించేవారు. ఎయిర్‌లైన్స్ మార్కెట్ చిన్నది. గోపీనాథ్ చిన్న



సైజు విమానాలను, కేవలం ఎకానమీ క్లాసుతో, చిన్న చిన్న ఊళ్ల మధ్య తిప్పడంతో చాలా తక్కువ ధరకే టిక్కెట్లు అమ్మగలిగారు. దాంతో అనేక మంది మధ్యతరగతి వాళ్లు, పేదవారు కూడా విమానం ఎక్కడంతో ఎయిర్‌లైన్స్ మార్కెట్ విపరీతంగా విస్తరించింది.

మనం ముందుకు సాగాలంటే వెన్నెముక దృఢంగా వుండాలి. అలాగే ఏదైనా సంస్థ విస్తరించాలంటే దాని ఇంటర్నల్ ఆర్గనైజేషన్ పటిష్టంగా, లోపరహితంగా వుండాలి.

✡ ✡ ✡



# 18. వృత్తిపరంగా ఎదురయ్యే సంక్షోభాలను ఎలా అధిగమించాలి?

బిజినెస్ అంటేనే ప్రవాహం లాంటిది. ఆటుపోట్లు వుంటాయి. వాలుగాలి, ఎదురుగాలి ఉంటాయి. ఎల్లప్పుడు సాఫీగా సాగిపోతుందని, నేను ప్రణాళిక రచించినట్లుగానే సాగిపోవాలని అనుకోవటం అత్యాశ. ఉద్యోగులను నియమించుకునే సమయంలో వారి స్వధర్మం గుర్తించి, అది వారికివ్వబోయే ఉద్యోగానికి తగినవిధంగా వుందని తోస్తేనే మీరు ఉద్యోగం యిస్తారు. కానీ వారికి మీకున్నంత కమిట్‌మెంట్ వుండకపోవచ్చనే వాస్తవానికి మీరు సమాధానపడాలి. సంస్థతో మీకు ఉన్నంతటి మానసిక బంధం ఇతరులకెలా ఉంటుంది? మీ ఉద్యోగులు ప్రతీదీ జీతానికి ముడిపెట్టుకుని చూస్తూంటారు అనే సత్యాన్ని గుర్తెరగాలి. మీకున్నంత కమిట్‌మెంట్ వారికి వుండకపోయినా మీరు బాధపడకూడదు. ఉద్యోగులు తెలిసీ తెలియక చేసే తప్పులను సున్నితంగా ఎత్తి చూపుతూ సవరించే, సంస్కరించే ప్రయత్నం చేయాలి. కొన్నాళ్లు ప్రయత్నించి, ఎంత చెప్పినా వారిలో మార్పు రాదని తోచినప్పుడే సాగనంపాలి తప్ప ఆవేశకావేశాలతో తీవ్ర నిర్ణయాలు తీసుకోకూడదు.

సిబ్బంది అసంతృప్తికి ముఖ్యకారణం – తాము చేసే పనిని పై అధికారి మెచ్చుకోకపోవడం. లేదా కమ్యూనికేషన్ గ్యాప్ కారణంగా నువ్వెంత అంటే నువ్వెంత

అనుకోవడం. ఈ కోపప్రదర్శనల కారణంగానే టీము స్పిరిట్ దెబ్బ తింటుంది. అందువలన స్టాఫంతటికీ ముఖ్యంగా నేర్పవలసినది కమ్యూనికేషన్ స్కిల్స్! కల్పించవలసినది – భయరహిత వాతావరణం! ఎదుటివారి నుండి తాము ఏం ఆశిస్తున్నామో ప్రతి ఒక్కరు స్పష్టంగా చెప్పగలగాలి. ఏదైనా సందేహాలుంటే ముందే అడిగి తెలుసుకునే ధైర్యం ప్రదర్శించగలిగిన వాతావరణాన్ని ఆఫీసులో కల్పించాలి. పొరపాటు జరిగితే, పై అధికారి తప్పుపట్టే ముందే తనే ఒప్పుకునే స్థయిర్యాన్ని ఉద్యోగులలో యజమాని నింపాలి. లేకపోతే చివాట్లు పడతాయనే సంకోచంతో, భయంతో తమ పొరపాట్లను దాచి పెడతారు. దానివలన తీవ్రపరిణామాలు సంభవించినప్పుడు సరిదిద్దుకునే అవకాశం కూడా లేకుండా పోవచ్చు.

కమ్యూనికేషన్ సరిగ్గా వున్నపుడు ఉద్యోగుల మధ్య వాగ్యుద్ధాలు తగ్గుతాయి. తరచుగా సమీక్షలు ఏర్పాటు చేసి, ఒకరి నొకరు స్వేచ్ఛగా విమర్శించుకునే అలవాటు చేయాలి. ఆ విధంగా బయటకు వెలిబుచ్చడం వలన కోపతాపాలు మనసులో గూడు కట్టుకుని వుండిపోవు. గుండె తేలికపడుతుంది. సంస్థ ఖర్చుతో సిబ్బందికి, కుటుంబాలతో సహా, పిక్నిక్‌లు ఏర్పాటు చేయాలి. దానివలన కుటుంబాల మధ్య కూడా స్నేహపూర్వకమైన వాతావరణం ఏర్పడి, ఉద్యోగులు ముఖ్యమైన నిర్ణయాలలో ఒకరితో మరొకరు సంప్రదించుకునే పరిస్థితి కలుగుతుంది. సీనియర్, జూనియర్ ఫీలింగులు కాస్త అదుపులో వుంటాయి.

చాలా సంస్థల్లో సీనియర్లలో అనుభవం గడించామన్న అహం చోటు చేసుకొని, ప్రత్యేక గుర్తింపు ఆశించడం, అది లభించకపోతే అదలించడం జరుగుతాయి. వాళ్లకు యజమాని యిస్తున్న ప్రాముఖ్యత వలన వారిపై జూనియర్ ఉద్యోగులు అసూయ ఏర్పరచుకోవటం, ఒక గ్రూపుగా చేరి సీనియర్ల యిమేజిని దెబ్బ తీయడానికి ముఖ్యమైన కాగితాలు దాచి వేయడం, సమాచారం అందకుండా చేయడం చేస్తూంటారు. మరి కొందరైతే సంస్థ తమ ప్రతిభకు సరైన గుర్తింపు యివ్వడం లేదన్న అక్కసుతో పోటీ సంస్థలకు రహస్యంగా సమాచారాన్ని చేరవేస్తూంటారు. వీటిని నివారించాలంటే యజమాని స్వ–పర భేదం లేకుండా, వలపక్షం లేకుండా ప్రతిభ, శ్రమ కనబరిచేవారిని ప్రోత్సహిస్తూ వుండాలి. తెలివిగా పనిచేసే గుఱ్ఱానికి, తెలివితక్కువ, బద్ధకపు గాడిదకు ట్రీట్‌మెంట్‌లో తేడా చూపాలి. ఇద్దరినీ సమానంగా చూస్తే అతి త్వరలో గుఱ్ఱాలన్నీ

గాడిదలై పోతాయి. ప్రభుత్వాఫీసుల్లో పని చేసినా, చేయకపోయినా ఒకటే జీతం అనే సిద్ధాంతం వలన చాలామంది పని చేయకుండా కాలక్షేపం చేసేస్తారు. ప్రయివేటు సంస్థల్లో 'కారట్ అండ్ స్టిక్' పద్ధతిని అమలు చేయాలి. అంటే పని చేసేవారికి మేత వేయాలి, చేయనివారికి బడితెపూజ చేయాలి. దీనిలో మొహమాటాలు పెట్టుకోకూడదు. బంధుత్వాలు, స్నేహాలు వుంటే అది ఆఫీసుకి బయట. ఆఫీసులో బాగా పని చేసేవాడికే పట్టం కట్టాలి.

ఆఫీసన్నాక ఒకరి మీద మరొకరు ఫిర్యాదులు చేస్తూనే వుంటారు. పని జరగకపోవడానికి కారణం పక్కవారిమీదకు తోసేస్తూంటారు. యజమానులు స్తోత్రపాఠాలు చెప్పేవారిని, చెప్పుడుమాటలు చెప్పేవారిని దూరంగా పెట్టాలి. ఏదైనా ఫిర్యాదు తన వద్దకు వచ్చినపుడు ఓపిగ్గా నిజనిర్ధారణ చేసుకోవాలి. తప్పు చేశారని తెలిసినపుడు కలుపు మొక్కలను చేను నుండి తొలగించినట్లుగా తీసేయాలి. లేకపోతే పంటకు నష్టం. ఇలా తీసేయవలసి వచ్చిన ఉద్యోగులు ఒక్కోప్పుడు కీలకమైన వ్యక్తులు కావచ్చు. బయటకు సాగనంపితే వారే ఒక పోటీ పరిశ్రమ పెట్టడం గాని, పోటీ సంస్థలో చేరి యిక్కడి వ్యాపారరహస్యాలు చెప్పివేయటం గాని జరగవచ్చు. కానీ ఆ రిస్కుకై భయపడి, చర్య తీసుకోకపోతే పనిచేసే వాతావరణం ధ్వంసమై, సంస్థ సర్వనాశనమౌతుంది.

✡ ✡ ✡

## 19. చేసే ఉద్యోగంలోనే స్వధర్మాన్ని ఆస్వాదించడం ఎలా?

"సొంత వృత్తి లేదా వ్యాపారంపై నాకు ఆసక్తి లేదు. ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగమే హాయిగా వుంది. ఇక్కడే రాణిస్తాను." అని మీకు అనిపిస్తే దానిలోనూ మీ స్వధర్మాన్ని ఎలా పరిపోషించుకో వచ్చునో చూద్దాం. మీరు ఏ స్థాయిలో పని చేస్తున్నా, చిన్న-పెద్ద తారతమ్యం లేకుండా అందరితోనూ కలిసిపోయి వృత్తిపరమైన బాంధవ్యం నెరపగలగాలి. అందరి శక్తి సమన్వయమైనప్పుడే టీం వర్క్ అంటారు. క్రికెటర్లు టీమ్‌గా ఏర్పడి, మంచి వ్యూహంతో మైదానంలో అడుగు పెడతారు. ఆట ఆడుతున్నంతసేపూ ఆ సమూహమంతా ఒకే వ్యక్తిగా రూపెత్తి విజయసాధనలో నిమగ్న మవుతారు. ఎవరికి వారు సొంత గుర్తింపు కోసం కాక, టీము గెలుపు కోసం



ఆడుతున్నారు గనుకనే ఆటపై సమిష్టిగా పట్టు సాధించగలుగుతారు. ఒక్కోసారి ఒకరిద్దరి తప్పిదాల వల్ల ఆట ఓటమి పాలయినప్పుడు, విశ్లేషణ జరుపుకుని, తరువాతి ఆటలో అవి జరగకుండా జాగ్రత్త పడతారు. టీము గెలిస్తేనే తమకు కప్ దక్కుతుంది తప్ప విడిగా ఎంత బాగా ఆడినా కప్ రాదనే సంగతి వారికి స్పష్టంగా తెలుసు. మీరు పని చేసే సంస్థ గెలుపు కూడా మీ సిబ్బంది టీము వర్కు మీదే ఆధారపడి వుంది. మీ మీ హోదాలు, స్థాయిలు వలన పొడచూపే అహాన్ని ప్రక్కన పెట్టి, కలిసికట్టుగా మసలుకోవాలి. సంస్థ అనే చెట్టుకు మీరు ఒక కొమ్మగానే భావించాలి.

ఏదైనా సాధించినా, అక్కడితో ఆగిపోకుండా మిమ్మల్ని మీరు మెరుగు పరచుకునేందుకు కొత్త అవకాశాల కోసం అన్వేషిస్తూనే ఉండండి. అంతేగాని ఇది నా వల్ల కాదు అని తప్పించుకునే ధోరణి అలవర్చుకోవద్దు. కొందరు ఉద్యోగంలో చేరేముందు అన్నీ చేతనవునని చెప్తారు, చేరాక 'ఇది రాదు, దీన్ని నా కంటె ఫలానా వారు బాగా చేస్తారు' అంటూ తప్పించుకుంటూ వుంటారు. దానివలన ప్రస్తుతానికి పని తప్పినా మీ ప్రతిష్ఠ కూడా తగ్గుతుందని అర్థం చేసుకోవాలి. చేసే పనిని మెరుగ్గా, శీఘ్రంగా పూర్తి చేయటానికి సీనియర్ల వద్ద చిట్కాలు నేర్చుకోవాలి. సహోద్యోగులలో కూడా ఎవరెవరి సహకారం ఏ పరిధిలో అవసరమో అంచనా వేసుకోవాలి. తన కంటె కింది ఉద్యోగిలో గల ప్రతిభను గుర్తిస్తూ ప్రోత్సహిస్తూండాలి. ఓ చిన్న ప్రశంస కూడా మనుషుల మధ్య మంచి సఖ్యతను పెంచుతుంది, లేదా నిలబెడుతుంది.

స్వధర్మం అంటేనే ఎవరికి తగిన పాత్రను వాళ్ళు చక్కగా పోషించటం. అందులోని సంతృప్తిని, తద్వారా అందే ప్రగతిని ఆస్వాదించటం. ఒక విజయం చేరగానే "ఇది నేను చేయబట్టే జరిగింది" అనే స్వోత్కర్ష, ఆత్మస్తుతి ఉండకూడదు. కొన్ని సందర్భాలలో మనల్ని ఉబ్బేయడానికి 'నువ్వు ఈ స్థానంలో ఉండాల్సినవాడివి కాదు' అంటూ కొందరు అతిశయోక్తులు వల్లిస్తుంటారు. వాటికి పొంగిపోయి, 'అవును నిజమేనేమో,

నేను యింకా ఉన్నతమైన స్థానంలో ఉండాలి కాబోలు అని మనస్తాపం చెందకూడదు. ఇప్పటివరకు యీ స్థానాన్ని పొందడానికే శ్రమపడి చేరుకుని, దీన్ని ఒక వరంగా భావించి, ఉద్యోగాన్ని ప్రేమించి, నేర్పుగా పని చేస్తున్నాను. అలా బాగా చేశాను కాబట్టే వీళ్లు కాస్త అతిగా పొగుడుతున్నారు' అని ఎందుకనుకోకూడదు? ఇలాంటి సందర్భాలలో సందిగ్ధమనేది మనల్ని కొంతమేరకు అయోమయంలో పడేస్తుంది. అది మరో సంక్లిష్టతకు దారి తీస్తుంది.

అక్కినేని నాగేశ్వరరావు 60 ఏళ్లకు పైబడి తెలుగు సినీ రంగంలో గొప్ప నటుడిగా భాసిల్లారు. ఎన్నెన్నో అవార్డులు, రివార్డులు వరించాయి. అంతటి మహోన్నత స్థాయికి ఎదిగినప్పటికీ, అపారమైన అనుభవం పొందినప్పటికీ, సాటి నటుడు ఎన్.టి. రామారావు దర్శకుడిగా మారినప్పటికి, 'నేను నటుడిగా, నిర్మాతగానే మిగిలిపోతాను తప్ప దర్శకత్వం చేపట్టను' అని నిర్ద్వంద్వంగా ప్రకటించారు. అలాగే గుమ్మడి ఎంత డబ్బు సంపాదించినా, సినీనిర్మాతగా మారలేదు. తాము ఏ పనిలో రాణించగలమో, తమ స్వధర్మమేమిటో వారికి స్పష్టమైన అవగాహన వుందని చెప్పడానికి యివి ఉదాహరణలు.

దీని అర్థం, ఎదగడానికి మెట్లు ఎక్కవద్దు, యితర రంగాలకు విస్తరించవద్దు అని కాదు. ప్రస్తుతం చేస్తున్న పనిపై చూపుతున్న శ్రద్ధ, ప్రేమ కొత్తగా చేపడుతున్న పనిపై కూడా చూపగలమా లేదా, దాన్ని నా స్వధర్మంగా మలచుకోగలనా లేదా అని తర్కించి చూసుకోవాలి. ప్రేమిస్తూ చేసే ఏ పనీ భారంగా తోచదు. డబ్బున్నంత మాత్రాన ప్రతివాడూ సినీనిర్మాత కాలేడు. ఆ రంగంలోని 24 కళలపై ఎంతోకొంత అవగాహన కలిగించుకుని, మనీ మేనేజ్‌మెంట్‌పై పట్టు సాధించి, క్రమశిక్షణతో మెలగుతూ, వ్యాపారదృక్పథం వున్నవారే నిర్మాతలుగా రాణిస్తారు. అదే విధంగా ప్రతి పనిని గౌరవంగా చూడాలి. దానిని వంటపట్టించుకోవడానికి సమయం కేటాయించాలి. శ్రద్ధ కనబరచాలి. దానిని స్వధర్మంగా మార్చుకునేవరకూ దాని జోలికి వెళ్లకపోవడమే మంచిది.

✡ ✡ ✡

**వృత్తిలో విజయం, కుటుంబంలో సంతోషం – యీ రెండిటికీ మధ్య సమతుల్యత ఎలా సాధించాలి ?**

**ప్రతి వ్యక్తి జీవితం** కుటుంబం నుంచే మొదలౌతుంది, అంతిమంగా కుటుంబంతోనే ముగుస్తుంది కూడా. చదివిన చదువు, చేసే ఉద్యోగం, వృత్తి, వ్యాపారాలు జీవితంలో భాగాలు మాత్రమే. వృత్తిలో విజయం పొందటానికి తమ జీవితకాలంలో అత్యధిక సమయాన్ని వెచ్చించే వారిని కోకొల్లలుగా చూస్తుంటాము. విజేతల యొక్క జీవితాలను పరికిస్తే వారు తమ సక్సెస్ జర్నీలో కుటుంబసంతోషాన్ని పణంగా పెట్టినట్లు గమనిస్తాం. వారి విజయోత్సవ సభల్లోను, ఇంటర్వ్యూలలో మాత్రం కుటుంబ సహకారం ఎంతో ఉండబట్టే నేను ఇంతమాత్రం సాధించ గలిగాను అంటూనే విజేతలెవరూ ఫ్యామిలీని సంతోషపెట్టలేరండీ అంటూ సెలవిస్తారు.

**వృత్తిలో విజయం,** కుటుంబంలో సంతోషం – ఈ రెంటినీ వారు సమతూకం చేసుకోలేక పోయారని ఆ మాటలతోనే తెలుస్తుంది. కానీ సంపూర్ణ వ్యక్తిత్వానికి ఆ తూకం ఒక ప్రామాణికం. వృత్తిబాధ్యతల్లో మునిగి తేలే ఉద్యోగి లేదా వ్యాపారవేత్త, కాలం గడుస్తున్నకొద్దీ టార్గెట్లు పెంచుకుంటూ పోయి, వాటి కోసం మరీమరీ బిజీ అయిపోయి, కుటుంబంతో గడిపే సమయాన్ని రానురాను తగ్గిస్తూ పోతూంటారు. దాంతో ఆ మేరకు గృహకార్యకలాపాల భారం భార్యపై పడుతుంది. పిల్లల చదువుసంధ్యలే కాదు, వారి భౌతిక, మానసిక అవసరాలు సైతం తీర్చే బాధ్యతను ఆమె ఒంటిచేత్తో నిభాయించవలసి వస్తుంది. తల్లితో పాటు తండ్రి కూడా పిల్లల ప్రేమను పంచుకోకపోతే అది సింగిల్ పేరెంటింగ్ క్రిందే వస్తుంది. పిల్లల పట్ల వుండే సహజమైన ప్రేమతో తల్లి వారి పొరపాట్లను తెలుసుకోలేక పోలేకపోవచ్చు, ఫిర్యాదులు వచ్చినా కప్పిపుచ్చవచ్చు.

**భర్త తన పాత్రను** తాను పోషించవలసినదే. భార్యను ద్విపాత్రాభినయం చేయమంటే దానివలన కలిగే అనర్థాలు చాలా వుంటాయి. ముఖ్యంగా పిల్లలకు టీనేజి రాక ముందు మేల్కొనకపోతే పిల్లలపై తండ్రికి పట్టు తప్పటం ఖాయం. సరైన పర్యవేక్షణ లేక పిల్లలు చెడుదారిన పడి, కుటుంబానికి చెడ్డపేరు తెచ్చాక, తలిదండ్రులు ఒకరినొకరు నిందించుకుని ప్రయోజనం లేదు. 'నా బిజీ షెడ్యూల్‌లో అన్నీ నేను ప్రత్యక్షంగా చూసుకోలేను కదా, ఏదైనా అపసవ్యంగా వుంటే ముందే నాకు చెప్పాల్సింది.' అని భర్త నిందిస్తే 'వ్యాపారంలో అలిసిపోయి గూటికి చేరి, టెన్షన్లతో నిద్ర పట్టక సతమతమవుతున్న మీకు ఇంటి రాద్ధాంతం చెప్పి మనశ్శాంతి ఎందుకు పోగొట్టాలి అని ఊరుకున్నాను. ఇంతదాకా వస్తుందని అనుకోలేదు.' అని ఆమె జవాబిస్తుంది.

**పగలు రేయనక** తండ్రి తమ కోసమే కష్టపడి సంపాదిస్తున్నాడు అనే భావం పిల్లలకు కలగదు. ఆ సంపాదన వలన కలిగే సౌఖ్యాలను అనుభవిస్తూనే మా నాన్న మమ్మల్ని పట్టించుకోడు. ఎంత సేపూ ఆయనకు తన స్టేటస్ మీదే, సంఘంలో వచ్చే పేరుప్రతిష్ఠల మీదే ప్రీతి అని ఫిర్యాదు చేస్తూంటారు. తల్లి మరణం తర్వాత తండ్రితో పలకరింపులకే పరిమిత మవుతారు.

**విజయం వలన** పిల్లల విషయంలోనే కాదు, భార్యాభర్తల మధ్య సంబంధాల విషయంలో కూడా పొరపొచ్చాలు వస్తాయి. విపరీతంగా ధనం ఆర్జించే వ్యాపారస్తులే కాదు, పేరుప్రఖ్యాతులు పొందిన గురువులు, పండితులు, వృత్తినిపుణులు, కళాకారులు వంటి వారు కూడా అహంకారానికి గురవుతారు. వారి చుట్టూ వందిమాగధులు చేరడం చేత చిన్న విమర్శ కూడా తట్టుకోలేని పరిస్థితి తెచ్చుకుంటారు. వారిలోని లోటుపాట్లను కుటుంబసభ్యులు ఎత్తి చూపినా వారికి దుర్భరంగా వుంటుంది. ఊరంతా అభినందిస్తుంటే, కీర్తికిరీటం నెత్తిన పెడుతూంటే, భార్య తన లోపాలను ఎత్తిచూపి, నిలదీయటం భర్తలకు భరించలేనంత అసహనాన్ని కలిగించి, ఆమెపై విముఖత కలిగేట్లా చేస్తుంది. బయటికి వ్యక్తం చేస్తే కుటుంబకలహం వస్తుందని భయపడి, మెచ్చుకునే స్నేహితులతో ఎక్కువ సమయం గడపనారంభిస్తారు. ఇది మరిన్ని వివాదాలకు దారితీస్తుంది.

**తన అభిప్రాయానికి** భిన్నమైనదాన్ని కూడా గౌరవించటం అనేది ఎంత ఎత్తుకి ఎదిగినా మర్చిపోకూడదు. ఎవరి కుటుంబంలోనైనా భార్యాభర్తల సమాలోచన ఎప్పటికీ వుండాలి. భర్త దూకుడుగా వెళుతున్నపుడు లేక అమాయకంగా ఎవరి బుట్టలోనో పడుతున్నపుడు కామన్‌సెన్స్‌తో భార్య చేసే విమర్శ, నిర్ణయాన్ని మరొకసారి సమీక్షించుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తుంది. బయట ఎంత అంగబలం ఉన్నా, భర్తకు ఇంటి ఇల్లాలితో సరితూగే హితైషి ఎవ్వరూ వుండరు. ఎందుకంటే అతనికి నష్టం వచ్చినా, అనారోగ్యం కలిగినా మొదటగా ప్రభావం పడేది ఆమె పైననే. అదే విధంగా వృద్ధాప్యంలో శక్తియుక్తులు ఉడిగాక ఊరట కోసం వెతుక్కునేది పిల్లలకోసం, మనుమల సాన్నిహిత్యం కోసమే. యవ్వనంలో మీరు వారిని దూరంగా పెడితే, వృద్ధాప్యంలో వారు మిమ్మల్ని దూరం పెడతారు. ధనార్జన అవసరమే కానీ, అదే లోకంగా బతికితే మాత్రం జీవితంలో దాని పాత్ర స్వల్పమేనని తెలుసుకొనేటప్పటికి పుణ్యకాలం గడిచిపోతుంది. అందువలన వృత్తితో పాటు కుటుంబానికి కూడా తగినంత సమయం కేటాయించడం అత్యావశ్యకం.

✡ ✡ ✡

# 20. రోజూ పోరాటం చేస్తూ గెలవాలా?
# లేక ప్రశాంతంగా ఉంటూనే నెగ్గాలా ? తేల్చుకోండి !

తనకున్న శక్తియుక్తులను ఉపయోగించి ఏదో ఒక వృత్తిలో, ఉద్యోగంలో బాధ్యతతో పని చేయటం ప్రతి వ్యక్తికి అవసరం. ఈ తప్పనిసరి ధర్మాన్ని నిర్వర్తించడానికి హైరానా పడుతున్నామా? లేక సంతోషంగా చేస్తున్నామా? అని మనను మనం ఎప్పటికప్పుడు ప్రశ్నించుకోవాలి.




అటు ప్రభుత్వ రంగంలోనైనా, ప్రైవేటు రంగంలోనైనా స్వీట్ బాస్‌లు కొద్ది సంఖ్యలోను, హాట్ బాస్‌లు మాత్రం బహు పెద్ద సంఖ్యలోను వుండటం లోక సహజం. స్వీట్ బాస్ అంటే తనతో పాటు పని చేసే వివిధ స్థాయిల ఉద్యోగులు, కార్మికుల పట్ల సుహృద్భావం కలిగి, వారి కృషికి తగిన గుర్తింపు, ప్రోత్సాహం యిచ్చే వ్యక్తి అని అర్థం. యథా రాజా – తథా ప్రజా అన్నట్లు వీరి యాజమాన్యం వలన ఆఫీసు వాతావరణంలో ఉత్సాహం వెల్లివిరుస్తుంది.

హాట్ బాస్‌ల తరహా భిన్నంగా వుంటుంది. వీరు చెప్పదలచుకున్న విషయాన్ని కర్కశంగా చెపుతూ కింది ఉద్యోగుల్లో భయాన్ని, ఆత్మన్యూనతా భావాన్ని పెంపొందిస్తారు. అడుగడుగునా సుపీరియారిటీ కాంప్లెక్స్ ప్రదర్శిస్తారు. దాంతో కింది ఉద్యోగులు వీరి ఎదుట తమ అభిప్రాయాలను, యిబ్బందులను వెలిబుచ్చడానికి జంకుతారు. గతంలో కార్మిక యూనియన్లు బలంగా వుండే రోజుల్లో వీటికి కొంతవరకైనా అడ్డుకట్ట పడేది. ఇప్పటి పరిస్థితుల్లో యాజమాన్యం మాటే అడ్డు లేకుండా చెల్లుబాటవుతోంది. యువతీ యువకులు అవమానాలు భరించలేక ఉద్యోగం వదులుకుని వెళ్లిపోయిన సందర్భాలు ఎన్నో వున్నాయి. అయితే 45 ఏళ్లకు పైబడిన వారి విషయంలోనే అసలైన చిక్కు వస్తోంది. గతంలో పరిస్థితి బాగానే వుందని వారు యీ సంస్థలో కొనసాగారు. ఇప్పుడు యజమాని లేదా యాజమాన్యం మారడంతో ఆఫీసు వాతావరణం వేడెక్కి భరించలేని స్థితి వచ్చిందని ఉద్యోగం మారలేరు. ఎందుకంటే

వేరే చోట ఉద్యోగం దొరుకుతుందన్న గ్యారంటీ లేదు. మనుగడ కోసం సర్దుకుపోవడానికి మనస్కరించదు.

ఈ సమస్యకు పరిష్కారం చెప్పడం సులభం కాదు. సర్దుకుపోవాలా, వదులుకుపోవాలా అనేది ఎవరికి వారు నిర్ణయించుకోదగింది. లోకంపోకడ పరిశీలిస్తే, ప్రకృతిలోనూ, సమాజంలోనూ భిన్నమనస్తత్వాలు, అసమానతలు వుండడం సహజం. 'కుర్చీ తెచ్చిపెట్టిన అహం తలకెక్కినవారితో మనం రోజూ యుద్ధం చేస్తూండాలా? చేసినా గెలుస్తామా? ఆ వ్యర్థప్రయత్నానికి బదులు మన పని మనం మౌనంగా, ఓర్పుగా చేసుకుపోవడం మంచిది కాదూ?' అనే దృక్పథం అలవర్చుకుంటే మన ప్రశాంతత, గాంభీర్యం ఎదుటివారికి ఓ సవాలుగా మారుతుంది. నిగ్రహం పాటించటమంటే తల ఒగ్గటం కానే కాదు. ఆత్మగౌరవం పోగొట్టుకున్నట్లు అసలే కాదు. ఏ సీటూ ఎవ్వరికీ శాశ్వతం కాదు, కాలం ఎప్పుడూ ఒకేలా వుండదు అనే సత్యాన్ని గుర్తెరిగి ఆచరణలో పెట్టడం మాత్రమే! అయితే దీనికి గాను గట్టి మానసిక బలం వుండాలి. అందుకు యోగా, మెడిటేషన్‌లు ఉపకరిస్తాయి. చాలా సందర్భాల్లో మన పనితీరే ఎదుటివారిని వంచుతుంది. తగిన మర్యాదను యిప్పిస్తుంది. మరి కొన్ని సందర్భాల్లో యాజమాన్యం చేతులు మారి, మన ప్రతిభకు ఆలస్యంగానైనా గుర్తింపు వస్తుంది. పగలైనా, రాత్రయినా ఏదీ ఎక్కువసేపు వుండదని ప్రకృతి మనకు రోజూ నేర్పుతోంది. పరిస్థితిలో మార్పు రాదని నిరాశ పడడం అవివేకం.

ఇక్కడ మనం గమనించవలసిన దేమిటంటే ఉద్యోగులకే కాదు, యజమానులకు కూడా బాస్‌లు వుంటారు. పర్మిట్ల కోసం, లైసెన్సుల కోసం వారు ప్రభుత్వాధికారుల చుట్టూ, మంత్రుల చుట్టూ, నాయకుల చుట్టూ తిరుగుతూ వాళ్లు కూడా అవమానాలు ఎదుర్కోవలసి వస్తూంటుంది. డబ్బున్నంత మాత్రాన అంతా సజావుగా సాగుతుందని లేదు. టాక్స్ ఇన్‌స్పెక్టర్లు, ఫ్యాక్టరీ యిన్‌స్పెక్టర్లు, లేబరు యిన్‌స్పెక్టర్లు, మామూళ్ల కోసం వేధించే వీధి రౌడీలు, తమ అనుయాయులకు ఉద్యోగాలు యిచ్చి తీరాలని పట్టుబట్టే స్థానిక నాయకులు, అవాకులు చెవాకులు రాసి సంస్థకు చెడ్డపేరు తెస్తామని బెదిరించే కొందరు పత్రికల వాళ్లు... యిలా అనేకమందికి వాళ్లు కూడా సలాములు కొట్టవలసి వుంటుంది. విజేతలైన ప్రతివారూ ఎన్నో అవమానాలు, మానసిక క్షోభ భరించాల్సి వచ్చిందని చెప్పుకుంటారు. ఎందుకు అంటే వారు తమ వృత్తిని ప్రేమించారు

కాబట్టి పరిస్థితులతో యుద్ధం చేయగలిగారు. ఆ యుద్ధంలో గాయాలు (మానసికమైనవి) అనేకం అవుతాయి. వారు కూడా ఒక తాత్త్విక దృష్టిని అలవర్చుకుని రంగంలోకి దిగుతారు కాబట్టే విజయం సాధిస్తున్నారు. ఎంతో పెట్టుబడి పెట్టినా, ఒక రకమైన కర్మసన్యాసయోగంతో సంస్థను నిర్వహించకపోతే, మానసిక ఒత్తిడికి తట్టుకోలేక వాళ్ల ఆరోగ్యం దెబ్బ తింటుంది. ఈ విధంగా చూస్తే ఒక సంస్థలో యజమాని, ఉన్నతోద్యోగి, చిరుద్యోగి.. అందరూ ఏదో ఒక రకమైన మానసిక ఆందోళనకు గురి కాక తప్పదు. దాన్ని ఎలా తట్టుకోవాలనే చూసుకోవాలి తప్ప, టెన్షన్ లేని జాబ్ గురించి కలలు కనడం పొరపాటు. ఒక్కటే గుర్తుంచుకోవాలి – టెన్షన్ లేకపోతే జాబే లేదు. మీ బదులు ఒక యంత్రమే ఆ పని చేసి పారేస్తుంది, మీ కంటె వేగంగా. అందువలన ఉద్యోగంలోనో, వృత్తిలోనో చేరి ఆందోళన పడుతున్నానని ఫిర్యాదు చేయడం వృథా.

✡ ✡ ✡

## 21.మనసుకు సెల్ఫీ

'ఏది జరిగినా ప్రశాంత చిత్తంతో స్వీకరించండి అని మీరు చెప్తారు, అది సాధ్యమయ్యే పనా? అసలు కాస్సేపు కూర్చుని యోగా, ధ్యానం చేసే తీరిక నాకెక్కడిది?' అని మీలో చాలామంది వాదనకు దిగవచ్చు. నిజంగా మీకు టైము లేదా? ఒక్కసారి ఆలోచించి చూడండి. మీరు సోషల్ మీడియా కథనాలపై రోజులో ఎంత టైము వెచ్చిస్తున్నారో ఒక్కసారి కాగితంపై రాసుకుని చూసుకోండి. తెల్లవారగానే వాట్సాప్ మెసేజిలు చూస్తారు. తర్వాత ట్విటర్, ఫేస్‌బుక్. ఆ తర్వాత యూట్యూబ్. గతంలో మహాకార్యాలు చేసినవారు సైతం తమ విజయాలను రికార్డు చేయించేందుకు తాపత్రయ పడలేదు. అందుకే మన చరిత్ర పరిశోధకులు యిక్కట్లు పడుతున్నారు. ప్రస్తుత తరం చేస్తున్నది అంతగా ఏమీ లేదు కానీ రోజులో ప్రతి నిమిషాన్ని రికార్డు చేయడానికి తెగ తాపత్రయ పడుతున్నారు. ఫలానా హోటల్‌కి వెళ్లాను



(హొటల్ ముందు ఒక సెల్ఫీ), ఇడ్లీ ఆర్డరిచ్చాను, సాంబారు భలే కలర్‌ఫుల్‌గా వుంది (ఫోటో), తిని ఆనందించాను. (నవ్వుమొహంతో మరో సెల్ఫీ).. యిలా ప్రతి చిన్న విషయాన్ని ఫోటోలు తీసి అందరికీ పంపడం, ఎన్ని లైకులు వచ్చాయో లెక్కపెట్టుకుని మురిసిపోవడం, లైకులు కొట్టనివారిపై పగబట్టడం, వారిని తిడుతూ మెసేజిలు పెట్టడం. ఇలాంటి గ్రూపులో వుండడం అవసరమా? దీనికి ఎక్కణ్నుంచి వస్తోంది టైము?

దీనికి పట్టే టైములో నాలుగో వంతు టైములో ఆత్మపరిశీలన చేసుకుని మన మనసుకు సెల్ఫీ తీసుకుంటే మేలు కదా. దాన్ని ఎవరికీ పంపనక్కరలేదు. మనమే చూసుకోవచ్చు. రోజురోజు తీసుకుని నిన్నటికంటె ఏమైనా మెరుగుపడ్డామా అని పోల్చి చూసుకోవచ్చు. ఎవరైనా లైక్ కొట్టారా లేదా అని వేచి చూడనక్కరలేదు. తక్కువ లైకులు వచ్చాయని బెంగపడనక్కరలేదు. మనకు మనమే పరీక్ష పెట్టుకుని మార్కులు వేసుకుంటున్నాం. మనకు మార్కులు వేసే, తీర్పు యిచ్చే ఛాన్సు వేరేవాళ్లకు యివ్వనే యివ్వం. మనలోకి మనం తొంగిచూసుకుంటున్నపుడు మన చాదస్తాలు, పొరపాట్లు, తిక్కలు మనకే నవ్వు తెప్పిస్తాయి. 'ఆ సమయంలో అలా ఎలా ప్రవర్తించానబ్బా?' అనిపిస్తాయి. ఎదుటివాళ్ల దగ్గర ఒప్పుకోవడానికి అహం అడ్డురావచ్చు. కానీ మన దగ్గర మనకు మొహమాటా లేముంటాయి? ఏదైనా పని జరిగి ఫలితం వచ్చేశాక, మనం సింహావలోకనం చేసుకుంటూ అసలు యీ పని చేయాలని నాకు ఎందుకు తోచింది? ఎవరి ప్రోద్బలమేమైనా వుందా? అలాగే ఎందుకు చేశాను? మార్గాంతరం వుందని ఆలోచించ లేదెందుకు? ఇలా ఆలోచిస్తూ వెనక్కి, వెనక్కి వెళ్లాలి. అప్పుడు మూలకారణం తెలుస్తుంది.

విజయం పొందినపుడు, అపజయం పొందినపుడు కూడా యీ సమీక్ష వలన మన పనుల వెనుక అంతర్లీనంగా ఏదైనా లాజిక్ వుంటే అది బయటపడుతుంది. ప్రతీదాన్నీ అదృష్టం మీదనో, దురదృష్టం మీదనో తోసేస్తే మనకు సరైన సమాధానాలు రావు. అదృష్టం మాట ఎలా వున్నా, మనకంటూ ఒక ప్రతిపత్తి వుందని, ఒక ఉనికి వుందని, ఒక కారెక్టరు వుందని, ఒక ప్రత్యేకత వుందని, అది మన ఆలోచనలను, కార్యాచరణను ప్రభావితం చేస్తోందని గుర్తించాలి. అంతా విధి ప్రకారమే నడపదలచుకుంటే దేముడు మనకు అనుభూతి కలిగించే మనసు, ఆలోచించే బుద్ధి, మంచీచెడూ చెప్పే వివేకం యివన్నీ ఎందుకు యిస్తాడు? ఇది మర్చిపోయి మనలో చాలామంది నష్టజాతకులమని వాపోతూ వుంటారు.

మనలో చాలామందిని తరచుగా వేధించే ప్రశ్న – “వై మీ?” ‘ఫలానాది నాకే ఎందుకు జరగాలి? లోకంలో ఎందరో వున్నారు కదా, ఆఫీసులో నాకే ఎక్కువ పని చెప్తారెందుకు? నన్నే ఉద్యోగం లోంచి ఎందుకు తీసేశారు? నాకే ఎందుకు జబ్బు రావాలి? బస్సులో నాకే ఎందుకు సీటు దొరక్కపోవాలి? దొరికినా నా వైపే ఎందుకు ఎండ పడాలి? నా పక్కన కూర్చున్నవాడే లావుగా ఎందుకు వుండాలి?’ ఇలా అడుగడుగునా మనం మథన పడుతూనే వుంటాం. ఇవన్నీ మనకు నచ్చనవి జరిగినప్పుడే అనుకుంటాం. ‘నాకే ఫస్ట్ ఎటెంప్ట్‌లో ఉద్యోగం ఎందుకు వచ్చింది? నాకే ఎందుకు ప్రమోషన్ వచ్చింది? నన్నే ఫారిన్ టూర్‌కి పంపించారెందుకు? పక్కవాడికి కాన్సర్ వస్తే నాకు మలేరియా మాత్రమే వచ్చిందేం?’ ఇలా ఎప్పుడూ ఆలోచించం. ఆలోచించిన రోజున మనకు ఎన్ని దక్కుతున్నాయో అర్థమవుతుంది. ‘కౌంట్ యువర్ బ్లెస్సింగ్స్’ అని ఇంగ్లీషులో సామెత. నీప్రమేయం ఏమీ లేకుండగానే, నీకు ఇప్పటికే ఎన్నెన్ని సౌకర్యాలు ఒనగూరాయో లెక్కచూసుకుంటే యిటువంటి ఫిర్యాదులు వుండవు. కాళ్లూ, చేతులూ సవ్యంగా వుండి, కళ్లూ, పళ్లూ, చెవులూ బాగా పనిచేస్తూన్నంతకాలం వాటి విలువ తెలియదు. అవి లేనివాళ్లను అడిగితే వాటి విలువ తెలుస్తుంది. మనకు బస్సులో సీటు వచ్చేదాకా వర్రీ. వచ్చాక సీటు దొరికిందన్న ఆనందం కంటె ఎండపడుతోందని వర్రీయే ఎక్కువ వుంటుంది.

మనం ఒకటి గుర్తుంచుకోవాలి. లోకం మన చిత్తానుసారం సాగదు. వర్తమానంలోని వాస్తవికతను మనం అర్థం చేసుకుని పరిస్థితులతో సమాధాన పడాలి. ఎందుకంటే మనకు ఏది మంచో, ఏది చెడో అప్పటికప్పుడు తెలియదు. విమానం మిస్సయిందని టాక్సీవాణ్ని, ట్రాఫిక్‌ను, ఎయిర్‌పోర్టు స్టాఫ్‌ను బండబూతులు తిడతాం. ఆ విమానానికి యాక్సిడెంట్ అయిందనుకోండి. అప్పుడు మిస్సవడం మన మంచికే జరిగిందని సంతోషిస్తాం. కొన్ని విషయాల్లో మంచి జరిగిందో, చెడు జరిగిందో ఐదేళ్లో, పదేళ్లో పోతే కానీ తెలియదు. ఏది జరిగినా మన మంచికే అనుకోవడం ఉత్తమమని పెద్దలంటారు. ‘కోరిక ఒకటి జనించు, తీరక ఎడద దహించు, కోరనిదేదో వచ్చు, శాంతిసుఖాలను తెచ్చు, ఏది శాపమో, ఏది వరమ్మో తెలిసీ తెలియక అలమటించుటే.. ఇంతేరా యీ జీవితం, తిరిగే రంగులరాట్నం’ అంటాడు ఒక సినీకవి. మన ప్రమేయం లేకుండా జరుగుతున్న సంఘటనలతో సమాధానపడి,

జీవితాన్ని ఎప్పటికప్పుడు పరిస్థితులకు అనుగుణంగా మలచుకుంటూ పోవడమనేది అంత సులభమైన పని కాదు.

ఇది నిరంతర ఆత్మపరిశీలన వలన మాత్రమే సాధ్యం. అన్నీ దురదృష్టం మీదనో, దేవుడి మీదనో తోసేయడం తగదు. జరిగినదానిలో మన పొరపాటు వుందా, యింకోలా చేసి వుండాల్సిందా? అనే విషయాన్ని నిష్కర్షగా ఆలోచించుకోవాలి. ఎవరితోనైనా పేచీ వచ్చినపుడు, ఎవరైనా మనకు అన్యాయం చేశారని భావించినపుడు, ఎంతసేపూ మన తరఫు వాదననే మననం చేసుకుంటూ కూర్చునే బదులు, మనల్ని మనమే యిద్దరిగా విభజించుకుని, అవతలివైపు వాడి వాదన కూడా మనకు మనమే వినిపించుకోవాలి. దీన్నే డెవిల్స్ ఎడ్వకేట్ అంటారు. కాస్సేపు మనల్ని మనం అవతలివాళ్ల స్థానంలో ఊహించుకుని అతని కోణంలోంచి ఆలోచించి చూడాలి, వాదించి చూడాలి. చివరకు మనకే న్యాయమేదో తెలుస్తుంది. అంటే యిక్కడ మీరే ప్రాసిక్యూషన్, మీరే డిఫెన్సు న్యాయవాది, మీరే జడ్జి. ఏ పాత్రలో వున్నపుడు ఆ పాత్రనే పోషిస్తూ ఈ త్రిపాత్రాభినయాన్ని సమర్థవంతంగా చేసినప్పుడు మీకు మానసిక చింత తగ్గుతుంది.

✡ ✡ ✡

## 22. చింత తగ్గించుకునే ప్రక్రియ

ఈ ప్రక్రియ ఇంటర్నెట్ వెతకడం ద్వారా, యూట్యూబ్‌లో వీడియోలు చూడడం ద్వారా అలవడదు. బాహ్యజ్ఞానానికి, వినోదానికి మాత్రమే అవి పనికి వస్తాయి. కానీ యిలాంటి విషయాల్లో మనకు కావలసినది ఆత్మజ్ఞానం. మనలో మంచిచెడ్డలను నిష్పాక్షికంగా, సాక్షీభావంతో పరామర్శించుకోగల ప్రజ్ఞ. అది యోగసాధనతో, ధ్యానంతో మాత్రమే సాధ్యం. దాని విధివిధానం కింద యిస్తున్నాము.

సంసిద్ధత : స్నానానంతరం చేయడం మంచిది. పొట్ట కాస్త ఖాళీగా ఉండేలా చూసుకొనాలి. యోగసాధన తర్వాత చేస్తే ఏకాగ్రత కుదరడం సులభమౌతుంది.

1. వెన్నెముక తిన్నగా పెట్టి కూర్చొని, చేతులను చిన్ముద్రలో వుంచి, ప్రకృతిని లేదా ఉషోదయపు సూర్యుని చిత్రీకరించిన చిత్రపటాన్ని 5 అడుగుల దూరంలో కంటికి సమాంతరమైన ఎత్తులో అమర్చుకొని, తదేక దృష్టితో దాని కేసి 3 నిమిషాలపాటు

“ధారణ” చేస్తూ దాని సౌందర్యాన్ని ఆస్వాదించాలి. ఆ పారవశ్యంలో మునిగితే మన మదిలోని గందరగోళాలు మరపు కొస్తాయి. మనసు కూడా తేలిక పడుతుంది.

2. అటు పిమ్మట, నాడిశోధన అనే నిదాన ప్రాణాయామం చేయాలి. ఓ నాశికారంధ్రం నుంచి ఉచ్ఛ్వాసను (Inhalation) సంపూర్తిగా తీసుకొని, కొంతసేపు నిలిపి, మరో నాశికారంధ్రం నుండి బాగా నిదానంగా నిశ్వాస (Exhalation) జరపాలి. ఇలా 24 సార్లుగా చేయాలి. శ్వాసకు, మనసుకు సంబంధం వున్నది గనుక నెమ్మదిగా తీసుకునే శ్వాసల నియంత్రణ ద్వారా ఆంతరంగం కుదురుకొని శాంతపడుతుంది.



3. ఇప్పుడు షణ్ముఖి ముద్రను పాటించాలి. విధానం ఎలాగంటే, మీరు కూర్చున్న భంగిమ లోనే కాస్త ముందుకు ఒరిగి, రెండు మోచేతులను, మడిచి వుంచిన మోకాళ్లపై కుదురుగా ఆనించి, మీ బొటన వ్రేళ్ళతో రెండు చెవులను మూసి వుంచి, రెండు అరచేతులతో మూసి వుంచిన కను రెప్పల మీద పూర్తిగా (చీకటి సృష్టించేలాగ) కప్పి ఉంచాలి. ఇలా దాదాపు 24 శ్వాసలను నింపాదిగా తీసుకొనాలి. ఆ తర్వాత నెమ్మదిగా యథాస్థితికి వస్తూ, ఒక్కో చేతిని కళ్ళనుండి తొలగించాలి.

దీనివలన ఏమిటి ప్రయోజనం అంటారా? ముఖ్య జ్ఞానేంద్రియాలైన కళ్లు, చెవులు బయటి ప్రపంచం నుంచి గ్రహించేదాన్ని ఒకే సారిగా నిలిపివేయటం చేత, బయటి ప్రభావాలకులోను కాకుండా వుండి మెదడులో శూన్యత ఏర్పడుతుంది. తద్వారా అతి త్వరగా ప్రశాంతత సమకూర్చుకుంటుంది. మనసు ప్రశాంతంగా, భావరహితంగా వున్నపుడే అంతరంగ పరిశీలన సాధ్యపడుతుంది!

✡ ✡ ✡

# 23. గ్యారంటీ వుందా?

**స్వధర్మం పాటించినంత మాత్రాన మేధావులమై పోతామన్న, విఐపిలమై పోతామన్న గ్యారంటీ ఉందా? :** ఖచ్చితంగా లేదు. ఇది ఆత్మతృప్తికి సంబంధించిన విషయం. ఆ మాటకు వస్తే మేధావులంటే ఎవరు? మేధస్సుకు కొలబద్ద ఏది? డిగ్రీలా? పదవా? బాగా చదువుకుని, తామే తెలివైన వారిమని విర్రవీగేవారి కంటె కామన్‌సెన్స్ వున్న సామాన్యుడే ఒక్కో సందర్భంలో ఎక్కువ తెలివితేటలతో వ్యవహరిస్తాడు. పుస్తకాల ద్వారా కానీ, గురువుల ద్వారా కానీ ఎంత జ్ఞానం సంపాదించినా అప్లికేషన్ అనేదే ముఖ్యం. ఆచరణలోకి రాని మేధస్సు వ్యర్థం. ఏదైనా కొత్త విషయాన్ని తెలుసుకున్నపుడు, కొత్త వస్తువు తారసిల్లినపుడు దానిని ఎలా ఉపయోగించాలి, దానికి కొత్త ఉపయోగం ఏమైనా వుందా? చిన్న మార్పు చేయడం ద్వారా దాని నుంచి ఎక్కువ ఫలితం పొందగలమా? అనేవి ఆలోచించి అమలు చేసినవాడే అసలైన మేధావి. ఆ ఆలోచన రావడమనేది సాధన వలన సమకూరుతుంది. ఆ పనిని తన స్వధర్మంగా




భావించి, తపించినప్పుడే కొత్త రకమైన ఆలోచన తడుతుంది. ప్రపంచంలో ఎన్ని విషయాలు తెలిసాయన్నది ముఖ్యం కాదు. చేపట్టిన పనిని వినూత్నంగా, విశిష్టంగా, తేలికగా, తక్కువ శ్రమతో ఎక్కువ ఫలితం కలిగేట్లా చేయగలుగుతున్నామా లేదా అన్నదే చూడాలి. ఇది స్వధర్మసాధన వలననే సాధ్యం.

ఇక **విఐపిల** మాట కొస్తే – మనం కొందరిని విఐపి (వెరీ ఇంపార్టెంటు పర్సన్)లుగా భావిస్తాం. ఎందుకంటే సమాజం లేదా ప్రభుత్వం వారిని అలా గుర్తించింది గనుక. వారి హంగూ, ఆర్భాటం చూసి మనలో చాలా మందిమి మనమూ ఒకనాటికి విఐపి కావాలని ఉబలాటపడుతుంటాం. ఏమి చేస్తే, ఏం సాధిస్తే అలా అవుతామా అని ఆలోచిస్తూ, ఆందోళన పడతాం కూడా!

నిజానికి యిలాంటి గౌరవాలన్నీ పైపై మెరుగులే. తెలుగు సినిమా రంగంలో ఒక పెద్ద హీరోకు హైదరాబాదులో విఐపి గౌరవం దక్కుతుంది. అందరూ అతన్ని చూసి పక్కకు తప్పుకుని దారి యిస్తారు. కానీ అతనే ఢిల్లీ ఎయిర్‌పోర్టులో దిగినప్పుడు సాటి ప్రయాణీకులు అతన్ని తమలో ఒకడిగానే చూస్తారు తప్ప ప్రత్యేకంగా చూడరు. ఎవరైనా బెంగాలీ హీరో మనతో పాటు మెట్రో ఎక్కబోతే, తోసుకుంటూ పోతాం తప్ప తిరిగి కూడా చూడం. అలాగే సంగీతవిద్వాంసుడి విలువ ఆ రంగంలో వున్నవారికి తెలుస్తుంది తప్ప తక్కినవారికి కాదు. అదేవిధంగా క్రికెట్ అంటే తెలియనివాడు రైల్లో పక్క బెర్త్‌లో సచిన్ టెండూల్కర్ ఉన్నా ఉప్పొంగిపోడు. ధనికుల సంగతి చెప్పనే అక్కరలేదు. విమానంలో ఎక్కినపుడు అందరితో బాటు అతనూ క్యూలో వస్తాడు. ఎన్ని వందల కోట్లున్నా ఎవరూ తల తిప్పి కూడా చూడరు. ఎందుకంటే అది అతని మొహం మీద రాసి వుండదు కాబట్టి. ఒకవేళ ఎవరైనా పనిగట్టుకుని రాసినా, ఓహో అనుకుంటారు తప్ప ప్రత్యేకమైన గౌరవం యివ్వరు, అతనితో పనిబడితే తప్ప!

అంటే దీని అర్థమేమిటి? విఐపి అనేది మన మనసులో వున్న భావమంతే! మనం గొప్పగా భావిస్తే అతను విఐపి. మనలాంటి వాడే అనుకుంటే సాధారణ వ్యక్తి! అందువలన యీ విఐపి అనే పదానికి మనం అంతగా విలువ నివ్వనవసరం లేదు. మనం వాళ్ళలా కానక్కర్లేదు కూడా. మన పనిని మనం హుందాగా చేసుకుంటూ పోతూ, గౌరవంగా బ్రతక గలిగితే చాలు. మనం చేసే పని బాగుంటే గుర్తింపు దానంతటదే వస్తుంది. అవతలివాళ్లకు టేస్టు లేక, లేదా దాని విలువ తెలియక, గుర్తింపు నీయకపోతే చింతించవలసిన పని లేదు. అమితాబ్ బచ్చన్ ఇండియాలో ఎక్కడైనా వెళితే వందలాది మంది చూస్తారు. అదే ఫారిన్‌కి వెళితే తల తిప్పి కూడా చూడరు. అయ్యో యిక్కడ నాకు గుర్తింపు లేదే అని ఆయన చింతిల్లుతాడా? మరొకరి నుంచి ప్రత్యేకమైన గుర్తింపు ఆశించేవాళ్లు ఆశాభంగం పొందక తప్పదు.

సమాజంలో ఎన్నో వర్గాలున్నాయి. ఎవరి పని వాళ్ల కుంది. వారికి అవసరమైనంత వరకే తెలుసుకుంటారు తప్ప ఉత్తి పుణ్యాన 'సితార్ వాయించడంలో ప్రఖ్యాత విద్వాంసుడెవరు? ఆయన ఎలా వుంటారు?' అని ఎవరూ కనుక్కోరు. మామూలు మాటల్లో చెప్పాలంటే ఎవడి గోల వాడిది. అందువలన యితరులు మనల్ని పట్టించేసుకుంటున్నారని అనుకోవడం భ్రమ. మన పని మనం సవ్యంగా చేసుకుంటూ

పోతే, దానితో పనిబడిన వాడికి, దాని విలువ తెలిసినవాడికి, దానిలో మనం చూపిన ప్రమాణాలు అర్థమై, మనల్ని గౌరవిస్తాడు. తక్కినవాళ్లకు మన ప్రతిభ గురించి తెలియక పోయినా వచ్చే నష్టం లేదు. అందువలన మనకు మనమే విఐపి లనుకోవడం మేలు. విఐపి ఎలా అవుతామంటే, పనిలో నాణ్యత చూపడం ద్వారా! అలా నాణ్యత చూపాలంటే ఆ పనిని మన స్వధర్మంగా ఎంచుకోవాలి.

**ఎవరు విఐపిలు?**



విఐపిలు కావాలంటే బాగా చదువుకోవాలని, బాగా సంపాదించాలని అనుకోవడం పొరపాటు. తన స్థాయిలో తన వంతు కృషి చేసినవారు కూడా విఐపిలుగా గుర్తింపబడతారు. కర్ణాటకలోని చదువురాని, కూలిపని చేసుకునే తిమ్మక్క అనే ఒక మహిళ, ఆమె భర్తతో కలిసి హులికల్, కూడూరు మధ్య హైవే పక్కన నాలుగు కిలోమీటర్ల దూరం పాటు 385 మఱ్ఱి చెట్లు, 8 వేల యితర చెట్లు నాటింది. ఎవరో వచ్చి గుర్తిస్తారని, మెచ్చుకుంటారని చేసిన పని కాదది. పర్యావరణ పరిరక్షణకు తన వంతుగా చేసిన పని అది. కానీ ఆమెకు గుర్తింపు వచ్చింది. భారత ప్రభుత్వం ఆమెకు 2019లో పద్మశ్రీ యిచ్చింది. అమెరికాలో ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ సంస్థ ఒకటి తమ సంస్థకు ఆమె పేరు పెట్టుకుంది. 2020లో కర్ణాటక సెంట్రల్ యూనివర్శిటీ ఆమెకు గౌరవ డాక్టరేటు ప్రసాదించింది. ఇప్పుడు చెప్పండి ఎవరు విఐపి?

✡ ✡ ✡

## 24. మంచి చెయ్యి – మనశ్శాంతి నీ వెంటే వస్తుంది !

"ధ్యానం చేయండి, అన్ని శారీరక, మానసిక సమస్యలు పోతాయి.' అని డాక్టర్ల దగ్గర్నుంచి, స్వామీజీల దాకా అందరూ చెప్తారు. మీరు కూడా మా స్వధర్మమేదో తెలుసుకోవడానికి, మాలో గుణదోషాలను తెలుసు కోవడానికి నిత్యం ధ్యానం చేయమంటున్నారు. కానీ ఏకాగ్రత కుదిరేదెలా? యోగా చేయమంటే ఎలాగోలా ఒళ్లొంచి చేస్తాం, కానీ మెడిటేషన్ చేయాలంటే మనసు కుదురుగా వుండదు. ఏవేవో ఆలోచనలు వచ్చి మనసు గజిబిజి అవుతుంది. మనశ్శాంతి లేనిదే ధ్యానం ఎలా



సాధ్యం? ఈ ఆందోళనా పూరిత సమాజంలో మనశ్శాంతి ఎలా సాధ్యం?" అని చాలామంది నన్ను అడుగుతూంటారు.

కాస్త ఆలోచించి చూడండి – ఈ భూప్రపంచంలో పులి, సింహం, తోడేలు వంటి క్రూరజంతువులు బలహీన జంతువులను వేటాడి చంపి ఆహారంగా భుజిస్తాయి . కొన్ని క్రిమికీటకాలు సూక్ష్మ జీవులను తింటాయి. కానీ ఈ 84 లక్షల జీవరాశులలో మానవజాతి తప్ప ఏ ఇతర జీవీ స్వజాతి జీవులపై ఆధిపత్యానికి ప్రయత్నించదు. ఆహారం కోసం అప్పుడప్పుడు పోటీ పడవచ్చు, కొట్లాడవచ్చు కానీ అది అంతటితో సరి. దానికి నా కంటె మంచి గూడు దొరికింది, నా కంటె దాని పిల్లలు అందంగా వున్నారు, చురుగ్గా వున్నారు, దాని గుహ వెచ్చగా వుంది – యిలాటి అసూయామత్సరాలు పెట్టుకోవు. కానీ కొందరు మనుషులు జీవితమంతా యితరులతో పోల్చుకుని బాధపడడంలోనే సరిపోతోంది. అందుకే యీ ఆవేదన, ఆందోళనలు.

కొందరు మానవులలో పాతుకు పోయిన ఈ దుర్లక్షణమే సమాజంలో ఎన్నో అశాంతులకూ కారణభూతమయ్యింది. ఓ ప్రక్క సర్వమానవ సౌభాగ్యం కోసం దైవాన్ని ప్రార్థిస్తున్నానని చెపుతూ మరో పక్క పొరుగువాడిపై ద్వేషం చిమ్మడం, అపకారం చేయబోవడం తీవ్ర ఆక్షేపణీయం. తను పైకి రావడం ఎలా, పోటీదారుణ్ని పడదోయడం ఎలా అనే తీవ్రమైన ఒత్తిడికి గురౌతున్న ప్రజానీకం, ఈ అశాంతి నుండి ఎలా బయటపడాలా అని దొరికిన మార్గాలన్నీ వెతుకుతున్నారు. మనఃశాంతి పొందటం కోసం స్వామీజీలు, బాబాలను ఆశ్రయిస్తున్నారు. ఇదంతా ఏళ్ల తరబడి విఫలమౌతున్న వ్యర్థప్రయత్నం. నిన్ను నీవు మార్చుకునే చైతన్యం నీ లోపలి నుంచే రావాలి. బయటివాళ్లను ఆశ్రయించడం మానేసి ఎదుటి మనిషిలోని దైవత్వాన్ని గుర్తించడం ప్రారంభించాలి.

అప్పుడు నువ్వు యితరుల లాభనష్టాల గురించి ఆలోచించడం మానేస్తావు. గడబిడల

నుండి నీ మనసు స్వతంత్రతను పొంది, నీలో నిగూఢంగా వున్న శక్తిని మేల్కొలుపుతుంది. స్వేచ్ఛాయుతమైన ఆలోచనతో చేసే పనులు సఫలమౌతాయి. పర్యవసానంగా వచ్చే ఫలితాలు నీకు భౌతిక పరమైన లాభంతో పాటు మనఃశాంతిని, సంతోషాన్ని కూడా కలిగిస్తాయి. చుట్టూ వున్న సమాజాన్ని తిట్టుకుంటూ, దానితో కలహించడం వలన దాన్ని మార్చలేవు సరి కదా, అశాంతి పొందుతావు. దానితో సమాధాన పడడమే పరిష్కారం. నీకు వీలైనంత పరిధిలోనే యితరులతో సౌమ్యంగా వ్యవహరిస్తూ, వారికి మంచి చేయడం ఉత్తమం. నీవు చేసే మంచిని ఎదుటివారు గుర్తించకపోవచ్చు. హేళన చేయవచ్చు కూడా. కానీ మంచి చేస్తున్నాననే స్పృహ నీకు చిత్తశాంతిని కలిగిస్తుంది. ఎందుకంటే మనస్సాక్షిని మించిన సాక్షి వేరే లేదు. కొంతకాలానికి ఎదుటివారు నీ నిష్కల్మషమైన మనసును, నీ సదుద్దేశాన్ని గుర్తించి ప్రశంసించవచ్చు. కానీ దానికి ద్వితీయస్థానమే. ఉపకారం చేయడం వలన కలిగే ఆనందానిదే ప్రథమస్థానం.

ఎవరికి ఉపకారం చేయాలి? అనేది ఒక ప్రశ్న. భవిష్యత్తులో వీడు నాకు ప్రత్యుపకారం చేస్తాడు అని లెక్క వేసుకుని ఎవరికీ ఉపకారం చేయలేము. అతను నీకు ప్రత్యుపకారం చేసే స్థితిలో లేకపోవచ్చు, నీకు అవసరం పడకపోవచ్చు. భవిష్యత్తులో నీకా అవసరం పడే సమయానికి అతను అందుబాటులో లేకపోవచ్చు, నువ్వే ఆ సమయంలో లేకపోవచ్చు. అందువలన ఏదైనా ఆశ పెట్టుకుని ఉపకారాలు చేస్తే, ఆశాభంగం కలగడం తథ్యం. లోకంలో ఒకటి గమనించవచ్చు. నీ వలన ఉపకారం పొందినవాడు నీకు ప్రత్యుపకారం చేయకపోవచ్చు కానీ, నీతో ఏ పనీ లేనివాడు, ఉత్తినే నీకు ఉపకారం చేస్తాడు. నువ్వు బ్యాంకులో ఒక బ్రాంచ్‌లో డిపాజిట్ చేసినప్పుడు యిచ్చే నోట్లు వేరు. కొన్నాళ్ల తర్వాత మరొక బ్రాంచ్ నుంచి విత్‌డ్రా చేసినప్పుడు చేతికి వచ్చే నోట్లు వేరు. రెండింటికి లింకు లేదని అనగలమా? అందువలన నీ పాటికి నీవు సహాయం చేస్తూ పోతే, వేరే వాళ్ల ద్వారా దాని ఫలితం అందుతుందని అనుకోవాలంతే.

అపకారికి కూడా ఉపకారం చేయాలా? అనేది మరో ప్రశ్న. ప్రపంచంలో ఎవరైనా ఎల్లకాలం చెడు చేయలేరు. దాని కారణంగా కలిగే అశాంతి, అలజడి సమాజానికే కాదు తన మెడకు కూడా చుట్టుకుంటుంది గనుక. మనుష్యులు నిరంతరం మారుతుంటారు. కలహించిన అన్నదమ్ములు మళ్లీ కలుస్తుంటారు. మంచి స్నేహితులు ఏదో ఒక విషయంలో వేరుపడి ద్వేషం పెంచుకుంటారు. ఏ బంధమూ శాశ్వతం

కాదు. అందువలన భవిష్యత్తు గురించి మరీ ఎక్కువగా ఆలోచించకుండా మన పాటికి మనం మంచి చేస్తూ పోవడం మేలు. దాని వలన సమాజానికి కలిగే మేలు అందరిలో ఒకరిగా నీకూ లభిస్తుంది. సంఘర్షణకు తావు లేని మంచి ప్రయత్నాలు ఎన్నాళ్ళు కొనసాగించినప్పటికీ అలజడి, అలసట ఉండవు. సూక్తులు, ప్రవచనాలు వినడం ద్వారా కలిగేది తాత్కాలిక శాంతి. సత్కర్మలు చేస్తుంటేనే మనకు, ఇతరులకు కూడా నిజమైన శాంతి ప్రవర్ధిల్లుతుంది. "పరోపకారార్థం ఇదం శరీరం" అనే సూక్తిని గుర్తు పెట్టుకుని, సాధ్యమైనంత వరకు ఆచరణలో పెట్టడం వలన మనశ్శాంతి కలిగి, తద్వారా యోగసాధన, ధ్యానం చేయడం సులభమౌతుంది.

✡ ✡ ✡

## 25. మనశ్శాంతికి ముఖ్యంగా కావలసినది - భద్రతాభావం

ధ్యానం చేయాలంటే మనశ్శాంతి కావాలనుకున్నాం. అందుకుగాను నిష్కల్మషమైన, ఆందోళనారహితమైన మనసు వుండాలన్నాం. ఆందోళన కలిగించే మరో ముఖ్యమైన విషయం గురించి యిక్కడ చెప్పుకోవాలి. అది అభద్రతాభావం! ఎందుకంటే, అభద్రత అనేది మానసికభయం, దిగులుకు కారణభూత మౌతుంది. ప్రస్తుతానికి భద్రత వుందని మనసుకు తోస్తున్నా, భవిష్యత్తులో ఏమౌతుందో అనే అభద్రతాభావం మనలో నిద్రాణంగా వుండి అశాంతిని కలిగిస్తుంది. మనల్ని బాధిస్తున్న అభద్రతాభావం ఏమిటన్నది మనకి మనం విశ్లేషించుకుంటేనే ఆ అస్పష్టత నుంచి బయటపడగలం.



**భద్రత ఎన్ని రకాలుగా వుంటుంది? 1. ఆరోగ్య భద్రత 2. ఆదాయ భద్రత 3. కుటుంబ గౌరవ భద్రత 4. మానసిక భద్రత 5. సామాజిక భద్రత.** వీటికి విఘాతం కలుగుతుందన్న భయమే అభద్రతా భావాన్ని కలిగిస్తుంది.

**1. ఆరోగ్య భద్రత :** ఇది రెండు రకాలుగా వుంటుంది. ఒకటి జన్యుపరమైనది, రెండోది మన ఆహారవిహారాలపై ఆధారపడినది. పెద్దల నుండి మనకు ఆరోగ్యం కానీ అనారోగ్యం కానీ జీన్స్ ద్వారా సంక్రమిస్తుంది. మన రూపురేఖలు, ఒడ్డూపొడవు, శరీరం రంగూ, శారీరక దారుఢ్యం యివన్నీ పైకి కనబడతాయి. వీటితో గుప్తంగా వుండే వ్యాధులు కూడా వుండవచ్చు. సహజంగా మధ్యవయస్సు దాటాక యివి

బయటపడుతూ వుంటాయి. ఇంకోవైపు మన అలవాట్లు మన ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయి. ఇది యవ్వనంలో వుండగా పెద్దగా తేడా అనిపించకపోయినా మధ్య వయసు నుండి వాటి ఫలితాలు గోచరిస్తాయి. ఏదైనా రోగచికిత్సకు వెళ్లినపుడు మనకు పూర్తి అవగాహన



వస్తుంది. కానీ అప్పటికే ఆలస్యమైన సందర్భాలుంటాయి. అందువలన మొదటినుంచే ఆరోగ్యాన్ని భద్రంగా కాపాడుకోవడం మేలు. ఆహార విహారాదులపై శ్రద్ధ పెట్టి క్రమబద్ధంగా వుంచుకోవడం సర్వదా శ్రేయస్కరం. దానివలన ఆరోగ్యం ఎలా వుంటుందో అనే అభద్రతాభావం నుంచి తప్పించుకోవచ్చు.

అలవాట్లనేవి వ్యక్తిగతమైనవి అయినా, ఆహారమనేది కుటుంబ సంస్కృతి పైన, ఆరోగ్యస్పృహ మీద ఆధారపడి ఉంటుంది. కుటుంబ ఆరోగ్యం గృహిణి మీదనే ఆధారితమని కచ్చితంగా చెప్పవచ్చు. కనుక ఏది ఆరోగ్యదాయకమో, ఏది కాదో ప్రతి గృహిణి పరిపూర్ణంగా తెలుసుకుని వుండాలి. తన వంటా వార్పు - కేవలం రుచి ప్రధానంగానే కాకుండా, కుటుంబ సభ్యుల వయసుకు, రుగ్మతలకు తగినట్లుగా వుండేట్లు చూసుకోవాలి. ప్రతి వ్యక్తి తన మధ్యవయసు నుండి ఆరోగ్యపరీక్షలను క్రమం తప్పకుండా చేయించుకొనాలి. రోగాన్ని ముందుగానే నిరోధించాలి. ఇన్సురెన్స్ వాళ్ళు మీ మెడికల్ బిల్ చెల్లిస్తారేమోగాని, నష్టపోయిన మీ ఆరోగ్యాన్ని, దెబ్బతిన్న మీ శరీరాన్ని రిపేరు చేయలేరు. కనుక మన ఆరోగ్యానికి మనమే సంరక్షకులుగా మారక తప్పదు. దైనందిన వ్యాయామం, నడక, యోగా, ప్రాణాయామం చేయటం ఆరోగ్యభద్రతకు ఆయువుపట్టు. ఆరోగ్యమైన శరీరంలోనే ఆరోగ్యమైన మనసు వుంటుందని పెద్దలు చెప్పారు. అందువలన మానసిక ఆరోగ్యానికి కూడా యిది ఉత్తమమైన పద్ధతి.

**2. ఆదాయ భద్రత :** సమాజంలో డబ్బుకు వున్న విలువ అంతాయింతా కాదు. అన్నీ వున్నా డబ్బు లేకపోతే అశాంతి తప్పదు. తగినంత ఆదాయం లేకపోతే భార్యాభర్తల మధ్య కీచులాటలు, పిల్లల అసంతృప్తి తప్పవు. ఖర్చులు పోనుపోను పెరుగుతూనే వుంటాయి. స్థిరమైన




ఆదాయం లేకపోతే భవిష్యత్తు పట్ల ఆందోళన తప్పదు. బ్యాంకులో సరిపడ బాలన్స్

వుంటే ఆత్మబలానికి ఊతాన్నిస్తుంది. అందువలన ఆర్థిక విషయాలలో క్రమశిక్షణ పాటిస్తూ, ఆదాయానికి తగినట్లుగా ప్లాన్ చేసుకుంటూ వుండాలి. ఆర్థిక అవసరాలు పెరుగుతున్నపుడు భార్యాభర్తా యిద్దరూ ఉద్యోగాలు చేయవలసి వుంటుంది. భర్త ఏదైనా వ్యాపారం చేపట్టినపుడు దానిలో రాబడి ఎప్పుడు వస్తుందో తెలియదు కాబట్టి నెలసరి ఖర్చులకై భార్య నికరాదాయం ఉద్యోగం చేయడం మంచిదనే ఆలోచన ఆచరణయోగ్యమైనదే. రావలసిన బాకీలు ఎప్పుడు వసూలవుతాయో అనే ఆందోళన అభద్రతాభావాన్ని కలిగిస్తుంది. అందుకని కుటుంబం జరుగుబాటుకై స్థిరాదాయం వచ్చే మార్గాన్ని ముందే ఏర్పాటు చేసుకోవాలి. అనుకోకుండా వచ్చిపడే ఖర్చుల కోసం కొంత మొత్తాన్ని పొదుపు చేయడం కూడా అత్యవసరం. అలా అని డబ్బు కోసం వెంపర్లాడి సరదాలను చంపుకుంటూంటే అది అసంతృప్తికి దారి తీస్తుంది. అందువలన ఒక బడ్జెట్ వేసుకుని, అన్ని అవసరాలను కొద్దికొద్దిగా తీర్చుకుంటూ, భవిష్యత్తు కోసం ప్రణాళిక వేసుకుని, దానిని కచ్చితంగా అమలు చేయాలి. దీనికి భార్యాభర్తలిద్దరి సహకారం అవసరం. వీరిలో ఎవరికైనా బడాయి కోసం అప్పులు చేసే అలవాటుంటే ఆర్థిక పరమైన సంక్షోభం, తద్వారా చికాకులు తప్పవు. క్రమబద్ధమైన ఆర్థికవిధానం మనశ్శాంతికి అత్యవసరం. లేకపోతే రేపటి సంగతి ఏమిటనే అభద్రతాభావం వెంటాడి, ధ్యానం కుదరదు.

**3. కుటుంబ గౌరవ భద్రత :** మనిషికి డబ్బుతో పాటు గౌరవం కూడా ముఖ్యం. ఎంత డబ్బున్నా ప్రవర్తన మర్యాదపూర్వకంగా లేకపోతే మెప్పు లభించదు. అవమానం మనస్సును దహించి వేసి, మనశ్శాంతిని హరిస్తుంది. కుటుంబంలో ఒక వ్యక్తి హుందాగా ప్రవర్తించి, తక్కినవాళ్లు వేరేలా వుంటే లాభం లేదు. కుటుంబంలో అందరూ చక్కగా మెలగాలి. బంధుమిత్రుల మధ్య, సమాజం మధ్య మంచి పేరు తెచ్చుకోవాలి.



భార్యాభర్తలిద్దరూ ఒకరిపై మరొకరికి గౌరవం వుండి, అవగాహనతో మసలుకోవటం కుటుంబగౌరవానికి మొదటి మెట్టు. అభిప్రాయభేదాలు వుంటే గుట్టుగా తమలో తాము పరిష్కరించుకోవాలి తప్ప రచ్చ కెక్కకూడదు. ఒకరి బంధుమిత్రులను మరొకరు మర్యాదగా చూడడం, ఇరుపక్షాలతో ఆత్మీయభావంతో

మెలగడం రెండో మెట్టు. తమ పిల్లలను లక్షణంగా, క్రమశిక్షణతో తీర్చిదిద్ది, యితరులచే వేలెత్తి చూపించుకోకుండా జాగ్రత్తపడడం మూడో మెట్టు. ఆ బాధ్యత తల్లిదండ్రులదే గాని స్కూల్ టీచర్లది కాదు. పిల్లల కోసం తగిన సమయం కేటాయించక పోతే వాళ్లు తలవంపులు తేవడం, పరువు పోయిందనే వ్యథతో కుమిలిపోవడం మనశ్శాంతికి హాని కలిగిస్తుంది.

**4. మానసిక భద్రత :** భయానికి, బాధకు, సంతోషానికి.. అన్నిటికీ హేతువు మనస్సే. శ్రమించటం, తినటం, నిద్రించడం– మళ్ళీ ఇవే పనులు ప్రతి రోజూ సాగించడ మనేది ఒక రొటీన్. ఇలా భూమి మీద అనేక జంతుజాలాలు చేస్తూనే వున్నాయి. కానీ మనకు– వాటికీ మధ్య ఉన్న తేడా మనసు, బుద్ధి విచక్షణ. మనసు కారణంగానే మనిషికి అనుభూతులు కలుగుతాయి. ఎన్ని వున్నా అనుకున్నది లభించకపోతే మనసు బాధపడుతుంది. అందువలన మనసును అదుపులో వుంచుకోవాలి. మితిమీరిన ఆశ, నిరంతర అసంతృప్తి మనసును కష్టపెడతాయి. వాటి వలన మనసు వ్యాకుల పడుతుంది, ఆ కారణంగా శరీరం జబ్బు పడుతుంది. యితరులతో సంబంధాలు దెబ్బ తింటాయి. కొంతమంది పరిస్థితులతో సమాధాన పడలేక ఆత్మహత్య చేసుకోవడం కూడా చూస్తున్నాం. 'అనుకున్నామని జరగవు అన్నీ, అనుకోలేదని ఆగవు కొన్ని, జరిగినవన్నీ మంచికని అనుకోవడమే మనిషి పని' అనే కవివాక్యాన్ని గుర్తుపెట్టుకుని సమాజంతో, కాలంతో రాజీ పడడమే ఉత్తమమైన పని. మానసిక భద్రత లేకుంటే తక్కినవి ఎన్ని వున్నా వృథాయే.



**5. సామాజిక భద్రత :** మన చుట్టూ వున్న సమాజం భద్రంగా వున్నపుడే మనం మనుగడ సాగించగలం. చుట్టూ అల్లర్లు, ఆందోళనలు, నిరసనలు, పోరాటాలు జరుగుతున్నపుడు మన అస్తిత్వమే ప్రమాదంలో పడినప్పుడు, మన గురించి, మన కుటుంబం గురించి, మన ఆస్తిపాస్తుల గురించి, మన భవిష్యత్తు గురించి భద్రతాభావం ఎలా కలుగుతుంది? పైన చెప్పిన భద్రతా అంశాలన్నీ మనలో వున్నాయి కానీ సామాజిక భద్రతపై మనకు నియంత్రణ వుండదు కదా అనవచ్చు మీరు. ఒక



వ్యక్తిగా లేకపోవచ్చు, కానీ సామూహిక శక్తిలో భాగంగా వుంది. సమాజం అంటే మీరూ, నేనూ, అందరం. ఒక్కడి కోసం పదిమంది నిలిచి, పదిమంది కోసం ఒక్కడు నిలవవలసిన వాళ్లం. ఈ సమాజం కులాల మధ్య, మతాల మధ్య, ప్రాంతాల మధ్య, విద్వేషాల మధ్య చీలిపోకుండా, యుద్ధోన్మాదంతో నాశనమవకుండా చూడడం మన సామూహిక బాధ్యత. శాంతి, అభివృద్ధి పెనవేసుకుని వుంటాయి. ఒకటి వుంటేనే మరొకటి వుంటుంది. అభివృద్ధి ఫలాలు సమాజంలో అన్ని వర్గాలకు అందాలి. ధనిక, పేదల మధ్య అంతరం సాధ్యమైనంత తక్కువ వుండాలి. అప్పుడే సమాజంలో ఘర్షణ వాతావరణం అదుపు చేయగల స్థాయిలో వుంటుంది. నాయకులు స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజల్ని విడగొడదామని చూడవచ్చు. కానీ మనం వాటికి లొంగిపోకుండా 'అడుగడుగున గుడి వుంది, అందరిలో గుడి వుంది' అనే భావన పెంపొందించుకుని, సాటి మనిషిని గౌరవిస్తూ, ప్రేమిస్తూ సమాజం ప్రశాంతంగా, భద్రత సమకూర్చేట్లు చూడాలి. సామాజిక భద్రత లేనినాడు చిత్తశాంతి సమకూరడం కల్ల. ఆ భద్రతకై మనమందరం కలిసికట్టుగా శ్రమించాలి. ఆ దిశగా మనం యితరులను ప్రేరేపించాలి.

✡ ✡ ✡

**చివరగా...**

## మనిషి ఓ స్వేచ్ఛా విహంగంలా మారాలి!

మన మీద మనం గాని, ఇంకెవరి మీద నైనా గాని – మానసికంగా ఒక ముద్ర వేసే అలవాటు యికపై మానేసి చూద్దాం! ఇతరులపై లేనిపోని అంచనాలు వేసుకొనకూడదు. చుట్టూ పరిస్థితులను ఆకళింపు చేసుకుంటూనే మైండ్‌ను ఎప్పుడూ మెలకువగా, చేతనస్థితిలో ఉంచుకుంటే పరిసరాలపై నిఘా వుంటుంది. ఎవరినీ ఒక చట్రంలో బిగించాలని చూడకపోతే మన మెదడులోనే ఉన్న ఒక స్పేస్‌ను

గుర్తిస్తాం. అప్పుడు ప్రపంచం నిత్యనూతనంగా దర్శనమిస్తుంది. తద్వారా జీవితంలో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకునే మానవ సంబంధాలు క్రమేపీ మెరుగుపడడం ఎవరికి వారు గమనించవచ్చును. మనసులోని భావాలను మాటల్లో బహిర్గతం చేయక పోయినప్పటికీ ముఖంలో అది తప్పక ప్రతిఫలిస్తుంది. మనలోని ప్రేమను, కోపతాపాలను మన ఇంట్లో పెంపుడు జంతువులు సైతం ముఖం చూసి పసిగడతాయి! అలాగే ఎదుటి వారు మనం మౌనంగా ఉన్నా సులభంగా అంచనా వేస్తారని గమనించాలి. పైపై నటన మాని ప్రతి వ్యక్తీ నిజంగా అంతర్గత ప్రశాంతత కలిగి వుండాలి. మహా తత్త్వవేత్త శ్రీ జిడ్డు కృష్ణమూర్తి బోధనల్లోని **“స్వీయ పరిశీలనా జ్ఞానం”** ఫార్ములాను మనిషి తన స్వప్రయత్నంతోనే అలవర్చుకోవాలి.



మనల్ని పట్టి పీడిస్తున్న సమస్యలకు మన మానసిక స్థితితో బాటు సమాజంలోని వర్తమాన పరిస్థితుల సంక్లిష్టత కూడా కారణమే. అవి మన అదుపులో వుండవన్న విషయాన్ని గుర్తెరిగి వాటి పట్ల సాక్షీభావంతో వ్యవహరించడం చేతనే జీవితంలో నిశ్చలత, ప్రశాంతత సిద్ధిస్తాయి. ఈ పరమ సత్యాన్ని అర్థం చేసుకుంటే మనిషి చింతారహితంగా జీవించటమే గాక, తాను ఎంచుకున్న స్వధర్మయుతమైన వృత్తిలో శిఖరాగ్ర స్థాయికి చేరగలడు. ఇది సర్వతోముఖాభివృద్ధికి దారితీస్తుంది. ప్రపంచాన్ని గెలిచే కోరికకు బదులుగా, దానితో సమన్వయం చేసుకోవడానికి ప్రయత్నిస్తూ, తన స్వధర్మాన్ని తాను తెలుసుకుని, దానిలో ఉత్కృష్టస్థాయిని చేరుకోవడానికి చేసే ప్రయత్నం వలన తనకు మాత్రమే కాక, సమాజానికి కూడా మేలు కలుగుతుంది. అందుకే అందరూ స్వధర్మయోగులు కావాలని యీ పుస్తకం ఆకాంక్షిస్తోంది.

✡ ✡ ✡

KAPILA

# స్వధర్మపాలనకు కొన్ని దృష్టాంతాలు

'స్వధర్మయోగమ'నే యీ పుస్తకం చదివిన వారికి దీనిలో చెప్పిన సూత్రాలు ఆచరణయోగ్యమైనవేనా అనే సందేహం రావచ్చు. స్వధర్మాన్ని గుర్తించి, ఆ వృత్తిని చేపట్టి, పైన చెప్పిన సూత్రాలను ఆచరణలో చూపిన మహనీయులెందరో వున్నారు. వారిలో నాకు తెలిసిన కొందరి జీవనరేఖలను క్రింద యివ్వడం జరుగుతోంది. మీ దృష్టికి వచ్చిన యిటువంటి స్వధర్మయోగుల గురించి మాకు తెలియపరిస్తే మా మలి ముద్రణలో వారి జీవిత వివరాలనూ చేరుస్తామని మనవి.

## శ్రీ కె ఐ వరప్రసాద్ రెడ్డి



మొదటగా – స్వధర్మపాలనకు, ఈ పుస్తకంలో ప్రస్తావించిన అనేక అంశాలకు అడుగడుగునా ఉదాహరణగా చెప్పదగిన జీవితం శ్రీ కె ఐ వరప్రసాద్ రెడ్డి (శాంతా బయోటెక్నిక్స్) గారిది. వారిది పెద్ద కమతం వున్న వ్యవసాయ కుటుంబం. నెల్లూరు వద్ద ఒక పల్లెటూరిలో వున్న వారి కుటుంబంలో విద్య పట్ల ఆసక్తి చూపినవారు తక్కువ. అయితే వరప్రసాద్ చిన్నప్పటి నుంచి చదువంటే యిష్టం చూపడంతో తలిదండ్రులు ఆయన్ని ఆ దిశగా ప్రోత్సహించారు. తాముండే చోట సరైన విద్యావకాశాలు లేవని, చిన్న వయసు నుంచే నెల్లూరులో మేనమామ యింట వుంచారు. మేనమామ అతిక్రమశిక్షణతో పెంచినా ఆమోదించారు. మన పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే వారి ఆసక్తిని ముందుగానే గమనించి, దానికి తగిన వాతావరణం ఏర్పరచడానికి త్యాగాలు చేయాలని వారి తలిదండ్రుల నుంచి మనం నేర్చుకోవచ్చు.

నెల్లూరులో బి.ఎస్సీ చదువు పూర్తయాక, అప్పట్లో కొత్తగా వస్తున్న ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగులో చదివితే మంచిదని వారి పెద్ద మేనమామ సలహా యిచ్చారు. పెద్దలకు ముందుచూపు వుంటే పిల్లలకు ఎంత మేలు కలుగుతుందో యిది చెపుతోంది. ప్రస్తుతానికి డిమాండులో వున్న కోర్సే చేయమని యింట్లో పెద్దలు అప్పటికీ, యిప్పటికీ

పిల్లలను ఒత్తిడి చేస్తూంటారు. 30, 40 సంవత్సరాల తర్వాత గొప్ప డిమాండు వచ్చిన ఎలక్ట్రానిక్స్ శాఖ ప్రాముఖ్యతను ఆ రోజే గుర్తించిన పెదమేనమామ, ఆయన సలహా పాటించిన వరప్రసాద్ తలిదండ్రులు శ్లాఘనీయులు.

కానీ ఎలక్ట్రానిక్స్ యింజనీరింగు వారికి దరిదాపుల్లో లేదు. కాకినాడ ఇంజనీరింగు కాలేజీలో మాత్రమే వుంది. అక్కడకు పంపారు. ఎందుకంత వ్యయప్రయాసలు, ఒక్కడే కొడుకు కదా, చదివిన చదువు చాలు, వ్యవసాయం చూసుకోమనవచ్చు కదా అని కొందరు కుటుంబసభ్యులు వారించినా వరప్రసాద్ తండ్రి ఆ సాహసం చేశారు. అందుకే తమ కుటుంబంలో ఫస్ట్ జనరేషన్ ఎంటర్‌ప్రెనార్ ఆవిర్భవించడానికి కారకులయ్యారు. తలిదండ్రులు తమ కంఫర్ట్ జోన్ దాటి ఆలోచించాలని యీ ఉదంతం చెపుతోంది.

చదువు పూర్తయ్యాక వరప్రసాద్ హైదరాబాదులో డిఫెన్స్ లాబ్స్‌లో రాడార్ సైంటిస్టుగా చేరారు. కానీ తాము చేసే పరిశోధన ఫలితాలు దేశానికి ఉపయోగపడటం లేదని ఆయనకు తోచింది. ఆ అసంతృప్తితోనే ఉద్యోగం కొనసాగించి వుంటే, ఆయన ఆ సంస్థకు డైరక్టరుగా రిటైరయ్యేవారేమో కానీ ఎంటర్‌ప్రెనార్ అనే స్వధర్మం ఆయనను కుదురుగా వుండనీయలేదు. ఐదేళ్ల తర్వాత రాజీనామా యిచ్చి ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పోరేషన్‌లో చేరారు. ఎలక్ట్రానిక్స్ రంగంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఆర్థికసహాయం అందించే శాఖలో పని చేస్తూ, వారి కంపెనీల ఆర్థిక స్థితిగతులు అర్థం చేసుకోవాలంటే తనకున్న సాంకేతిక పరిజ్ఞానం సరిపోదనిపించి, ఉస్మానియా యూనివర్శిటీలో రాత్రి కళాశాలలో ఎంబిఏ చేశారు. నిరంతరం తన విద్యార్హతలను పెంచుకోవాలని, అవసరానికి తగినట్లుగా తనను తాను మలచుకోవాలని పైన చెప్పిన అంశానికి యిది ఒక ఉదాహరణ. ఈ విధమైన అప్‌డేషన్ వలన ఆయన తర్వాతి రోజుల్లో సొంత కంపెనీ పెట్టుకున్నపుడు ఆర్థిక లావాదేవీలను స్వయంగా పర్యవేక్షించే వెసులుబాటు కలిగింది. సాంకేతిక జ్ఞానపరంగా చూస్తే అప్పట్లో, 1980లలో కొత్తగా వస్తున్న కంప్యూటర్లను అధ్యయనం చేయడానికి ఆయన జర్మనీ వెళ్లి కొన్ని నెలలపాటు తర్ఫీదు పొంది రావడం జరిగింది. పునస్సమీక్ష, రిఫ్రెషర్ కోర్సుల గురించి పై అధ్యాయాలలో చెప్పడం జరిగింది కదా, అది ఆయన ఆచరణలో చేసి చూపారు.

ఏడేళ్లు అక్కడ పనిచేశాక రాష్ట్రప్రభుత్వ సంస్థల పనితీరు కూడా ఆయనకు నచ్చలేదు.

మరెవరైనా అయితే పరిస్థితులతో రాజీపడి, సర్దుకుని వుండిపోయేవారేమో. కానీ ఆయన స్వధర్మం ఆయనను పారిశ్రామికవేత్తగా మారమని ప్రేరేపించింది. తన 36వ ఏట వృత్తి మారారు. సాంకేతిక పరిజ్ఞానం బాగా వున్నా, ఆర్థికంగా బాగా నడవని హైదరాబాదు బ్యాటరీస్ లిమిటెడ్ అనే సంస్థలో భాగస్వామిగా చేరారు. లాభాల్లో ఉన్న సంస్థలో చేరడానికి ఎవరైనా ఉవ్విళ్లూరుతారు. కానీ నష్టాల్లో వున్న కంపెనీలో చేరడమంటే ఆ సంస్థ బలాబలాలను సరిగ్గా అంచనా వేసి, ఆత్మవిశ్వాసంతో, ఆశాభావంతో తీసుకున్న నిర్ణయమన్నమాట. ఆ కంపెనీ రక్షణరంగంలోని విమానాలకు కావలసిన బ్యాటరీలను స్వదేశీ పరిజ్ఞానంతో, మంచి నాణ్యతతో తయారు చేసేది. కానీ సరైన మార్కెటింగు లేక చతికిల పడింది. వరప్రసాద్ చక్కటి కమ్యూనికేషన్ స్కిల్స్‌తో, నిజాయితీ, పారదర్శకతలతో (వీటి ఆవశ్యకత గురించి కూడా ముందు అధ్యాయాలలో చెప్పాము) అందరినీ ఆకట్టుకుంటూ వ్యాపారాన్ని విస్తరింప చేశారు. విపరీతంగా శ్రమపడుతూ, నిరంతరం దేశవిదేశాలు పర్యటిస్తూ, దానికి అనుబంధంగా కొత్త కంపెనీలు కూడా స్థాపించారు. ఆయన మార్కెటింగు కౌశలాన్ని మెచ్చి, ప్రముఖ సంస్థలు అవార్డులు యిచ్చాయి.

అయితే ఆయన భాగస్వామిని నమ్మి చిక్కుల్లో పడ్డారు. ఆరేడేళ్లు గడిచేసరికి ఆ భాగస్వామి ఈయనను కంపెనీలోంచి బయటకు వెడలనంపాడు. ఇవ్వవలసిన సొమ్ము యివ్వలేదు. కోర్టుకి వెళితే ఆ డబ్బు చేతికి రావడానికి దశాబ్దాలు పట్టింది. ఇది కూడా ఒక గుణపాఠమే. కష్టపడడంతో బాటు సంస్థలో భాగస్వాముల పట్ల ఏమరుపాటుగా వుండకూడదని యీ ఉదంతం చెపుతోంది. 43 ఏళ్ల వయసులో రావలసిన డబ్బు రాక, తన భవిష్యత్తు, కుటుంబ భవిష్యత్తు ఏమిటో తెలియక అగమ్యగోచరంగా వున్న పరిస్థితిలో ఆయన అనుకోని పరిస్థితుల్లో జెనటిక్ యింజనీరింగు వైపు మళ్లారు. హెపటైటిస్-బి అనే కాలేయపు వ్యాధికి లభిస్తున్న విదేశీ జెనటిక్ టీకా హెచ్చు ఖరీదులో వుండి, మన దేశపు సామాన్యులకు అందుబాటులో లేదని, స్వదేశీ పరిజ్ఞానంతో దాన్ని తయారు చేసి, సొంత కర్మాగారంలోనే తయారు చేయిస్తే దేశప్రజలకు, ముఖ్యంగా పిల్లలకు ఎంతో మేలు జరుగుతుందని తలపోసి ఆయన ఆ దిశగా అడుగులు వేశారు.

ఆయన చదివినది, అప్పటిదాకా అనుభవం వున్నది ఎలక్ట్రానిక్స్ యింజనీరింగు. దానిలో ఆయన నిరంతరం తనను తాను మెరుగుపర్చుకుంటూ, తాజా సమాచారాన్ని

సేకరిస్తూ వచ్చారు. ఇప్పుడు ఎంచుకుంటున్నది, కొత్త రంగమైన జెనటిక్ యింజనీరింగు. కానీ దాన్నే తన స్వధర్మంగా మలచుకున్నారు. ఒకసారి ఆ నిర్ణయం తీసుకున్నాక యిక దాని గురించి అధ్యయనం చేసి, దానిపై పట్టు సాధించారు. సాంకేతిక విద్యలో ఒక విభాగంలో నైపుణ్యం సాధిస్తే, మరొక దానికి మళ్లడం మరీ అంత కష్టమేమీ కాదని యీ ఉదాహరణ నిరూపిస్తుంది.

అపరిచితమైన రంగంలోనైనా రాణించగలనన్న నమ్మకం ఆయనకు ఉండవచ్చు కానీ, ఆయనను చూసి పెట్టుబడి పెట్టడానికి వేరేవారికి కూడా వుండాలి కదా! ఈయన ఉద్యోగాలు మారినప్పుడు కానీ, వదిలేసినప్పుడు కానీ, యిప్పుడు కొత్త రంగంలోకి దిగుతానని అన్నప్పుడు కానీ ఆయన భార్య అభ్యంతరం చెప్పలేదు, అధైర్యపడలేదు. ఏ వ్యక్తియైనా కుటుంబసహకారం లేనిదే ముందుకు సాగలేడనే దానికి యీ విషయాన్ని ప్రస్తావించాలి. ఈ దశలో వరప్రసాద్ తండ్రి తన ఆస్తిలో కొంత అమ్మి, కొడుకు కొత్త ప్రయత్నానికి అండగా నిలిచారు. సంతానానికి ఏ దశలోనైనా తలిదండ్రుల సహకారం అవసరమని యీ ఉదాహరణ చెప్తుంది. ఆయన నిజాయితీని, శక్తిసామర్థ్యాలను దగ్గరనుంచి గమనించిన కొందరు మిత్రులు పెట్టుబడి పెట్టడానికి ముందుకు వచ్చారు. ప్రభుత్వసంస్థల నుంచి నిధులు రాకపోయినా, యీయన సదాశయాన్ని చూసి ముచ్చటపడి ఒమాన్ రాజవంశీకుడు తోడ్పాటు అందించారు. స్వదేశాభిమానంతో ఎందరో సైంటిస్టులు సహకరించారు. శాంతా బయోటెక్నిక్స్ ఆవిర్భవించింది. బాలారిష్టాలతోనే ముందుకు సాగింది. మంచి హృదయంతో, సదాశయంతో ఏదైనా కార్యం ప్రారంభిస్తే, విధి కూడా అనుకూలిస్తుందని శాంతా గాథ ద్వారా అర్థమౌతుంది.

నిజానికి జెనటిక్ విభాగంలో వరప్రసాద్ సైంటిస్టు కాదు. కానీ ఆయన సంబంధిత సైంటిస్టులను, పెట్టుబడిదారులను, ప్రభుత్వంలో చిత్తశుద్ధి వున్న అధికారులను, ప్రజల అవసరాల పట్ల అక్కర వున్న వైద్యులను ఒక్కచోటకు చేర్చి ఒక టీము లీడరుగా రాణించారు. సమాజం పట్ల ఆయన కనబరచిన సహానుభూతిని చూసి మీడియా హర్షించింది. అయితే తాము అమ్ముతున్న టీకా వెలలో పదో వంతు ధరకే అందిస్తానంటున్న యీ స్వదేశీ వాక్సిన్ పట్ల మార్కెట్ లీడర్‌గా వున్న విదేశీ కంపెనీ కత్తి కట్టింది. అవరోధాలు కల్పించింది, దుష్ప్రచారానికి పాల్పడింది. ఏం చేసినా, శాంతా బయోటెక్ వారి శాన్‌వాక్-బి వాక్సిన్ ప్రస్థానాన్ని అది అడ్డుకోలేక పోయింది.




భారతదేశపు స్వాతంత్ర్య స్వర్ణోత్సవ సందర్భంగా మార్కెట్లోకి అడుగిడిన తొలి భారతీయ అత్యాధునిక బయోటెక్ వాక్సిన్ భారతదేశాన్ని ఆ పరిజ్ఞానం తెలిసిన నాలుగు దేశాల సరసన కూర్చోబెట్టింది. మన జెనటిక్ వాక్సిన్‌లు ప్రపంచంలోని అనేక దేశాలకు ఎగుమతి కాసాగాయి. భారతీయ మేధపై ప్రపంచం దృష్టి పడేట్లా చేసింది. భారత బయోటెక్ రంగంలో విదేశీ పెట్టుబడులు రాసాగాయి. మన దేశంలో బయోటెక్ విప్లవానికి ఆవిర్భావం జరిగింది.

అయితే కథ అంత సాఫీగా జరగలేదు. స్వదేశీ వాక్సిన్ అంటే ప్రజలకు విశ్వాసం చిక్కలేదు, అసలు ఆ వ్యాధి అంటే ప్రజలకు అంత అవగాహన కూడా లేదు. వారిలో అవగాహన కలగడానికి, యీ వాక్సిన్ అంటే నమ్మకం చిక్కడానికి వైద్య సంఘాల సహకారం తీసుకోవలసి వచ్చింది. మాస్ వాక్సినేషన్ క్యాంపులనే కొత్త మార్కెటింగు విధానానికి శ్రీకారం చుట్టవలసి వచ్చింది. ప్రజల్లో దాని గురించి తెలిసివచ్చి, అందరూ టీకాలు వేయించుకునే సమయానికి పోటీదారులు మార్కెట్లో ప్రవేశించి ధర మరీ తగ్గించి వేశారు. అవగాహన పెంచడానికి పెట్టిన ఖర్చు శాంతాది, దానివలన కలిగిన లాభం అందరిదీ అయింది. ఈ సమస్యను ఎదుర్కోవడానికి శాంతా ఆ ఒక్క వాక్సిన్‌తోనే ఆగిపోకుండా అనేక వాక్సిన్‌లు, ఔషధాలు తయారు చేయసాగింది. మార్కెట్‌లో విజయం సాధించాక పరుగు ఆపితే, అలసత్వం చూపితే ప్రమాదమని, నిరంతరం ముందువరుసలోనే వుండాలని, యీ దృష్టాంతం చెప్తుంది.

దీనికి గాను శాంతాను ఆర్ అండ్ డి సంస్థగా తీర్చిదిద్ది, నిరంతర పరిశోధనే ప్రాణంగా, మూలాధారంగా, పైన చెప్పిన ప్రత్యేకాకర్షణ (యుఎస్‌పి)గా మలచుకుంది. ఆ పరిశోధనే, ఆ ప్రత్యేకాంశమే శాంతాకు విదేశీ పెట్టుబడులు వచ్చేట్లు చేసింది. ఒక దాని తర్వాత మరొకటి, రెండు విదేశీ ఔషధ సంస్థలు శాంతాలో షేర్లు కొని దాన్ని ఉన్నతస్థాయికి తీసుకెళ్లాయి. వరప్రసాద్‌కు కీర్తితో బాటు, శ్రమకు తగిన ఆర్థికలాభం కూడా సమకూరింది. మనం చేసే పనికి, నెలకొల్పిన సంస్థకు ప్రత్యేకత వుండి తీరాలని మాటిమాటికి నేను నొక్కి చెప్పడానికి కారణమిదే. వరప్రసాద్ విజయానికి మూలకారణం నాణ్యత పట్ల ఆయన నిబద్ధత. వ్యాపారవ్యవహారాలలో పారదర్శకత. అది అందరికీ ఆదర్శప్రాయం.

ఆయన సామాజిక స్పృహను, ముందుచూపును, ధైర్యసాహసాలను దేశం, ప్రపంచం హర్షించాయి. ఆయనకు, ఆయన సంస్థకు 300లకు పైగా అవార్డులు వచ్చాయి. నేషనల్ టెక్నాలజీ ఎవార్డు శాంతాకు రెండు సార్లు లభించింది. వ్యక్తిగతంగా 2005లో భారత ప్రభుత్వం వరప్రసాద్‌ను "పద్మభూషణ్"తో సత్కరించింది. వరప్రసాద్ గారి జీవనయానమంతా ఒడిదుడుకులతో, పోరాటాలతో, ప్రభుత్వంతో, విదేశీ శక్తులతో చేసిన ఘర్షణలతో నడిచింది. దీనిని ఆయన ఎలా తట్టుకున్నారు? యోగసాధనతో! కొంతకాలం వారికి యోగా టీచరుగా వుండే అదృష్టం నాకు దక్కింది. ఆ సమయంలో చూశాను – ఆయన ఎంత పట్టుదలతో సాధన చేస్తారో! క్రమశిక్షణ, సమయపాలన ఆయన ఆరోప్రాణం. ఎన్ని యిబ్బందులు వచ్చినా సాక్షీభావంతో వాటిని పరికించగల నేర్పు వారికి సొంతం. కళల పట్ల వారికి గల అనురక్తి, సంగీతసాహిత్యాలంటే విపరీతమైన మక్కువ, ఆయనను ఆందోళనల మధ్య సైతం చిదానందుడిగా, మూర్తీభవించిన ప్రశాంతతగా వుంచుతాయి. ముఖంలో ప్రసన్నత ఉట్టిపడుతూ వుంటుంది. ఆయనకు సమాజం పట్ల అనురక్తి ఎక్కువ. ఎన్నో ధార్మిక కార్యక్రమాలు, సమాజహిత కార్యక్రమాలు సంస్థ తరఫున, తల్లి, భార్య పేర నెలకొల్పిన ట్రస్టు ద్వారా చేస్తూ వుంటారు. నాపై గల నమ్మకంతో మన సంస్థ కెఎమ్ఆర్ఆర్ ఆవిర్భావానికి ఆయన వెన్నుదన్నుగా నిలవడం నాకు గర్వకారణం. 72 ఏళ్లు పూర్తి చేసుకున్న వయసులో కూడా ఆయన ప్రతిరోజూ రెండు గంటల పాటు వ్యాయామం చేస్తారని, దానిలో ఒక గంట యోగాకు, మెడిటేషన్‌కు కేటాయిస్తారమని అందరూ గమనించాలని నా కోరిక.

✡ ✡ ✡

## "పాపులర్ షూ మార్టు" అధినేత శ్రీ చుక్కపల్లి పిచ్చయ్య

**భవిష్యత్తు అవసరాలను గుర్తించడంలో నేర్పు:** గుంటూరు జిల్లా, తెనాలి సమీపంలో కంచర్లపాలెం గ్రామవాసి ఐన శ్రీ చుక్కపల్లి పిచ్చయ్య గారిది వ్యవసాయ కుటుంబం. ఉమ్మడి కుటుంబభారం దృష్ట్యా మరింత ఎదుగుదల కోసం వ్యవసాయ భూమిని అమ్మివేసి, వ్యాపారరంగంలో ప్రవేశించాలనే కొత్త ఆలోచన వచ్చింది ఆయనకు. సామాన్య ప్రజలకు పాదరక్షల వాడకం అతి తక్కువగా వుండే 1960 దశకంలో, "అభివృద్ధి పరిణామక్రమంలో పాదాల పరిరక్షణ కోసం గాని, నాగరికత రీత్యా గాని పెరిగే జనాభాతో పాటు పాదరక్షల వాడకం కూడా పెరిగి తీరుతుంది" అనే



ముందస్తు అంచనా వేసి 1962లో **"పాపులర్ షూ మార్టు"** పేరుతో విజయవాడలో హెడ్డాఫీసు పెట్టి తమ వ్యాపార కార్యకలాపాలను ప్రారంభించారు.

**భాగస్వామ్యం, సమిష్టి తత్త్వం, పర్యవేక్షణ :** తనతో పాటు పెట్టుబడి పెట్టినవారికి, ఏజెన్సీ బ్రాంచీల వీలు కల్పించి అనతికాలంలోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ముఖ్యపట్టణాలలో పాపులర్ బ్రాంచీలను అంచెలంచెలుగా విస్తరించారు. అందరి వాటాలు, లాభాలను సమీక్షించి, వారి నికర లాభాల నుంచి కొంత శాతాన్ని పునః పెట్టుబడిగా మలిపించారు. వందల మందిలో ప్రతి ఒక్కరూ సంస్థ నిర్దేశించిన విధానాలకు కట్టుబడి పనిచేసే సమిష్టితత్వాన్ని నిలబెట్టగలగటం పిచ్చయ్య గారి నిర్వహణా సామర్థ్యానికి గీటురాయి.

**ప్రగతి పథంలో పాపులర్:** రాష్ట్రంలో బాటా, కరోనా వంటి అగ్ర పాదరక్షల సంస్థలకు పాపులర్ షూ మార్టు గ్రూప్ సంస్థలు అనతికాలంలోనే గట్టి పోటీ ఇచ్చే స్థాయికి ఎదగటం విశేషం. ఈ రంగంలో ఔత్సాహికులను ప్రోత్సహించారు. దక్షిణాదిన ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ ప్రధాన కేంద్రంగా పాదరక్షల వ్యాపారరంగ విస్తృతికి దోహదపడ్డారు. వృత్తిలో మార్కెట్‌కు పోటీగా అధునాతన మెళకువలు తెలుసుకునేందుకు బ్రాంచీలను సదా అప్రమత్తం చేసేవారు. ప్రతి సంవత్సరం బ్రాంచీ మేనేజర్లకు సరైన ప్రణాళికలతో లక్ష్యాలను నిర్దేశించటం/ ఎప్పటికప్పుడు అన్ని శాఖల్లోని తప్పుఒప్పులను సమీక్షించుకొని, క్రమశిక్షణతో చక్కదిద్దుకునే స్వాధ్యాయ పద్దతిలో ఆత్మపరిశీలనా పద్ధతిని అమలు చేయటం వలననే ఇది సాధ్యమయింది.

**సంస్థలోని ఉద్యోగులకు నిరంతర శిక్షణలు :** పాదరక్షల తయారీ విభాగంలోను, పాపులర్ షోరూమ్‌లలోను పనిచేసే ఉద్యోగులందరికీ ప్రతి 3 సంవత్సరములకు ఒకసారి, సంస్థ ఖర్చులతో వారిని బ్యాచ్‌ల వారీగా హెడ్డాఫీసుకు రప్పించి, తనతో పాటు కొందరు వృత్తినిపుణుల పర్యవేక్షణలో సిబ్బంది యొక్క ఆరోగ్య పరిరక్షణ, కుటుంబ నియంత్రణ, వృత్తి నైపుణ్యం, ఆర్థికపరమైన కట్టుబాట్లు నేర్పే శిక్షణా తరగతులను నిర్వహించారు. మనోవికాసం కోసం భూమి పుట్టుక నుంచి నేటి నవనాగరిక

సమాజం వరకు మానవ పరిణామక్రమం, సమాజంలో సరుకుల ప్రభావం, ఆర్థిక వనరులు, సంక్షోభాలు, గతితార్కిక భౌతికవాదం లాంటివి బోధించుతూ, నిర్మాణాత్మకమైన జీవన శైలి వల్ల పొందగలిగే సుఖశాంతులేమిటో బోధనలలో పొందుపరిచారు. 1972, 75లలో ఈ శిక్షణా శిబిరంలో నేను యుక్తవయసులోనే పాల్గొని ఎంతగానో ప్రభావితుడ నయ్యాను.

పాపులర్ సంస్థలోని అనేక స్థాయిల్లో హెడ్డాఫీసు సిబ్బందికి, షాపుల్లో సేల్స్‌మెన్‌లకు ప్రతి ఏటా వ్యక్తిత్వవికాసం, అమ్మకాలను పెంచగలిగేందుకు కావలసిన నేర్పు-ఓర్పులను రిఫ్రెషింగ్ శిక్షణలుగా నిర్వహించారు. తద్వారా కనీస చదువులతో పాపులర్ సంస్థలో చేరిన అనేకానేకమంది ఉద్యోగులకు తమ వృత్తిలో, పనిలో, నైపుణ్యం మెరుగుపడింది. సంస్థలో యావన్మందినీ దురలవాట్లకు దూరం చేయించారు. తమ పనిలో ప్రతిభ చూపిన వారికి, కుటుంబ నియంత్రణ పాటించిన వారికీ ప్రోత్సాహక బహుమతులు అందించారు. వర్కర్లలో లలితకళలను గుర్తించి వారిచే తరచూ చక్కని వినోద కార్యక్రమాలు నిర్వహించేవారు. తద్వారా వారిలో సామరస్యం పెరిగి, పని వాతావరణం ఆహ్లాదంగా మారింది.

**వృత్తిలో కౌశలం - సమాజం పట్ల బాధ్యత :** 'ఏ పని చేసినా మంచి ఒడుపుగా చేయటం పనిమంతుడి లక్షణం'గా చెప్పేవారాయన. సంస్థ అధినేత పాత్రలో కూడా సిబ్బందితో పాటు తానూ సమయపాలన, స్వీయ క్రమశిక్షణ పాటించటం పిచ్చయ్య గారి స్వధర్మ సూత్రం. పాపులర్‌లో నేను పని చేసిన నాటి రోజుల్లో మంచి salesmanship ప్రదర్శించినందుకు, ఉత్తర-ప్రత్యుత్తరాలలో చూపిన దక్షతను ఉద్దేశించి- నేను పాపులర్ నుండి బయటకు వచ్చిన 16 సంవత్సరాల తర్వాత కూడా గుర్తుంచుకొని, అభిమానంతో 1997 ఆగష్టు 15న పాపులర్ ట్రస్టు జరిపిన స్వాతంత్ర్య స్వర్ణోత్సవ సభకు నన్ను ముఖ్య అతిథిగా ఆహ్వానించటం వారి ఔన్నత్యానికి నిదర్శనం. 55సంవత్సరాలకు పైబడిన సుదీర్ఘ వ్యాపార ప్రయాణంలో, మార్కెట్ పోటీలను, ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంటూనే తమ వ్యాపార నైతిక సిద్ధాంతాలకు కట్టుబడి ఉండగల్గటం పిచ్చయ్య గారి ఘనత. తాను ఏ వృత్తిలో అడుగు పెట్టి అభివృద్ధి సాధించారో అదే రంగంలో నవ్యతను రంగరిస్తూ కడదాకా ప్రయాణం సాగించారు

తప్పు, అధిక లాభాలను త్వరితంగా సంపాదించిపెట్టే ఏ ఇతర వ్యాపారాల వైపూ ఆకర్షితుడు కాలేదు. అది ఆయన చూపిన స్వధర్మ ఆచరణగా పేర్కొనవచ్చును.

**సమాజానికి తిరిగి చెల్లించే** సిద్ధాంతాన్ని విశ్వసించిన శ్రీ పిచ్చయ్య దానిని త్రికరణ శుద్ధిగా అమలుచేశారు. ప్రభుత్వాలకు వాణిజ్య పన్నులు సక్రమంగా చెల్లిస్తూనే, పోటీగా వృత్తిలో దిగిన కొత్తవారికి కూడా స్పర్ధ లేకుండా ఆలంబనగా నిలిచేవారు. తన పాదరక్షల వ్యాపారలాభాల నుంచి కొంత భాగం డబ్బును కేటాయించి జన్మభూమి గ్రామంలో నిరాధార వృద్ధుల కుటుంబాలకు నెలసరి ఆర్ధికసాయం, ఉచిత బియ్యం పంపిణీ చేసేవారు. పాపులర్ సంస్థ నిలద్రొక్కుకున్నప్పటి నుండి దేశంలో ఏ రాష్ట్రంలో నైనా ప్రకృతి విపత్తులకు భారీగా నష్టపోయిన వరద, అగ్ని, తుఫాను బాధితులకు తమ వంతు సామాజిక బాధ్యతగా లక్షల కొద్దీ విరాళాలను ఆయా ప్రభుత్వాలకు అందిస్తూ వచ్చారు. కప్పుకునే దుప్పటి లేక వీధి ప్రక్కన కాళ్ళు ముడుచుకొని, చలితో వణుకుతూ నిద్రించే బిచ్చగాళ్లకు అర్ధరాత్రి పూట చడీచప్పుడు లేకుండా తమ సిబ్బందిని చలి రగ్గులను కప్పి రమ్మనేవారు. కీర్తిప్రతిష్ఠలతో ప్రమేయం లేకుండా, అవసరంలో వున్న సాటి మనిషికి వారు చేసిన నిశ్శబ్దసాయమది.

**వృత్తిలో సంక్షోభాలను ఎదుర్కొన్న తీరు:** వ్యాపారంలో పొందిన వార్షికలాభాలలో సమాజానికి కొంత కేటాయించగా మిగిలిన వాటానే నికర లాభంగా లెక్క వేయాలనే సూత్రానికి ఏజెన్సీ దారులు మొదట్లో సమ్మతించినప్పటికీ కాలానుగుణంగా పెరుగుతున్న అధిక లాభాలను ఇలా దాతృత్వానికి కేటాయించడం ఇష్టం లేని కొందరు సంకుచిత వాదులు, గూడుపుఠాణి చేసి తమ షాపులకు సొంత బోర్డులు తగిలించి ఎదురు తిరిగారు. సొంత సంస్థలో కార్మికుల సమ్మె సరుకు తయారీకి అవాంతరం తెచ్చింది. సజావుగా నడిపిస్తున్న వృత్తిలో సంకట పరిస్థితి ఎదురై భారీగానే నష్టం వాటిల్లినది. ఆర్జన పెరిగే కొద్దీ సమస్యలూ పెరుగుతుంటాయనే సత్యాన్ని ఈ సంక్షోభాల ద్వారా అర్థం చేసుకొని, సంస్థను తిరిగి సంక్షేమపు దారిన నడిపించి పాపులర్ షూ మార్టు ప్రగతిని అప్రతిహతంగా నిలబెట్టగలగటం వారి దార్శనికతకు, చాకచక్యానికి నిదర్శనం.

**ప్రజా చైతన్యం కోసం రచనలు చేయడం వారి ప్రవృత్తి:** గొప్ప వ్యక్తుల నుండి తెలుసుకున్న సత్యాలు సహజంలో సూక్తులుగా, సుద్దులుగా మిగిలిపోతుంటాయి. క్లిష్టమైన విషయాలను శ్రీ పిచ్చయ్య ప్రతి ఒక్కరికీ అర్థమయ్యే సులభశైలిలో వివరించి,

ఆలోచింపజేసే చిన్న పుస్తకాలగా వ్రాసేవారు. వాటిని ముద్రించి తమ షాపులకు వచ్చే కష్టమర్లకు ఉచితంగా అందించి లక్షలాది మంది అభిమానానికి పాత్రులయ్యారు. "ఆలోచించండి - ఆచరించండి", "సరుకులు-సామాజిక బాధ్యత", "వ్యవస్థలో అవస్థలు", "నమ్మకాలు- నిజాలు", "చైతన్యానికి అవసరమైన అంశాలు", "పార్టీల దామాషా ఓటింగు పద్ధతి" వంటి అనేక అభ్యుదయ భావజాల పుస్తకాలు 1.73 కోట్ల వరకు పాపులర్ షాపుల ద్వారా రాష్ట్రం నలుమూలలా పంపిణీ చేయబడ్డాయి.

జస్టిస్ కృష్ణయ్యర్ లాంటి పెద్దలు "ఈ దేశానికి ఎందరో పిచ్చయ్యలు కావాలి! వృత్తి, వ్యాపారం సమాజంతోనే ముడిపడి వున్నాయి. కేవలం సంపదను ప్రోగు చేసుకోవటమే లక్ష్యంగా పెట్టుకున్న బడా పెట్టుబడిదారులు సమాజ శ్రేయస్సును మరుస్తున్నారు. పిచ్చయ్య గారు వ్యాపారాన్ని-సమాజాన్ని సమాన బాధ్యతగా స్వీకరించారు" అని ప్రశంసించారు.

**మానవీయ కోణం : ఫేస్‌బుక్** అధినేత మార్క్ జుకర్‌బెర్గ్ తనకు కూతురు పుట్టిన ఆనందంలో ఆమెపై ప్రేమకు చిహ్నంగా తన వ్యాపారాదాయంలో 45 బిలియన్ డాలర్ల ధనాన్ని సమాజానికి పంచుతున్నట్లు వెల్లడించిన దాతృత్వ ప్రకటన ప్రపంచ ప్రజలను అబ్బురపరిచింది. ఎందరో కొందరు ఏదో ఒక స్ఫూర్తితో - తాము సంపాదించిన ఘన సంపద నుండి మానవతా దృక్పథంతో తరచు దీనులకు సాయపడుతుండటం హర్షణీయమే! అయితే, సంపద ఆర్జించే క్రమంలోనే శ్రీ పిచ్చయ్య ప్రకృతి వైపరీత్య బాధితులను ఆదుకోవటానికి నడుం కట్టడం గమనార్హం. తన వృద్ధాప్యంలో సంక్రమించిన కాన్సర్ జబ్బు రీత్యా కొన్నాళ్ళు శారీరకంగా బాధపడ్డారు గాని- మానసిక నైరాశ్యానికి మాత్రం గురికాలేదు. కారణం - ఏ వృత్తిలో వారికైనా ప్రకృతి, సమాజం నుండి అందిన సహజవనరులే ఆధారభూతం గనుక, సొంత లాభం, కుటుంబ క్షేమం, వ్యాపార విస్తరణలతోనే ఆగిపోలేదు. ప్రత్యుపకారంగా సమాజ శ్రేయస్సుకు- నేను సయితం అంటూ ముందుకు వచ్చిన ఆయన ధన్యజీవి.

వృద్ధాప్యంలో, మరణమాసన్నమైన సమయంలో కూడా తన మానవీయకోణానికి నిదర్శనంగా పిచ్చయ్య గారు 'న భూతో..' అనే ఔదార్యం చూపారు. తమ పాపులర్ సంస్థ అభివృద్ధిలో గత 48 సంవత్సరాలుగా అనేక శాఖల్లో పాలుపంచుకొని, సేవలందించిన ప్రస్తుత, పూర్వ సహచరులు, హెడ్డాఫీసు సిబ్బందిలో పాత, కొత్త

వారు, సంస్థ బ్రాంచీలలో సేవలందించిన జూనియర్లు, సీనియర్లు ప్రతి ఒక్కరి అడ్రస్‌లను సేకరించి వారికి పనిచేసిన సంవత్సరానికి వెయ్యి రూపాయల చొప్పున నగదు పారితోషికాలను అందజేసి తన కృతజ్ఞతను చాటుకున్నారు. అలా అందుకున్నవారిలో ఆయన సంస్థలోనుండి బయటకు వచ్చి పోటీ సంస్థలు పెట్టినవారు కూడా ఉన్నారు! మనకు తెలిసి ఇంతటి కృతజ్ఞతా ధర్మాన్ని చూపిన వ్యాపారవేత్తలు ఎల్లెడలా వెతికి చూసినా దొరకని పరిస్థితి. ఏదీ శాశ్వతం కాదు అని అందరూ చెప్తారు కానీ ఆయన చేతల్లో చూపారు. తన జీవనగమనంలో నమ్మిన వృత్తి, సిద్ధాంతాలకు ముమ్మాటికీ కట్టుబడి, తన సాహితీ అభిలాషతో ప్రజలను పాపులర్‌కు ఇష్టులైన కష్టమర్లుగా మలచుకున్న మేధావి ఆయన. పాదరక్షల వృత్తిలో విజయ పతాకాన్ని ఎగరేసి, తన సాహితీ ప్రవృత్తి ద్వారా జన సామాన్యుల ఆలోచనల్లో చైతన్యానికి శ్రీకారం చుట్టి, మానవీయ కోణంలో సైతం మెట్టు మెట్టుకూ ఎదిగి, మట్టిలో కలిసిపోయే ఒట్టి మనిషిని కాదని నిరూపించిన ధన్యజీవి చుక్కపల్లి పిచ్చయ్య గారు 2012 మే నెల 24 న గతించారు.

✡ ✡ ✡

## శ్రీ సురేష్ చుక్కపల్లి

మెకానికల్ ఇంజినీరింగ్ చదివిన శ్రీ చుక్కపల్లి సురేష్ గారిది వ్యాపార నేపథ్యం కలిగిన కుటుంబం. తండ్రి గారి ఆధ్వర్యంలోని పయనీర్ ఆటోమొబైల్ (గుంటూరు) ద్వారా వృత్తిలోని అనుభవ సూత్రాలను ఆకళింపు జేసుకొని 'ఫీనిక్స్ రియల్ ఎస్టేట్ సంస్థ'ను స్థాపించి వినూత్న ప్రణాళికలతో వ్యాపార రంగంలో యుక్త వయసులోనే "పయనీర్" అయిన తీరు ఆసక్తికరం, అభినందనీయం. యువతకు ఆదర్శం.



**వ్యాపార రంగంలో తొలి అడుగు :** 1985-86లో హైదరాబాద్ కేంద్రంగా ఒక క్రొత్త కాపర్ ఇండస్ట్రీని నెలకొల్పాలని తలపెట్టిన సన్నిహితులతో అనివార్య పరిస్థితిలో మేనేజింగ్ పార్టనర్‌గా చేతులు కలపటం, గుత్తి పట్టణంలో ప్రారంభించిన వారి జర్మన్ టెక్నాలజీ ఫెయిల్ అయ్యి, కోలుకోలేని స్థితిలో ఆ పరిశ్రమ కుంటుబడటం వెంటవెంటనే జరిగాయి. రెండు సంవత్సరాలు తీవ్ర సంక్షోభానికి గురి అయ్యారు.

రాజధాని వరకూ వచ్చి ఇక వెనక్కి తగ్గే యోచన లేని సురేష్ కొత్త దారి చూసుకోవాలనే ప్రయత్నంలో, గుంటూరు నుంచి పదోన్నతిలో రాజధానికి మారిపోయిన ఐఏఎస్ ఉన్నతాధికార మిత్రుల సాంగత్యాన్ని స్నేహంగా మలచుకోవటంలో నెగ్గారు. తను చదివిన మెకానికల్ ఇంజినీరింగ్‌కు ఏ సంబంధం లేని రియల్ ఎస్టేట్ రంగంలో అడుగు పెట్టే సందర్భం ఎదురైంది. అదే స్వధర్మంగా ఆయన గుర్తించడంతో ఆ రంగంలోనే రాణించారు.

అమీర్‌పేట పరిధిలోని సుల్తాన్ స్కూల్ ప్రాంగణాన్ని కోర్టు తీర్పుతో ఖాళీ చేయించుకున్న స్థలం యొక్క హక్కుదారులు అక్కడ అపార్టుమెంట్‌లు కడతామని తలపెట్టారు కానీ ఆ భారీ పెట్టుబడికి తాము సొంతంగా రిస్కు చేయలేని పరిస్థితిలో పడ్డారు. అది తెలుసుకుని శ్రీసురేష్ ఆ అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు. గుంటూరు పయనీర్ ఆటోమొబైల్ నాటి నుంచీ బ్యాంకు ఆఫ్ బరోడాతో తమకున్న మంచి వ్యాపార పరపతిని బట్టి యునైటెడ్ కనస్ట్రక్షన్స్ పేరుతొ సదరు బ్యాంక్ నుండి ఋణసౌకర్యం పొంది, 50 అపార్టుమెంట్లను సకాలంలో చక్కగా నిర్మించి సురేష్ తన ప్రతిభను, చిత్తశుద్ధిని నిరూపించుకున్నారు. నూతనోత్సాహంతో, రియల్ ఎస్టేట్ నిర్మాణ రంగంలో పెద్ద రిస్కులను సయితం సవాలుగా తీసుకొని, సోమాజిగూడలోని లేక్ షో టవర్సు లాంటి పెద్ద ప్రాజెక్టులు వైపు కూడా విస్తరించటం జరిగింది.

మౌలిక పెట్టుబడి, ఋణ సదుపాయం, అనుభవం, నిర్వహణా సామర్ధ్యంతో పాటు చేసే వృత్తిలో ఇష్టత, నిబద్ధత చూపే తత్త్వం వున్న శ్రీ సురేష్ ల్యాంకో వంటి బహుళ ప్రాజెక్టుల నిర్మాణ సంస్థలో వారి పిలుపు మేరకు చేరి, సహ–చైర్మన్ గా 14 సంవత్సరాల పాటు తన సేవలందించారు. ప్రధాన భాగస్తుడైన చైర్మన్ రాజకీయ రంగంలోకి మారటం చేత, తాను కూడా ల్యాంకో సంస్థ నుండి బయటికి రావాల్సిన పరిస్థితి ఎదురైంది. కథ మళ్ళీ మొదటికొచ్చింది. ఇలా రెండున్నర దశాబ్దాల పాటు రియల్ ఎస్టేట్ రంగంలో ఎన్నెన్నో ఆటుపోట్లను ఎదుర్కొంటూ వస్తున్న క్లిష్ట తరుణంలో తన సొంత గూటికి చేరి, మేధోమధనం చేసుకున్న దరిమిలా– సురేష్ దృష్టి స్వయం ప్రతిపత్తి వైపు మరలింది. ఇలాంటి స్వేచ్ఛాస్వతంత్రత కలిగిన సమున్నత ఆలోచనా (మేధో)పటిమకు స్వధర్మ స్ఫూర్తి తోడై, భవిష్యత్ కార్యాచరణను మలిచిందనవచ్చు.

**PHOENIX గ్రూప్ విశ్వరూపం :** అన్నీ తానై Phoenix రియల్ ఎస్టేట్ డివిజన్ పేరుతో వ్యాపార రంగాన్ని పలు రకాలుగా విస్తరింపజేసి, రెండు తెలుగు రాష్ట్రాలలో బహుళ నిర్మాణ రంగ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు సురేష్. తన పూర్వానుభవాన్ని నేర్పుగా మేళవించి గోల్ఫ్ EDGE నుండి IT SEZ, రిటైల్, కమర్షియల్, హాస్పిటాలిటీ స్థాయిల వరకు సమధికోత్సాహంతో వ్యాపారాన్ని కోట్ల టర్నోవర్లతో విజయపథంలో నడిపించారు. బిజినెస్ మాగ్నెట్‌గా వెలుగొందారు. హైదరాబాద్‌లోని 100 VIPల జాబితాలో ఆయన పేరు చోటు చేసుకోవటం గొప్ప విశేషం. అంతేగాక, దార్శనికతతో ప్రపంచస్థాయి విద్యావ్యవస్థ, ఆరోగ్య ప్రణాళికలు కూడా రూపకల్పన చేయటం ఆయన అభ్యుదయ భావానికి ప్రతీక. అన్నింటిలోనూ ఆధునికత, సాంకేతికతలను జోడిస్తూ, ప్రతిభావంతులకు యితోధిక ఉద్యోగావకాశాలను కల్పిస్తూ, వారికి గ్రూప్ ఇన్సూరెన్స్ కల్పిస్తూ, వ్యాపారనిర్వహణలో ఉన్నత ప్రమాణాలను ప్రతిష్ఠించి మన్ననలు పొందారు. తమ సంస్థలలో రిఫ్రెషింగ్ కోర్సులను ప్రవేశపెట్టి అన్ని స్థాయిల్లోని కార్మికులు, ఉద్యోగులకు వారి వృత్తికౌశలాన్ని పెంచడంతో బాటు అనుబంధంగా వ్యక్తిత్వవికాసం, కార్పొరేట్ యోగ శిక్షణా శిబిరాలను తరచూ నిర్వహిస్తుంటారు. ఆచరణలో వాటి ఫలితాలు ఎలా ఉన్నవో స్వాధ్యాయంతో గమనిస్తారు కూడా.

**వృత్తి కౌశలం, కుటుంబ సంస్కృతి మేళవింపు :** నేటి సమాజంలో ఎంతోమంది ప్రముఖులు వృత్తినీ, కుటుంబాన్నీ సమతూకం చేయటంలో విఫలంకావటం గమనిస్తుంటాము. సురేష్ గారి కుటుంబ శైలి అందుకు పూర్తిగా భిన్నం. ఆయన అన్నదమ్ములు ముగ్గురూ కుటుంబ సంప్రదాయాలకు ఇంటా బయటా విలువిచ్చేవారే! ఇంట్లో వుండగా వ్యాపార వ్యవహారాలను చర్చించరు. వారి కుటుంబాలలో సఖ్యత, అన్యోన్యత ముచ్చట గొలుపుతాయి. పెద్దవాళ్ళు తమ పిల్లలతో స్నేహభావంతో మెలగుతూ, ఎన్ని వ్యాపారపరమైన ఒత్తిళ్లు ఉన్నా వారికోసం రోజూ తగు సమయం కేటాయించటం ఉత్తమ తరహా పెంపకానికి నిదర్శనం. అటువంటి కుటుంబవారసత్వం కారణంగా సంతరించుకున్న వారిప్రస్తుతతరానికి కూడా అదే బాటలో వినయసంస్కారాలు అబ్బటం సహజమే కదా!

**సంఘం శరణం గచ్ఛామి** అనే గౌతమ బుద్ధుని సిద్ధాంతం పట్ల అపారవిశ్వాసం వున్న చుక్కపల్లి సోదరులు, Phoenix ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి, వందలాది మంది నిరుపేద విద్యార్థులకు విద్యాదానం చేయటమే గాక, వారి కుటుంబాలకు జీవిత బీమా సదుపాయం కూడా కల్పించారు. వృత్తిని సమాజాన్ని కవలలుగా చూసే స్ఫూర్తి వారికి వ్యాపారంలో సహజంగా కలిగే మానసిక ఒత్తిడిని మటుమాయం చేసింది. హరితవనం ప్రాజెక్ట్ ద్వారా వేల మొక్కలను సంస్థ సిబ్బందితో నాటింప జేసి, పర్యావరణ పరిరక్షణలో కూడా తమ వంతు పాత్ర పోషించారు. సమాజంలోని అనేక ధార్మిక సంస్థలలోని ఎన్నో గౌరవ పదవులు శ్రీ సురేష్‌ను వరించాయి. వాటిలో ప్రముఖమైనది Honorary Consul General of the Republic of Korea, Telangana!

**జన్మభూమికి, కర్మభూమికి సేవ:** తమ స్వగ్రామమైన తెనాలి సమీపం లోని కంచర్లపాలెం గ్రామవాసుల ఆరోగ్యసంరక్షణ నుద్దేశించి ల్యాంకో వారి సౌజన్యంతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రతిష్టింపజేసి, ఇంటింటికీ **"శుద్ధి చేసిన ఉచిత మంచినీరు"** ప్రతి నిత్యం అందేలా సహకరిస్తున్నారు. కర్మభూమి ఐన హైదరాబాదులో హైటెక్ సిటీ నడిబొడ్డున నాటక, సంగీత, నాట్య కళలకు వేదికగా ఎత్తయిన, సువిశాలమైన స్థలంలో, Phoenix Arena పేరుతో సుందరమైన పార్కు ను నిర్మించారు. నగర పౌరులతో పాటు పరిసర ప్రాంతాల ఉద్యోగులెందరికో ఈ పార్కు ఓ ప్రశాంతవనంగా ఉపయోగపడుతోంది.

**మహా ప్రస్థానం ఓ మహా నీరాజనం:** చేపట్టిన వృత్తిమార్గంలోనే ఎవరైనా కూడా కొంత సామాజిక సేవ చేయొచ్చు అని నిరూపించారు సురేష్. కావాల్సిందల్లా మంచి దృక్పథం మాత్రమే. ఘనంగా బతికినా బతకకపోయినా, యీ భూమి నుంచి హుందాగా నిష్క్రమించాలని మాత్రం ప్రతి ఒక్కరి మనసులోనూ ఉంటుంది. తన తండ్రి గారి అంత్యక్రియల్లో జరిగిన చేదు అనుభవంతో ఈ సత్యాన్ని గుర్తెరిగిన సురేష్, ఒక ఐఏఎస్ మిత్రునితో సంప్రదించి హైదరాబాద్‌లో విస్పర్ వ్యాలీ సమీపంలో గల స్మశానవాటికను తొలి నమూనాగా చేపట్టి, తమ రియల్ ఎస్టేట్ నిర్మాణ పరిధిలో సొంత ఖర్చుతోనే అక్కడ పచ్చదనం సృష్టించి, ఆధునీకరించటానికి అనుమతి పొందారు. సదరు వాటిక పనుల మీద ఆధారపడిన కాపరులను, కొందరు స్థానిక పెద్దల వ్యతిరేకతను సముదాయింపు చేయటం కష్టమైంది. ఇంకొందరు మూఢనమ్మకాలకు

ముడిపెట్టి స్మశానవాటిక నిర్మాణపు పనులు తనకే కీడు అవుతుందని భయపెట్టారు. అయినా పట్టుదలతో కార్యరంగంలో దిగి షుమారు 3 కోట్ల రూపాయలు వెచ్చించి ఆ స్మశానవాటికను చక్కదిద్ది, చక్కని పచ్చదనం సృష్టించి, అన్ని హంగులు, సౌకర్యాలతో పునర్నిర్మాణం గావించి, **మహా ప్రస్థానం**గా పేరు పెట్టారు.

దీనికి ఉప రాష్ట్రపతి శ్రీ వెంకయ్య నాయుడు ప్రారంభోత్సవం చేయటం, రాష్ట్ర మంత్రులు హాజరు కావటం, అక్కడే ఓ బహిరంగ సభ కూడా జరగటం యాదృచ్ఛికంగా జరిగిపోయాయి. ఒక మంచి ఆశయానికి మంచి ఆదరణ లభిస్తుందనే సురేష్ నమ్మకం ఈ విషయంలో రుజువయ్యింది. అతి సామాన్యుల దగ్గర నుంచి విఐపిల వరకు ఎవ్వరి నుంచి ఫోన్ కాల్ వచ్చినా శరవేగంతో స్పందించి, వాహన సదుపాయం సమకూర్చి, అంత్యక్రియలను సజావుగా జరుపుకునే సౌలభ్యాన్ని కల్పిస్తున్నది ఈ మహా ప్రస్థానం యంత్రాంగం. రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాల నుంచి అనేక స్మశానవాటికలకు "మహా ప్రస్థానం" తరహాలో రూపురేఖలు మార్చమని కోరుతూ సురేష్‌కు కొత్త నిర్మాణపు కాంట్రాక్టులు రావడం మరో విశేషం. ఈ వరవడిలో వివిధ పట్టణాలు, మండలాలలోని పెద్దలు కూడా 'మహా ప్రస్థానం' వంటి నిర్మాణాలను స్థానికంగా ఏర్పాటు చేసుకొని, తమ స్మశానవాటికలను పచ్చదనంతో, సౌకర్యవంతంగా మెరుగుపర్చుకుంటున్నారు. శ్రీ సురేష్ చుక్కపల్లి తన స్వీయవృత్తిని సమాజ శ్రేయస్సుతో మిళితం చేసిన తీరు యావత్తు ప్రజాబాహుళ్యానికి ఎంతటి స్ఫూర్తి నిచ్చిందో గమనించ వచ్చును. ఇలా భిన్నమైన మార్గం తొక్కడం చేత తాను నష్టపోయింది లేదు సరికదా మరెంతో పేరు, ఆదరణ, నిర్మాణపు అవకాశాలు కూడా కలిసొచ్చాయి అనే సత్యాన్ని అందరం గుర్తించాలి.

✡ ✡ ✡



## శ్రీ గాలి శేఖర్ బాబు

ప్రొటెక్టివ్ పాకింగ్ ప్రోడక్ట్స్ పేరుతో 1993లో తెనాలి దగ్గరలోని స్వగ్రామంలోనే సామాజిక అవసరానికి ముడిపెడుతూ ఒక సంస్థ స్థాపించి విజయవంతంగా నిర్వహిస్తున్న శ్రీ గాలి శేఖర్ బాబు (వయసు 54) గారి స్వగతం – 'నేను ఎటువంటి ఉద్యోగం చెయ్యలేదు. ఆత్మగౌరవంతో ఎవరి కింద పని చేయకూడదనుకుంటూ




డైరక్టుగా వ్యాపారంలోకి దిగాను. పర్యావరణ రక్షణలో భాగంగా, సామాజిక అవసరం ప్రాతిపదికగా, పనికిరానివని పారేసిన వాటిని ఉపయోగించి సంపద సృష్టించడంతో బాటు వినియోగదారుడికి లాభదాయకంగా ఉండాలనే ఆలోచనతో వ్యాపారం ప్రారంభించాను. తొలినాళ్లలో పెట్టుబడి సేకరించడం, బ్యాంకుల్ని నమ్మించటం కష్టమైంది. దిగుమతి చేసుకునే యంత్రాలకు ప్రత్యామ్నాయంగా, పదోవంతు ఖర్చుతో, సొంతంగా తయారు చేసి చూపించాను. నా ఆస్తి మొత్తం తాకట్టు పెట్టి, నిరంతరం ప్రయత్నించటం ద్వారా బ్యాంకులకు నమ్మకం కుదిరింది. మూడేళ్లలోనే ఋణం తీర్చేశాను. నన్ను మెచ్చి, నన్ను నమ్మి వచ్చిన వారిలో కొందర్ని ఎంచుకొని భాగస్వాములుగా చేసుకున్నాను. పని చేసే అవసరం ఉండీ, పని దొరకని వారిని సిబ్బందిగా తీసుకున్నా. స్వయం పర్యవేక్షణ, కలసి పని చేయటం, ఏ మాత్రం రాజీపడని నాణ్యత, ఖచ్చితమైన సమయానికి సరఫరా వంటి మార్గాల కారణంగా ఉత్పత్తి సజావుగా సాగడానికి , కష్టమర్ల మెప్పు పొందడానికి వీలుపడింది. వ్యాపారానికి సంబంధించినంత వరకు మానవ వనరుల నిర్వహణ అత్యంత క్లిష్టమైనది, కొత్త ఉత్పత్తులు చేపట్టడం, ఎప్పటికప్పుడు యంత్రాలను నవీకరించటం ద్వారా వ్యాపారాన్ని లాభసాటిగా నడపగలుగుతున్నాను. ఇక మానసిక ఒత్తిళ్లంటారా? నిజాయితీగా ఉన్నప్పుడు ఒత్తిడి సమస్య లేదు. నాతో పాటు నా భాగస్తులు, సీనియర్ స్టాఫ్ కూడా నిజాయితీపరులు కావడమే కలసి వస్తోంది.

వ్యాపారంలో మార్కెటింగ్‌కు ప్రధాన స్థానం వుంది. మా ఉత్పాదనలకు ఇతరుల కంటె మెరుగైన నాణ్యత, కొత్తదనం వలన మాకు మార్కెట్ దానంత అదే వచ్చింది, నిలబడింది. ఎంత కష్టపడి పని చేస్తే అంతగా ఫలితం కనిపించింది. అదే మాకు ఉత్సాహాన్నిచ్చింది. కొత్తగా బిజినెస్‌లోకి వద్దామనుకునేవారికి నేనిచ్చే సందేశమేమిటంటే – 'ఇష్టపడి శ్రమించు, నేర్చుకుంటూనే ఉండు ,నిన్ను నువ్వు నమ్ము, నిజాయితీగా ఉండు, పట్టు వదలకు, ఫలితం కోసం ఎదురుచూడకు!

✡ ✡ ✡

# శ్రీ జి.వి.రావు



బెంగుళూర్ నగరంలో 'గ్లోబల్ టెక్ సొల్యూషన్స్' పేరుతో 2005లో ఒక సంస్థ స్థాపించి విజయవంతంగా నిర్వహిస్తున్న శ్రీ జి.వి.రావు (వయసు 69 సం.లు) గారి స్వగతం –

'నేను లైఫ్ సైన్సెస్ పరిశ్రమలో, సైన్సుకి సంబంధించిన అనేక పరిశ్రమల్లో 32 సం.లు మేనేజర్‌గా పనిచేసి, మెరుగైన జీవితం కోసం, కొత్త అవకాశాల కోసం, లైఫ్ సైన్సెస్ రంగంలో ఎదురైన కొత్త సవాళ్లను ఎదుర్కోవడం కోసం 2005లో సొంత వ్యాపారంలోకి దిగాను. మా క్లయింట్లందరూ పెద్ద ఫార్మా కంపెనీలు. కంపెనీ పెట్టిన కొత్తల్లో వారితో వ్యవహరించడం, నేననుకున్న ప్రమాణాలకు అనుగుణంగా సిబ్బందిని తీర్చిదిద్దడం పెను సవాలుగా నిలిచింది. నాకు యీ రంగంలో వున్న అనుభవంతో బ్యాంకు ఋణం లభించింది. 5ఏళ్లలో మొత్తం ఋణం తీర్చివేయగలిగాను. నాకు భాగస్వాములెవరూ లేరు. ప్రొప్రయిటర్ సంస్థగానే నడుపుతున్నాను. సిబ్బందిని సిఫార్సుల మీద కాకుండా డైరక్టుగా చేర్చుకుంటాను. నెట్‌వర్కింగ్ ద్వారా టాలెంటు వున్న వారి కోసం అన్వేషిస్తూ వుంటాను.

వ్యాపారంలో కావలసినది క్లయింట్లతో, కష్టమర్లతో నిరంతరం టచ్‌లో వుంటూ, వారు మననుంచి ఏది ఆశిస్తున్నారో తెలుసుకోవడం, ఎంత కష్టపడైనా వారి అంచనాలను అందుకోవడం. కొందరు క్లయింట్లతో యిబ్బంది తప్పదు. కానీ వారిని కూడా మెప్పించడంలోనే మన ప్రజ్ఞ వుంది. సంస్థ కార్యకలాపాలపై నిరంతరం నిఘా వేసి వుంచి, సేవల నాణ్యతలో ఏ పొరపాట్లు దొర్లకుండా చూస్తూవుంటాను కాబట్టి యిప్పటిదాకా ఎటువంటి కష్టనష్టాలు రాలేదు.

కొత్తగా బిజినెస్‌లోకి వద్దామనుకునేవారికి నేనిచ్చే సందేశమేమిటంటే – 'క్లయింట్లను కలిసే ముందు బాగా హోమ్‌వర్క్ చేసుకుని వెళ్లు. వినియోగదారుడి నుంచి కొత్త విషయాలేమైనా వుంటే నేర్చుకో. నీ సిబ్బందితో కలిసి పని చేయి, నిజాయితీగా ఉండు,

GLOBAL TECH SOLUTIONS
Executive Search & Recruitment
People OutSourcing
Expect More From us

ముక్కుకు సూటిగా పో. ఫార్మా, బయోటెక్ వంటి ఆధునిక శాస్త్రాలలో అవకాశాలు వెతుకుతూ, ఎప్పటికప్పుడు నీ పరిజ్ఞానాన్ని పెంచుకో. మార్కెట్ సర్వే నిర్వహించి, అవకాశాలతో పాటు ప్రమాదాలు కూడా అంచనా వేసుకో. నీకు బాగా తెలిసి వున్న రంగమైతేనే వ్యాపారంలోకి దిగు. నీ సిబ్బందిలో టీమ్ వర్క్‌కు ప్రాధాన్యత యిస్తూ తరచుగా తర్ఫీదు యిస్తూ వుండు. ఫలితాల కోసం ఓపిక పట్టు. నెట్‌వర్కింగ్ బాగా వుండేట్లు మేన్‌టేన్ చేస్తూండు.

✡ ✡ ✡

**KAPILA YOGA ( KMRR)**

*Diploma Yoga Courses*

(online & offline )

* REGULAR YOGA CLASSES
* YOGA THERAPY TRAININGS

@ MORNING-TIMINGS

Srinagar colony-main road,
opp. Bank of Baroda
Hyderabad - 500 073
Ph : 98499 77607

**Place Courtesy** ➠

**HOLISTIC PHYSIOTHERAPY & MULTI REHABILITATION CENTER**

*Keeping You Active*

- Physiotherapy
- Paediatric Physiotherapy
- Occupational Therapy
- Speech Therapy
- Vision Therapy
- Audiology
- Swallow Therapy
- Yoga & Meditation

**Dr.K.Anand Kumar & Team of Doctors**

Srinagar colony-main road,
opp. Bank of Baroda
Hyderabad - 500 073
Ph : 98493 87914


180 బ్రాంచీలతో
సౌత్ ఇండియాలో అతిపెద్ద
ఫుట్‌వేర్ రిటైలు వ్యాపార సంస్థ
మీ సేవలో 59 సంవత్సరములు
POPULAR పాపులర్ షూ మార్టు
THE COMPLETE FAMILY FOOT WEAR SHOPPEE
WELCOME
పాపులర్ షూ మార్టు®
డోర్.నెం: 26-13-51, సన్యాసిరాజు వీధి, గాంధినగర్,విజయవాడ-520 003, ఆంధ్రప్రదేశ్. ఫోన్ : 0866-2571021, 2572286.

- 47 సంవత్సరాలుగా యోగ శిక్షణ,స్వధర్మ యోగి
- KMRR స్థాపించి 24 సం.లుగ యోగ ప్రచారం,సమాజ సేవ
- కపిల యోగా టీచర్ల బృందం కృషితో లక్ష మందికి పైగా యోగ ప్రదానం
- రెండు వేలమంది యోగాచార్యులకు వృత్తి పరమైన శిక్షణ, ఉపాధి
- Yoga 4 You, దేహము-యోగము, కపిల మహర్షి" పుస్తకాల రచయిత
- మద్రాసు తెలుగు అకాడెమీచే సమైక్య భారతి పురస్కారం (2005)



డా. సి.వి.రావు
స్వధర్మయోగి

"డా.సి.వి.రావు నాకు సుపరిచితులు. ఎప్పుడూ చురుగ్గా, ఉత్సాహంగా ఉంటూ తన యోగ వృత్తిలో గత 25 సం.లుగా మంచి ఆదరణ పొందుతున్నారు. ఒక వృత్తిలో చూపాల్సిన పనితనానికి గొప్ప పట్టాభిషేకం చేసిన ఈ "స్వధర్మయోగం" లోని అనేక అంశాలు ఆసక్తికరంగా, ఆచరణ యోగ్యంగా వున్నాయి. తమ ఉద్యోగంలో, వృత్తిలో మరింత రాణించాలనుకునే వారికి, 'నా దారి ఎటు ?' అనే సందిగ్ధతలో వున్న యువతకు ఈ పుస్తకం ఓ వరప్రసాదం లాంటిది. KMRR ట్రస్టును పెట్టి, దాదాపు 2000 మంది తన లాంటి ప్రొఫెషనల్ యోగా గురువులను తయారు చేశారు డా.సి.వి.రావు. వృత్తి కౌశల్యం పై ఇలాంటి సమగ్రమైన పుస్తకం వ్రాయటానికి ఇంతకంటే ఆయనకు అర్హత ఏమి కావాలి?"

**- డాక్టర్ కాకర్ల సుబ్బారావు**

'పద్మశ్రీ' పురస్కార గ్రహీత, Former DIRECTOR of NIMS

"This **"Swadharma Yogam"** book is a meaningful and inspiring message about our thoughts and mind towards work culture. It tells how to make our lives better by Dr. CV Rao, a wellknown Yoga master who changed the lives of thousands of people. Chapter-wise Audio book contents are nice and can reach a large number of readers.".

**- Dr.Ch.Vasanth Kumar** M.D.
Diabetologist - Apollo Hospitals,
Founder of "Diabetes And YOU" Society

"The author, Dr. CV Rao emphasized very well about the true values of professionalism and so many practical things along with the importance of joyful work-coordination. This kind of rare book "Swadharma Yogam" has to come out in English version too for the benefit of present-day young generation."

**- Prof. V.S.Prasad,** Ph.D
Former Vice-Chancellor,
Ambedkar University, Hyderabad


KAPILA

**KAPILA MAHARSHI RESEARCH FOR RESOURCES**
404, Sridurga Enclave, Jayaprakash Nagar,
Yellareddyguda, Hyderabad-500073
Ph : 040-2374 7607 Cell : 98499 77607
www.kapilayoga.org Email: feedback@kapilayoga.org